సాహితీ
గత వారం మార్కెట్లపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
9-2-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 09 పేజీలు: 10+4 వెల: 6.50



శత్రు డ్రోన్లను కూల్చివేసే డేగలు 3
కొత్తబడ్జెట్‌పై 16 నుంచి సన్నాహక సమావేశాలు 6







# కెసిఆర్ అవినీతిలో కిషన్‌కూ వాటా

## ఇప్పుడున్న జిల్లాల్లో మార్పులేదు.. సింగరేణి కార్మికులకు నష్టం రాదు

## రాష్ట్రంలో పేదలకు 4.5 లక్షల ఇళ్లు.. గోదావరి పుష్కరాలకు 2,3 వేల కోట్లు

### భూపాలపల్లి ఎన్నికల సభలో ముఖ్యమంత్రి రేవంత్


సభలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

**జయశంకర్ భూపాలపల్లి, ప్రభాతవార్త, ఫిబ్రవరి 8:** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కెసిఆర్ చేసిన అవినీతిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వాటా ఉందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో జయశంకర్ భూపాలపల్లి ఆదివారం జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి భూపాలపల్లి జిల్లాలోని రేగొండ కోడవటంచ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. రూ.12.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునర్ ప్రతిష్టాపన పనులు, అలాగే రూ.74.15కోట్లతో అతిథి గృహాలు, అంతర్గత రహదారుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను సీఎంప్రారంభించారు. అనంతరం కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడుతూ రూ. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్ అవినీతితో కూలిపోయి కూలేశ్వరంగా మారిందన్నారు. కాళేశ్వరం ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో కేసీఆర్ హరీష్ రావు అరెస్టు కాకుండా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారన్నారు. సోనియా రాహుల్ గాంధీలను సిబిఐ ఈడీలు కేసుల రూపంలో వేధిస్తున్నాయన్నారు ఫార్ములా వన్ కేసులో కేటీఆర్ అడ్డంగా దొరికిన ఈడి ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు కేసీఆర్ కేటీఆర్, హరీష్‌రావులను అరెస్టు కాకుండా అడ్డుకుంటున్న కిషన్ రెడ్డిని కల్వకుంట్ల కిషన్‌రావుగా పిలవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కిషన్‌రెడ్డి కెసిఆర్‌కు దత్తపుత్రుడుగా మారారని వ్యాఖ్యానించారు. బిజెపి ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందని తన ఆవేదన వెల్లబుచ్చుకున్న బిజెపి కెసిఆర్‌ను అరెస్టు చేయడంలో మీనవేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. తమ ప్రభుత్వం సింగరేణి కార్మికుల సమస్యలను >>2


ఆదివారం భూపాలపల్లి సభకు హాజరైన జనసందోహం

## మలేసియాతో సమగ్ర వ్యూహాత్మక

# భాగస్వామ్యం

### ఉభయదేశాల బంధానికి తమిళమే వారధి

### అన్వర్, మోడీ మధ్య ద్వైపాక్షిక చర్చలు

### కుదిరిన పలు కీలక ఒప్పందాలు

### మలయా వర్సిటీలో తిరువళ్లువర్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం

**కౌలాలంపూర్ /న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధికారిక పర్యటన సందర్భంగాభారత్– మలేసియా మధ్య పలు కీలక ఒప్పందాలు జరిగాయి. ఇది రెండుదేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో కొత్త ఊపును సూచిస్తున్నదని పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు. వ్యూహాత్మక, ఆర్థిక, సాంస్కృతిక, >>2


కౌలాలంపూర్‌లో మలేసియా ప్రధాని అన్వర్‌తో ప్రధాని మోడీ



## మే 3న నీట్ పరీక్ష

### ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

### షెడ్యూలు జారీ చేసిన ఎన్‌టిఎ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 08:** దేశంలోని అన్ని వైద్య సంస్థలలో అండర్ గ్రాడ్యుయేట్(యుజి) వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశం కోసం జాతీయస్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) నిర్వహిస్తున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ఎంట్రన్స్ టెస్ట్(నీట్ (యుజి)–2026 కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆదివారం నుంచి స్వీకరించడం ప్రారంభించింది. నీట్ యుజి –2026కి సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్‌టిఏ ఆదివారం జారీ చేసింది. నేషనల్ మెడికల్ కమిషన్ చట్టం, 2019లోని సెక్షన్ 14 ప్రకారం, అన్ని వైద్య సంస్థలలో అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యలో ప్రవేశం >>2

## మార్చిలోగా నక్సలిజం

# పూర్తిగా అంతం

### ఛత్తీస్‌గఢ్ సమీక్షలో హోంమంత్రి అమిత్‌షా



**రాయ్‌పూర్, ఫిబ్రవరి 8:** దేశంలో వచ్చే మార్చి 31లోపు నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. మావోయిస్టుల ఏరివేత అంశంపై ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31లోపు నక్సలిజాన్ని పూర్తిగా తుడిచివేస్తామన్నారు. వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతంలో మావోయిస్టుల నిధులను అడ్డుకోవడం, లొంగుబాటు చర్యలు, భద్రతా దళాల ఆపరేషన్స్,మౌలిక వసతుల కల్పనవంటి అంశాలుమావోయిస్టుల ప్రభావాన్నిగణనీయంగా తగ్గించాయన్నారు. >>2



### పంటలు సాగు చేయని భూమిగా గుర్తింపు

### రాష్ట్రవ్యాప్తంగా 8 నుండి 12 శాతం తేడా

### శాటిలైట్ మ్యాపింగ్ నివేదిక వెల్లడి

### వారంలోగా భరోసా నిధుల విడుదల

## 20 లక్షల ఎకరాలకు

## రైతు భరోసా

# బంద్!

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతు భరోసా పథకాన్ని అమలు చేయడంపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో రాష్ట్రంలోని దాదాపు 20 లక్షల ఎకరాలకు రైతు భరోసాను నిలిపివేయాలని నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ అధికవర్గాల ద్వారా తెలియవచ్చింది. ఈ విస్తీర్ణంలో ఎటువంటి పంటలు పండించడం లేదని గుర్తించింది. కేవలం కాగితాల్లో ఉన్న లెక్కలకే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతికతను ప్రభుత్వం రంగంలోకి దించింది. అగ్రికల్చర్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన శాటిలైట్ మ్యాపింగ్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. అగ్రికల్చర్ యూనివర్శిటీ రూపొందించిన పంట వివరాలను టెక్నికల్ కమిటీలో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్రంలో ఉన్న పట్టా భూమిలో 8 నుండి 12 శాతం సాగులో తేడా (20 లక్షల ఎకరాలు) కనిపిస్తున్నట్లు తెలిసింది. దేశంలోనే తొలిసారిగా శాటిలైట్ ఆధారిత టెక్నాలజీతో పంటల విస్తీర్ణం లెక్కింపును చేపట్టగా నీటి లభ్యత తక్కువగా ఉన్న వివిధ జిల్లాల్లో ఖాళీ భూముల శాతం అధికంగా ఉన్నట్లు తేలింది. ఒక గ్రామంలో 500 ఎకరాల సాగు యోగ్యభూమి ఉంటే అందులో 400 నుంచి 450 ఎకరాల్లో మాత్రమే పంటలు వేస్తున్నారని శాటిలైట్ ఇమేజెస్ స్పష్టం చేశాయి. అయితే, ఈ శాటిలైట్ మ్యాపింగ్ తో పంట బీమా అమలులో రైతులకు నష్టపరిహారం సకాలంలో అందడమే కాకుండా, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, కొనుగోళ్లు, అమ్మకాల్లో పారదర్శకత తీసుకురావడానికి ఉపయోగపడనుంది. ఈ డేటా ఆధారంగా అర్హులకు మాత్రమే రైతు భరోసా నిధులు జమ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కాగా పట్టా ఉన్న ప్రతి భూమికీ కాకుండా, వాస్తవంగా కేవలం పంటలు సాగు చేస్తున్న భూములకే రైతు భరోసా ఇవ్వనున్నట్లు ఇప్పటికే రాష్ట్ర >>2


ఇక మలేసియాలోను భారత్ యుపిఐ సేవలు 5
ఎఎఫ్ఆర్ శాటిలైట్‌తో అంతరిక్షంలో నిఘా 5



జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

## హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

### కెసిఆర్‌ను తప్పు పట్టడంపై ఉన్న శ్రద్ధ రేవంత్‌కు పాలనపై లేదు: ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి హరీష్

**జహీరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** శాసన సభ ఎన్నికల సందర్భంగా రేవంత్‌రెడ్డి చేసిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సంగారెడ్డి జిల్లా నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్, కుమార్ హోటల్, పస్తాపూర్ కమాన్‌ల వద్ద ఏర్పాటు చేసిన వీధి ప్రచార సభల్లో పాల్గొని ప్రసంగించారు. ఫెన్షన్లు 4వేలకు పెంచుతామని, రైతు బంధు, మహిళలకు 2500 పెన్షన్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల్లో 1లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందిస్తామని చేసిన హామీలను అధికారంలోకి వచ్చి రెండున్నర ఏండ్లు అవుతున్నా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జహీరాబాద్ >>2



## ఎక్స్‌అఫిషియోపై గత తీర్పు అమలు

### -హైకోర్టు ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి8:** మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా >>2

### సత్తా చాటేందుకు ఎవరి వ్యూహం వారిదే

### మద్యం, బిర్యానీ, నగదుతో ఓటర్లకు ఎర!

### 11న పోలింగ్‌కు అన్నిచోట్లా ఏర్పాట్లు పూర్తి



## మున్సిపల్ పోరుకు నేడు తెర

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి8:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల హడావిడి కొనసాగుతోంది. మున్సిపల్ పోరులో సత్తాచాటేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఎత్తులు, పైఎత్తులు వేస్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటుగా, విపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతలు కూడా ప్రచారం మొదలెట్టేశారు. ప్రచార పర్వం కూడా జోరుగా సాగుతోంది. మరోవైపు పోలింగ్ తేదీ అయిన ఫిబ్రవరి 11 సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను ఆకర్షించేందుకు పార్టీలు ఆఖరి అస్త్రాలను బయటకు తీస్తున్నా యి. ఎన్నికల ప్రచారం మరికొన్ని గంటల్లో ముగియనున్న నేపథ్యంలో మద్యం, బిర్యానీ, నగదుతో ఓటర్లను ఎరవేసేందుకు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. గతంలో గ్రామాలలోని ఎన్నికల టైంలో మద్యం ఎక్కువ పంపిణీ జరిగేది, ఇప్పుడు పట్టణాల్లో కూడా అంతకు మించి జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తమ ఊరిలో మద్యం పంచడం లేదంటూ ఓ యువకుడు చేయికోసుకున్న ఘటన సంగా రెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కానీఇప్పటికే పలు జిల్లాల్లో మద్యం ఏరులై పారుతున్నది. డబ్బుల పంపిణీతో పాటు మటన్.చికెన్ బిర్యానిల పంపిణీ జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ పోటాపోటీగా డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. ఆయాపార్టీల >>2



కౌలాలంపూర్‌లో ప్రధాని మోడీ, మలేసియా ప్రధాని అన్వర్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకొంటున్న ఇరు దేశాల మంత్రులు

# మలేసియాతో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం

>> సామాజిక రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టం చేయనున్నాయి. అలాగే డిజిటల్ సహకారం, భద్రత నుండి వృత్తి శిక్షణ, ఆరోగ్యం వరకు అనేక రంగాలలోనూ పరస్పర సహకారంపై అంగీకారం కుదిరింది. మలేషియా పర్యటనలో భాగంగా ఆదివారం ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ప్రధాని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రక్షణ, జాతీయ భద్రత, సెమీ కండక్టర్లు, వాణిజ్యం సహా పలు అంశాలపై ఇరువురు చర్చలు జరిపారు. సమావేశం అనంతరం ప్రధాని మోడీ మాట్లాడుతూ.. భారత్‌కు మలేషియాతో ప్రత్యేకమైన అనుబంధం ఉందని చెప్పారు. ఇరు దేశాలు విభిన్న రంగాల్లో సంబంధాలను మరింత శక్తిమంతం చేసుకునేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఉగ్రవాదంపై తమ సందేశం స్పష్టంగా ఉందని అన్నారు. ఈ విషయంలో ద్వంద్వ వైఖరికి, రాజీ వైఖరికి తావులేదని స్పష్టంచేశారు.

ఉగ్రవాద నిర్మూలనకు రెండు దేశాలు కలిసి సంయుక్తంగా పనిచేస్తాయని ప్రకటించారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో అభివృద్ధి, శాంతికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. ప్రపంచ వృద్ధి, వాణిజ్యానికి ఇండోపసిఫిక్ ప్రాంతం కీలకమని చెప్పుకొచ్చారు. భారత్ – మలేషియా దేశాలు సముద్ర సరిహద్దులు పంచుకుంటున్నాయని, ఇరుదేశాల ప్రజల మధ్య లోతైన ఆత్మీయ బంధం ఉన్నదని ప్రధాని చెప్పారు. ఇండో పసిఫిక్ ప్రాంతం ప్రపంచానికి వృద్ధి యంత్రంగా మారిందని పేర్కొన్నారు.

**భారత్‌మలేసియా బంధానికి తమిళమే వారధి**

భారత్, మలేషియా మధ్య సాంస్కృతిక సంబంధాలను తమిళ భాష బలంగా పెనవేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇరు దేశాల మధ్య తాజాగా కుదిరిన ఆడియో విజువల్ ఒప్పందం ద్వారా తమిళ చిత్రాలు, సంగీతం మన హృదయాలను మరింత దగ్గర చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కౌలాలంపూర్‌లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి ఆదివారం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు.

మలేషియా విద్య, మీడియా, సాంస్కృతిక జీవనంలో తమిళ భాషకు బలమైన, సజీవమైన ఉనికి ఉందని మోడీ ప్రశంసించారు. అంతకుముందు 'సెలమత్ దతాంగ్ మోడీజీ' కార్యక్రమంలో 12,000 మందికి పైగా ప్రవాస భారతీయులు, స్నేహితులు పాల్గొన్నారు. ఈ సభకు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా హాజరయ్యారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ప్రవాస భారతీయ సమాజం మలేషియాలో ఉందని, ఇరు దేశాల ప్రజల హృదయాలను కలిపే అంశాలు చాలా ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు.

మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంకు లెజెండరీ నటుడు ఎంజీఆర్ పాటలంటే ఎంతో ఇష్టమని మోదీ గుర్తుచేశారు. బటు కేవ్స్‌లో జరిగిన తైపూసం వేడుకలు, మలేషియాలో గర్బా నృత్యం ప్రాచుర్యం పొందడం మన సాంస్కృతిక బంధానికి నిదర్శనమని అన్నారు. తమిళం ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప బహుమతి అని, తమిళ సాహిత్యం శాశ్వతమైనదని కొనియాడారు.

భారత ఉపరాష్ట్రపతి, విదేశాంగ, ఆర్థిక మంత్రులు తమిళనాడుకు చెందినవారేనని ఆయన సభలో ప్రస్తావించారు. ఈ చారిత్రక స్ఫూర్తితో, ఇప్పటికే ఉన్న తిరువళ్లువర్ చైర్‌కు అదనంగా మలయా యూనివర్సిటీలో ఖితిరువళ్లువర్ సెంటర్‌ఖిను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించారు.

# మున్సిపల్ హోరుకు నేడు తెర

>> అగ్రనేతలు తమపార్టీల అభ్యర్థుల గెలుపు కోసం విస్తృత ప్రచారం చేస్తున్నా ఓటర్లను ఆకర్శించేందుకు మద్యం, బిర్యానీ, డబ్బుల పంపణీ మాత్రం తప్పడం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అంటే వారం రోజుల పాటు పెద్ద ఎత్తున మద్యాన్ని ఓటర్లు సేవించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.100 కోట్లు మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మూడు జిల్లాలు కలిపి సుమాకు లక్షకు పైగా బీర్ కేసులు, 80వేలకు పైగా లిక్కర్ అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది. దీంతో రోజుకు రూ.కోటీన్నర విలువ గల మద్యం అమ్మకాలు జరిగినట్లు తెలుస్తోంది. మున్సిపల్ కేంద్రాల్లో ఒక వార్డుకు 1500 నుంచి 3000 వరకు ఓటర్లు ఉన్నారు. యువతకు బీర్లు, పెద్దవాళ్లకు లిక్కర్ అందిస్తూ ఓటర్ల వద్ద పెద్ద తేడా రాకుండా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, సోమవారం సాయంత్రం 5 గంటలకు మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం ముగియనుంది. దీంతో ఆయా పార్టీల అగ్రనేతల ప్రచారం వేగం పరిగింది. కాంగ్రెస్ తరఫున సిఎం రేవంత్‌రెడ్డి ప్రతి రోజూ ఉమ్మడి జిల్లాల వారీగా ప్రచార సభలు నిర్వహిస్తున్నారు. టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులంతా ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. బిజెపి కూడా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు ఇతర కేంద్ర మంత్రులను వెంట తీసుకుని ప్రచారంలో బిజీగా ఉంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ కూడా రెండు, మూడు రోజుల క్రితం ఆదిలాబాద్‌లో బిజెపి తరఫున ఎన్నికల ప్రచారం చేసి వెళ్లారు. బిఆర్ఎస్ అగ్రనేతలు హరీశ్‌రావు, కెటిఆర్ ప్రతి రోజూ జిల్లాల్లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. మొత్తం 2996 మున్సిపల్ వార్డులకు ఎన్నికలు జరుగుతుండగా, బిజెపి తరఫున 2634 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ తరఫున 2948 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బిఆర్ఎస్ తరఫున 2878 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎంఐఎం 282 స్థానాల్లో పోటీ చేస్తుంది. 128 స్థానాల్లో సిపిఎం పోటీ చేస్తుండగా, 213 స్థానాల్లో బిఎస్‌పి పోటీ చేస్తుంది.

సిపిఐ 168 స్థానాల్లో, 288 స్థానాల్లో ఆల్‌ఇండియా ఫార్వర్ట్ బ్లాక్ స్థానాల్లో, ఏపీ డిప్యూటీ సిఎం, పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ 332 స్థానాల్లో పోటీ చేస్తుంది. తెలంగాణలో జనసేన అభ్యర్థుల గెలుపు కోసం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి పవన్ కళ్యాణ్ రాలేదు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున తెలంగాణ జాగృతి అభ్యర్థులు బరిలో దిగారు. ఈ మేరకు కల్వకుంట్ల కవిత ప్రచారం చేస్తున్నారు. కాగా, రాష్ట్రంలో అన్ని పార్టీల మున్సిపల్ ఎన్నికల ప్రచారాలు సోమవారం సాయంత్రంతో ముగిస్తున్నాయి.

# మే 3న నీట్ పరీక్ష

>> కోసం నీట్(యుజి)ని నిర్వహిస్తోంది. బిఏఎంఎస్, బియుఎంఎస్, బిఎస్ఎం కోర్సుల్లో యుజిలో ప్రవేశాలను నీట్‌లో వచ్చిన మెరిట్ ఆధారంగా భర్తీ చేయనున్న సంగతి తెలిసిందే. నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి కింద బిహెచ్ఎంఎస్ కోర్సులో ప్రవేశానికి కూడా నీట్(యుజి) వర్తిస్తుంది. నీట్ పరీక్షను మే 3న నిర్వహించనున్నారు. పరీక్షను 180 నిమిషాలు (03 గంటలు) పాటు నిర్వహిస్తారు. పరీక్షను మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. నీట్(యుజి)-2026 పరీక్షను 13 భాషల్లో నిర్వహించనున్నారు. అస్సామీ, బెంగాలీ, ఇంగ్లీష్, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ భాషలలో నిర్వహించనున్నారు. దరఖాస్తుల స్వీకరణను ఆదివారం(ఈ నెల8) నుంచి ప్రారంభించగా... మార్చి 8 వరకు స్వీకరించనున్నారు. ఫీజు చెల్లించడానికి మార్చి 8 రాత్రి 11.59 గంటల వరకు అవకాశమిచ్చారు. దరఖాస్తుల్లో తప్పులను సరి చేసుకోవడానికి మార్చి 10 నుంచి 12 వరకు అవకాశం కల్పించారు. పరీక్ష ఫీజును జనరల్ అభ్యర్థులకు రూ. 1700గా నిర్ణయించగా.. జనరల్ ఈడబ్ల్యూఎస్, ఓబిసి(ఎన్‌సిఎల్) అభ్యర్థులకు 1600గానూ, ఎస్సీ, ఎస్టీ, పిడబ్ల్యూబిడి, థర్డ్ జండర్ అభ్యర్థులకు రూ. 1000గా నిర్ణయించారు. విదేశాల్లో ఉండేవారికి రూ. 9500గా నిర్ణయించారు.

# రైతు భరోసా బంద్!

>> ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు గాను శాటిలైట్ మ్యాపింగ్ ఆధారంగా రైతు భరోసాకు సంబంధించిన ఆర్థిక సాయం పంపిణీ చేపట్టనుంది. ఈ యాసంగి సీజన్ నుంచే ఈ కొత్త నిబంధనలను అమలు చేసేందుకు కసరత్తు చివరిదశకు చేరుకుంది. వానాకాలం సీజన్లో జరిగిన సాగు వివరాలను ప్రాతిపదికగా తీసుకొని అర్హులైన రైతులకు నగదు జమ చేయాలని భావిస్తున్నది. కాగా వానాకాలం, యాసంగి పంటల సాగు సమయంలో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు తెలంగాణ సర్కార్ రైతు భరోసా పేరిట అర్హులైన రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ. 6వేల చొప్పున జమ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుల ఖాతాల్లో నగదు జమ కావాల్సి ఉంది. ఆ నగదు కోసం రైతులు ఇప్పటికే ఎదురు చూస్తున్నారు. అయితే, రైతుభరోసా డబ్బులు రెండు మూడు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ఆర్థిక శాఖ ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

## వారం - వర్జ్యం

09-02-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
అష్టమి పూర్తి
విశాఖ పూర్తి
వర్జ్యం : ఉ.11.19-1.06
దు.మ.12.46-1.32,
మ.3.04-3.50
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రజాసంబంధాలను మరింతగా విస్తృత పరచుకోవడానికి గాను ప్రయత్నాలను ముమ్మరం చేస్తారు. వస్త్రలాభం.

**వృషభం:** బ్యాంక్ లావాదేవీలలో తేడాలను, లోపములను పరిశీలించి మౌనంగా చర్యలు తీసుకుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం.

**మిథునం:** వివాదస్పద అంశాలకు దూరంగా ఉండటం మంచిది. కార్యాలయంలో పరిస్థితులు మీకు అనుకూలంగా ఉంటాయి.

**కర్కాటకం:** దూరప్రయాణాలలో నూతన వ్యక్తుల పరిచయాలు ఏర్పడతాయి. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**సింహం:** పరపతిని పెంచుకోవడానికి గాను మీరు చేసే యత్నాలు నామమాత్రంగా ఫలిస్తాయి. ప్రతిష్టను నిలబెట్టుకుంటారు.

**కన్య :** మిత్రులతో చర్చిస్తారు. అభివృద్ధి కార్యక్రమములు ఆచరణలోనికి వస్తాయి. ప్రకటనలు లాభిస్తాయి. వస్త్రలాభం.

**తుల :** స్పెక్యులేషన్ వైపుకు మొగ్గు చూపే కన్నా స్థిరాస్తుల కొనుగోళ్ళపైన పెట్టుబడిని మదుపు చేయటం మంచిది. వాహనసౌఖ్యం.

**వృశ్చికం:** ఆధునిక సాంప్రదాయ పద్ధతులను వ్యతిరేకిస్తాయి. దూర ప్రాంతముల లోని మీ వారికి సాయం చేస్తారు.

**ధనుస్సు:** మీ శక్తి సామర్థ్యములు ప్రతిభ, ఆకస్మికముగా కొంతమందికి గుర్తుకు వస్తాయి. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మకరం:** ఋణాలను ఇవ్వకపోవడం ఉత్తమం. బరువైన కొన్ని బాధ్యతలను దించుకుంటారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**కుంభం:** మంచి అవకాశములను గురించి గతములో చేసిన ప్రయత్నములు ఇప్పుడు అక్కరకు వస్తాయి. వాహనసౌఖ్యం.

**మీనం :** వృత్తి, వ్యాపారాల స్థితి చెప్పుకో తగిన స్థాయిలో మెరుగపడుతుంది. నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కెసిఆర్ అవినీతిలో కిషన్‌కూ వాటా

>> పరిష్కరించడంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు మెడికల్ బోర్డును కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తుందని విష ప్రచారం చేస్తున్న వారికి దెబ్బలు పడతాయని హెచ్చరించారు. భూపాలపల్లి డివిజన్లో డిస్మిస్ అయిన 217 మంది కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికులు నిండు మనసుతో పనిచేయడం వల్లనే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. ఈ ప్రభుత్వం సింగరేణి కార్మికులకువారికి నష్టం కల్గించే పనిచేయదన్నారు. వైఎస్ హయాంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించమన్నారు. డబల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని కేసీఆర్ మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేశాడన్నారు. కేసీఆర్‌కు ఎర్రవల్లిలో వెయ్యి ఎకరాల్లో ఎర్రవల్లిలో, కేటిఆర్‌కు జన్వాడలో 100 ఎకరాల్లో ఫామ్ హౌస్, హరీష్ రావు, కవిత, సంతోష్ రావులు ఫామ్ హౌస్‌లు కట్టుకున్నారు కానీ పేదలకు ఇండ్లు మాత్రం కట్టించలేదన్నారు. 10 ఏండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ఏడాదికి 2 లక్షల ఇళ్లు కట్టిన పదేళ్లలో 20 లక్షల ఇళ్లు కట్టే అవకాశం కేసీఆర్‌కు ఉండేదన్నారు. ఏనాడు పేదల ఆత్మగౌరవాన్ని పట్టించుకోలేదని, పేదలపైన ఆయనకు ప్రేమ లేదన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని, రాష్ట్రంలో 22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. వచ్చే బడ్జెట్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. పేదల ఆత్మగౌరవం పెరిగేలా, ఆడబిడ్డలు ఆశ్వీరధించేలా ఇందిరమ్మ ఇళ్లు రెండో విడత మంజూరు చేస్తాం.. 2025 మేలో జరిగిన సరస్వతి పుష్కరాలను అద్భుతంగా నిర్వహించమన్నారు. 2027 సంవత్సరంలో రానున్న గోదావరి పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తమ ప్రభుత్వం 2,3 వేల కోట్లను ఖర్చు చేసేందుకు కూడా వెనకాడదన్నారు. అదిలాబాద్ బాసర సరస్వతి అమ్మవారి టెంపుల్ నుంచి భద్రాచలం రాములోరి ఆలయం వరకు గోదావరి ఒడ్డున ఉన్న ప్రతి ఒక్క ఆలయంలో సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. రూ. 250 కోట్లతో మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను తమ ప్రభుత్వంఅద్భుతంగా నిర్వహించిందన్నారు రాబోయే రోజుల్లో దక్షిణ కుంభమేళాగా మేడారం నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. మున్సిపల్ శాఖ మంత్రిగా తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు ఈ రెండేళ్ల పాలనలో రూ. 17వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు ఒక్క ఉమ్మడివరంగల్ జిల్లాలోని మున్సిపాలిటీలకే రూ.6,600 కోట్లను కేటాయించడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ బిజెపి బిల్లా రంగాలుగా మారి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్సును ఎదుర్కొనేందుకు కలిసి పనిచేస్తున్నాయన్నారు. రెండు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ మూడుసార్లు ప్రధానమంత్రిగా పనిచేస్తున్న నరేంద్ర మోడీ మునిసిపాలిటీల అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని అభివృద్ధి చేయాలన్న కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. దెబ్బకు దెబ్బ కొట్టి అన్ని మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం మహిళా సంఘాలకు 205 కోట్ల రూపాయలు బ్యాంకు లికేంజి అంద రుణాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటి పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పార్లమెంటు సభ్యులు డా కడియం కావ్య, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, 20 సూత్రాల అమలు చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సింగరేణి కార్మిక సంగం చైర్మన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు రాజబాబు, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చిలోగా నక్సలిజం పూర్తిగా అంతం

>> ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వ అధికారులు, భద్రతా దళాలతో ఈ సమావేశం జరిగిందని అమిత్ షా వెల్లడించారు. కొన్నేళ్లుగా నక్సల్స్ కార్యకలాపాలు బలహీనంగా మారాయన్నారు. ఈ సమావేశానికి చత్తీస్‌ఘడ్ సీఎం విష్ణు దేవ్ సాయి, డీసీఎం విజయ్ శర్మ, కేంద్ర హోం శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోలు ఎక్కువగా ఉంటారు. ఈ ప్రాంతం మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ, ఒడిశాలతో సరిహద్దు పంచుకుంటుంది. ఛత్తీస్‌ఘడ్ పోలీసులు వెల్లడించిన డాటా ప్రకారం ఈ ప్రాంతంలో 2024 నుంచి 500 మందికిపైగా నక్సలైట్లు ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయారు. వీరిలో మావో అగ్రనేత నంబాల కేశవరావు కూడా ఉన్నారు. ఈ రెండేళ్ల కాలంలో 1,900 మందికిపైగా నక్సలైట్లు అరెస్టయ్యారు. 2,500 మందికిపైగా లొంగిపోయారు. యాంటీ నక్సల్ ఆపరేషన్‌పై అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, ఝార్ఖండ్ రాష్ట్రాల అధికారులు, కేంద్ర సంస్థలు, భద్రతాబలగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వామపక్ష తీవ్రవాదంపై పోరాటంలో భాగంగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని ఎక్స్ వేదికగా వివరించారు. వచ్చేనెల 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని పునరుద్ఘాటించారు. భద్రతా వ్యూహాలు, మావోయిస్టుల ఆర్థిక నెట్‌వర్క్‌లను దెబ్బతీయడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, లొంగుబాటు పాలసీల వంటివి నక్సలిజంపై పోరాటంలో సత్ఫలితాలు ఇచ్చాయని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా మావోయిస్టులపై కేంద్రం ఉక్కుపాదం మోపుతోంది. నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు తీవ్రతరం చేసింది.

# ఎక్స్‌అఫిషియోపై గత తీర్పు అమలు

>> ఎక్స్‌అఫిషియో సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనడంపై గతంలో హైకోర్టు డివిజన్ బెంచ్ జారీచేసిన మార్గదర్శకాలను ప్రభుత్వం అమలు చేయాల్సిందేనని సింగిల్ జడ్జి స్పష్టంచేశారు. ఎమ్మెల్యేలు, లోక్‌సభ సభ్యులు వారి నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు మున్సిపాలిటీల్లో ఓటు హకు వినియోగించుకోవాలని గతంలో ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. దీంతో ఎక్స్‌అఫిషియో సభ్యులు ఎవరెవరు ఓటు వేయాలనేది మున్సిపల్ చట్టసభ్యులు ఎంచుకోవాలని ప్రజాప్రతినిధులకు నిర్మల్ కలెక్టర్ లేఖ రాయడాన్ని సవాలు చేస్తూ కత్తి నరేందర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు.



యుఎఇకి చెందిన ప్రవాస భారతీయ విద్యార్థులతో ఆదివారం న్యూఢిల్లీలో భేటీ అయిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

# కాంగ్రెస్ సర్కార్ విఫలం

>> పట్టణంలో అన్ని కుల సంఘాలకు స్థలాలతో పాటు భవనాల నిర్మాణానికి కోటి రూపాయలను మంజూరు చేశామని గుర్తు చేశారు. హజాపూజ్ షాదీ ఖానాలకు కోటి రూపాయలను మంజూరు చేస్తే సంగం నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం వాపస్ చేసిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో పట్టణంలో సెంట్రల్ లైటింగ్, ఇంటింటికి నల్ల ఏర్పాటు చేశామన్నారు. బిఆర్ఎస్ వల్లే అజారుద్దీన్‌కు మంత్రి పదవి లభించిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఓటు వేస్తే ఆ ఓటు మురికి కాల్వలో వేసినట్టే అవుతుందని, బిజెపితో ఒరిగేమి లేదన్నారు. బిజెపి పైసాకు కూడా అమ్ముడు కాదని విమర్శించారు.

మహారాష్ట్రలో ఎంఐఎం పార్టీ బిజెపితో మున్సిపల్ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని డిప్యూటీ మేయర్ పదవిని తీసుకుని సెక్యూలరరిజానికి తూట్లు పొడిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో ఓట్లతో బుద్ధిచెప్పాలని సూచించారు. మొన్సిపల్ ఎన్నికల్లో 37వార్డులలో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి మున్సిపల్‌కు పంపాలని, మున్సిపల్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే మానిక్‌రావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ శివకుమార్, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి దేవి ప్రసాద్, ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం, బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులు ఎం వేణుగోపాల్, ఎండి తంజీం, సయనయద్ మోయుద్దీన్, స్రవంతి నామకిరణ్, మంజుల, ముత్యాల శివకుమార్, మహిపాల్ విజయలక్షి, పురుషోత్తంరెడ్డి పుష్ప, ఎన్ విజయలక్ష్మి, జహీర్ అలీ, యాకూబ్, బండి మోహన్, అబ్దుల్లా, నాయకులు నామ రవికిరన్, తట్టు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడులపై తెలంగాణ కీలక నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి8:** పెట్టుబదుల గ్రౌండింగ్ వేగవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది రాష్ట్రానికి రెండేండ్లలోనే రికార్డు స్థాయిలో రూ.8.81 లక్షల కోట్ల పెట్టుబడులు వెల్లువెత్తాయిఈ ఎంవోయూల అమలు బాధ్యతలను స్పీడ్ విభాగానికి అప్పగించారు. ఆయా సంస్థలు, శాఖలను సమన్వయం చేసి పర్యవేక్షి ంచేందుకు రియల్ టైమ్ డాష్ బోర్డు రూపొందిస్తున్నారు. ఈ పనికి ప్రత్యేకంగా ప్రతి శాఖలో సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ అధికారిని నియమించాలని చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తాజా ఆదేశాలు జారీ చేశారు.

# వయా విజయవాడ.. రెండు ప్రత్యేక రైళ్లు

**విజయవాడ.ఫిబ్రవరి 8,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ మీదుగా నిత్యం ప్రయాణించే వారికి రైల్వే శాఖ అధికారులు మంచికబురు తెలిపారు. పలు అవసరాల రిత్యా చాలామంది తరుచూ ప్రయాణాలు చెస్తుంటారు. ఈ క్రమంలో ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్తారు. విజయవాడ మీదుగా వెళ్లే వారి సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటనలో వెల్లిడించారు. 07033/07034 కాకినాడ టౌన్ – మైసూర్ ప్రత్యేక రైలు ఏర్పాటు చేసారు. ఈ రైలు రాకపోకలు మార్చి 2వ తేదీ నుంచి మార్చి 31 వరకు సాగిస్తుంది. ఇది సుమారు 20కి పైగా స్టేషన్లలో ఆగుతుందని రైల్వే అధికారులు తెలిపారు. సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యలహంక, బెంగళూరు, మాండ్య తదితర స్టేషన్‌లో ఆగుతుంది. 07153/07154 బెంగళూరు నర్సాపూర్ ప్రత్యేక రైలు బెంగళూరు నుంచి నర్సాపూర్

మీదుగా ప్రత్యేక రైలు మార్చి 6వ తేదీ నుంచి మార్చి 28 వరకు రాకపోకలు సాగిస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు పాలకొల్లు, వీరవాసరం, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, కృష్ణరాజపురం తదితర దాదాపు 15కు పైగా స్టేషన్లలో ఆగుతుంది.

### తల్లితండ్రుల సంరక్షణకోసం

# 45 రోజుల సెలవును చట్టబద్ధంచేయాలి

## రాజ్యసభ జీరో అవర్‌లో యుపి ఎంపి సుమిత్రా వాల్మీకి డిమాండ్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ కోసం ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు అందరికీ ఏడాదిలో కనీసం 45 రోజుల పాటు తప్పనిసరి సెలవు మంజూరు చేయాలని ఉత్తర ప్రదేశ్ ఎంపీ సుమిత్రా వాల్మీకి రాజ్యసభలో గళమెత్తారు. జీరో అవర్‌లో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావించి దేశవ్యాప్తంగా చర్చకు తెరలేపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఇబ్బందుల్లో యువత వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, ఉపాధి అవకాశాల కోసం యువత తమ సొంత గ్రామాలను, తల్లిదండ్రులను వదిలి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని సుమిత్రా వాల్మీకి ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు పూర్తిగా ఒంటరి వారు అవుతున్నారని ఆమె గుర్తు చేశారు. ముఖ్యంగా వారికి అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఆసుపత్రులకు తీసుకెళ్లడానికి, పక్కనే ఉండి సేవ చేయడానికి కొడుకు లేదా కూతురు ఉండటం అత్యంత అవసరమని, కానీ ఆఫీసుల్లో సెలవులు దొరక్క యువత తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆమె వివరించారు. 2026 నాటికి భారతదేశం అత్యధిక యువశక్తి కలిగిన దేశంగా ఉన్నప్పటికీ.. వృద్ధుల సంఖ్య కూడా అంతే వేగంగా పెరుగుతోందని ఎంపీ గణాంకాలను వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో 14.9 కోట్ల మంది సీనియర్ సిటిజన్లు ఉండగా 2036 నాటికి ఈ సంఖ్య 23 కోట్లకు చేరుతుందని పేర్కొన్నారు. అంటే భవిష్యత్తులో ప్రతి ముగ్గురు భారతీయుల్లో ఒకరు వృద్ధులే ఉంటారని ఈ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే పేరెంటల్ కేర్ లీవ్ వంటి విధానాలను చట్టబద్ధం చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. కేవలం మహిళల అభ్యున్నతి లేదా యువత సాధికారతపైనే కాకుండా వృద్ధుల సంరక్షణపై కూడా ప్రభుత్వం విధాన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం వచ్చిందని ఎంపీ సుమిత్రా వాల్మీకి స్పష్టం చేశారు. 60 ఏళ్లు దాటిన తల్లిదండ్రులు ఉన్న ప్రతి ఉద్యోగికి వారిని చూసుకోవడానికి ఆఫీసు నుంచి ఎలాంటి ఆటంకాలు లేకుండా 45 రోజుల సెలవు దొరికితేనే వృద్ధుల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని ఆమె అభిప్రాయపడ్డారు.

# ప్రియ మిత్రుడు ట్రంప్‌తో సంభాషించా...

## 18% సుంకాలు తక్షణమే అమలులోకి

## సోషల్‌మీడియాలో ప్రధాని మోడీ పోస్ట్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ప్రియమిత్రుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌తో జరిగిన ఫోన్ సంభాషణ అద్భుతమని, మేడిన్ ఇండియా ఉత్పత్తులు ఇకపై అమెరికాలో 18శాతం సుంకాలు మాత్రమే అమలవుతాయని ట్రంప్ స్పష్టంచేసారని ప్రధాని నరేంద్రమోడీ వెల్లడించారు. ఆదివారం తాను అమెరికా అద్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడానని మా ఇద్దరిమధ్య చర్చలు అద్భుతంగా సాగాయన్నారు. 18శాతానికి సుంకాల తగ్గింపుపై అద్యక్షుడు ట్రంప్‌నకు భారత్ 140 కోట్లమంది ప్రజల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రపంచంలోని రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థలు, అ తిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలున్న దేశాలు కలిసి పనిచేస్తే రెండుదేశాలప్రజలకే కాకుండా ప్రపంచదేశాలకు ఎంతో మేలు ప్రయోజనం కలుగుతుందని పరస్పర సహకరించుకునేందుకు మరెన్నో అవకాశాలు ఉంటాయని ప్రధాని పేర్కొన్నారు. ప్రపంచ శాంతికి అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వం ఎంతో కీలకమని, ప్రంచ శాంతి, సుస్థిరత, సామరస్యం కోసం ట్రంప్‌చేస్తున్న కృషి శ్లాఘనీయమని అన్నారు.

# కిడ్నాప్ కేసులో విచారణకు రావాలని మంచు విష్ణుకు నోటీసులు

**తిరుపతి,పిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** ఇద్దరు విద్యార్థిసంఘం నేతలను కిడ్నాప్ చేసిన కేసులో విచారణకు హాజరుకావాలని ఎంబియూ డైరెక్టర్, మా అధ్యక్షుడు మంచు విష్ణుకు తిరుపతి రూరల్ తిరుచానూరు పోలీసులు నోటీసులు పంపారు. ఈనోటీసులను అందుకున్న మూడురోజుల్లో తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు విచారణకు రావాలని పేర్కొన్నారు. అయితే ఈ కేసులో విచారణకు 15వతేదీ తరువాత హాజరువుతానని విష్ణు పోలీసులకు సమాధానం పంపారు. ఇద్దరు విద్యార్థినేతల కిడ్నాప్ కేసులో విష్ణు ఏ2గా ఉన్నాడు.

ఎంబియూలో అధిక ఫీజులు వసూలుచేస్తున్నారని ఆరోపిస్తూ ఫిర్యాదుకు కలెక్టరేట్‌కు వెళుతుండగా ఘటన జరిగింది. ఇందులో ఏ1గా పిఆర్ఒ రావూరు సతీశ్,ఎ2గా మంచు విష్ణు,ఎ3గా మంచు మోహన్‌బాబును పోలీసులు కేసులో చేర్చారు. తాజాగా విష్ణుకు రెండు నోటీసులు అందాయి. ఇదే సమయంలో ఈ కేసును కొట్టివేయాలని మోహన్‌బాబు హైకోర్టును ఆశ్రయించారు. విష్ణు పోలీసుల ఎదుట హాజరైతే జరగనున్న పరిణామాలు ఏంటనేది చూడాల్సిందే.




ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరులో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

# రేవంత్ బిజెపి మనిషే..

## కాంగ్రెస్ మోసాలకు ఓటుతోనే బుద్ధి చెప్పాలి : కెటిఆర్

**తాండూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏనాటికైనా బిజెపి మనిషి అని, కాంగ్రెస్ ముసుగులో ఉండి పార్టీని మోసం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారాక రామారావు అన్నారు. రాష్ట్రంలో బీజేపీతో కలిసి బీఆర్ఎస్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని, ఇచ్చిన హామీలను పక్కన పెట్టి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరులో మాజీ ఎమ్మెల్యే ఫైలట్ రోహిత్‌రెడ్డి ఆద్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అథితిగా హాజరై ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికైనా బీజేపీ మనిషి అని ఆరోపించారు. దేశంలో రాహుల్ గాంధీ ప్రధాని మోడీని చౌకీదార్ అని అంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం మా బడేబాయి అని పిలుస్తున్నారని అన్నారు. ఎప్పుడైనా రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ను ఆగం చేసి బీజేపీలో చేరడం ఖయమన్నారు. బీజేపీ, కాంగ్రెస్ తోడు దొంగలే అని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చాక ఏ ఒక్క పథకం సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఆరు గ్యారెంటీలకు ఆశపడి కాంగ్రెస్ అధికారమిస్తే ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్ పార్టీని తిట్టడమే పనిగి పెట్టుకున్నారని మండిపడ్డారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా రెండేళ్లు మాత్రమే అధికారంల ఉంటుందని.. ఆ తరువాత " కేల్ కతం ".. అని, మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని అన్నారు. హామి ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తే.. లాగులో తొండలిడుస్తా బిడ్డా అని.. గుడ్లు పీకుతా.. మెడలే పేగులేసుకుంటా అని దిగజారుడు మాటలాడుతారని, అందుకే ఆయనను రేవంత్‌రెడ్డి అని పిలువడం మానేశా అని.. అనుముల రేవంత్‌రెడ్డి అని కాకుండా.. లాగుల తొండల రెడ్డి అని పిలవడం మొదలు పెట్టానని అన్నారు. ఇలాంటి దిగజారుడు మాటలాడే ముఖ్యమంత్రికి ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్పాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అందరు ఆలోచించి బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తాండూరు మున్సిపాల్టీపై బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ శ్రీశైల్‌రెడ్డి, బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నర్సింలు, కౌన్సిలర్ అభ్యర్థులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే బిల్లులు పెంచుతారు

## మున్సిపాలిటీని బిజెపికి అప్పగించండి

### కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

**చొప్పదండి, ప్రభాతవార్త:** పురపాలక సంఘం ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఇంటి బిల్లులు నల్ల బిల్లులు విద్యుత్ బిల్లులు పెంచుతారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు .ఈ మేరకుమున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చొప్పదండి పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో ఆయన ముఖ్య అతిధి గా హాజరు అయ్యి , మాట్లాడారు. చొప్పదండి మున్సిపాలిటీ ను బీజేపీ కి అప్పగిస్తే కేంద్రం నిధులతో స్మార్ట్ చొప్పదండి గా మారుస్తానని హామీ ఇచ్చారు. కేంద్రం నుంచి మోడీతో మాట్లాడి నేరుగా చొప్పదండి అభివృద్ధికి నిధులను తీసుకొని వస్తానని అన్నారు తనను మోడీ స్వయంగా పంపించారని పేర్కొన్నారు కేంద్రం నిధులతో చొప్పదండి పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గుణవంతులని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ధనవంతులని అన్నారు గుణవంతులకు ఓటు వేసి గెలిపించుకుంటే అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు మున్సిపల్ చైర్ పర్సన్ ను ప్రజలు కట్టబెట్టాలని అభివృద్ధి ఏంటో చూపిస్తానని తెలిపారు.పదేళ్లు అధికారం లో ఉన్న బి ఆర్ఎస్ ప్రభుత్వం ఏమి అబివృద్ధి చేయలేదని , అలాగే 2 ఏళ్లుగా అధికారం లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అబివృద్ధి దూరంగా ఉందని అన్నారు మహిళలకు 2500 ఇవ్వడంలేదని కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇవ్వడం లేదని మహిళలకు స్కూటీలు ఇస్తామని అవి కూడా ఇవ్వడం లేదని అన్నారు, బిజెపినీ గెలిపిస్తే తగురుమామిడి ప్రజలకు ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జిని స్థానంలో నూతన బ్రిడ్జి నీ తనే స్వయంగా తన నిధులతో నిర్మిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు చిల్ల శ్రావణ్, మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జ్ సురభి నవీన్ రావు మాజీ అధ్యక్షులు బత్తిని ప్రశాంత్, పట్టణ ప్రధానకార్యదర్శి గుండేటి వెంకటరమణ మండల అధ్యక్షులు మొగిలి మహేష్ సీనియర్ నాయకులు కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, గొల్ల గట్టయ్య, తోట కోటేష్,బిజెపి పార్టీ అభ్యర్థులు పెంచికుల రమాదేవి , చేపూరి హేమ, చిల్ల అర్చన,వడ్లూరి సుధాకర్, పెద్దేలి గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదంపై దుష్ప్రచారం నమ్మవద్దు

## ఓటుకు నోటు కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసు సాక్ష్యాలు సురక్షితం

### ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖాగోయల్ వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** నగరంలోని నాంపల్లిలో గల ఫోరెన్సిక్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో శనివారం సంభవించిన అగ్నిప్రమాదంపై సోషల్ మీడియాతోపాటు ఒక వర్గంలో దుష్ప్రచారం జరుగుతుందని, ఇవన్నీ అవాస్తవాలని ఆ విభాగం డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. 2015 నాటి ఓటుకు నోటు కేసు సహా రెండేళ్ల క్రితం వెలుగు చూసిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన ఫైళ్లు, ఇతరత్రా ఆధారాలు సురక్షితంగా ఉన్నాయని, ఇవన్నీ కాలిపోయాయని వస్తున్న వార్తలు నిరాధారమని ఆమె వెల్లడించారు. ఆదివారం ఉదయం ప్రమాదం జరిగిన ఎఫ్ఎస్ఎల్ మొదటి అంతస్తును ఆమె సందర్శించారు. ప్రమాదంలో కాలిపోయిన కంప్యూటర్లతో పాటు ఇతర ఉపకరణాలను ఆమె పరిశీలించారు. అనంతరం మీడియాతో శిఖా గోయల్ మాట్లాడారు. ఎఫ్ఎస్ఎల్‌లో సంభవించిన అగ్నిప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారని, మరోవైపు తాము కూడా శాఖాపరంగా విచారణ చేస్తున్నామని, అగ్నిమాపక శాఖ విచారిస్తోందని ఆమె తెలిపారు. ఎఫ్ఎస్ఎల్‌లో ఉదయం పది గంటల 18 నిమిషాలకు అగ్ని ప్రమాదం సంభవించగా మధ్యాహ్నం 1.30 గంటలకు మంటలను అదుపు చేశారని ఆమె తెలిపారు. అయితే ఎఫ్ఎస్ఎల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ఆదివారం మీడియాలో వచ్చిన వార్తలపై ఆమె వివరణ ఇచ్చారు.



మీడియాతో పాటు సోషల్ మీడియాలో వచ్చినట్లుగా ఓటుకు నోటు కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన ఎలాంటి సాక్ష్యాలు, ఆధారాలు కాలిపోలేదని, ఇవన్నీ భద్రంగానే వున్నాయని ఆమె తెలిపారు. ఓటుకు నోటు కేసులో 2021 మార్చి నెలలోనే అన్ని ఆధారాలు ఎసిబి కోర్టుకు సమర్పించామని ఆ మె వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించిన ఒక్క ఫైల్ కూడా ఎఫ్ఎస్ఎల్‌లో లేదని, అటువంటపుడు ఇవి కాలిపోయాయని ఎలా చెబుతారని ఆ మె ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి పంజాగుట్టలో 2024లో నమోదైన కేసులో ఆనాటి నుంచి 2026 జనవరి నెల వరకు అందిన 132 మెటిరీయల్ అబ్జెక్టులను పూర్తిగా పరిశీలించామని, ఇవన్నీ సురక్షితంగా వున్నాయని ఆమె తెలిపారు. ఇందులో కొన్ని ఇప్పటికే కోర్టుకు సమర్పించామని ఆమె తెలిపారు. ఇక ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన డాక్యుమెంట్లు, ఇతర ఉపకరణాలు ఇప్పటికే ఆయా కోర్టుల్లో అందజేసినవని, వీటికి సంబంధించిన అసలైనవి ఆయా కోర్టుల్లో భద్రంగా వున్నాయని శిఖా గోయల్ వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగ లేదని. మొదటి అంతస్తులోని లైబ్రరీ హెచ్ఆర్‌డి గదిలో మంటలు చెలరేగాయని ఆమె తెలిపారు. ఈ ప్రమాదంపై జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నామని, దీనిపై నివేదిక రూపొందిన తరువాత అన్ని విషయాలు వెల్లడిస్తామని ఆమె తెలిపారు.

ఇక ఎఫ్ఎస్ఎల్‌లో వున్న ఆధారాలు ఏమైనా కాలిపోయిన పక్షంలో వాటిని తిరిగి పునరుద్ధరించే సామర్థ్యం ఇక్కడి సిబ్బందికి వుందని ఆమె తెలిపారు. శిఖా గోయల్ వెంట నగర ఉత్తర మండల డిఐజి శ్వేత రెడ్డి సహా ఇతర అధికారులు వున్నారు.

### అగ్నిప్రమాదంపై కొనసాగుతున్న విచారణ

### ప్రమాదం జరిగిన అంతస్తు సీజ్

ఇదిలా ఉండగా ఎఫ్ఎస్ఎల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై పోలీసుల విచారణ మొదలయ్యింది. ఎఫ్ఎస్ఎల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేధారు. మొదటి అంతస్తులోని ఐదు గదుల్లో గల ఫైల్స్ కాలిపోయినట్లు ఆయన తన ఫిర్యాదులో తెలిపారు. కంప్యూటర్ ఫోరెన్సిక్ ల్యాబ్, ప్రాపర్టీ రూంతో పాటు కేసుల వెరిఫికేషన్ చాంబర్, అనాలసిస్ చాంబర్ మంటల్లో కాలిపోయాయని, దీంతో పాటు సర్వర్‌రూంలో ఫైళ్లు దహనమయ్యాయని ఆయన తెలిపారు. కాగా ఈ ప్రమాదంపై విచారణ చేసేందుకు క్లూస్ బృందం రంగంలో దిగింది. ప్రమాదం జరిగిన మొదటి అంతస్తును సీజ్ చేశారు. ప్రమాద సమయంలో ఎవరైనా ఉన్నారా? అని శోధిస్తున్నారు. ఎఫ్ఎస్ఎల్‌లోని సిసి కెమెరాల ఫుటేజిని స్వాధీనం చేసుకున్నారు. వీటిని విశ్లేషించి కుట్ర కోణం ఏమైనా వుందా? అనే దానిని పోలీసులు నిగ్గు తేల్చనున్నారు.

# ఉస్మానియా వర్సిటీలో నేటి నుంచి అంతర్జాతీయ తెలుగుభాషా దినోత్సవాలు

## రెండు రోజులు ఘనంగా సదస్సులు నిర్వహణ

**హైదరాబాద్ (తార్నాక), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** తెలుగు భాష, సంస్కృతి, సాహిత్య పరిరక్షణ లక్ష్యంగా తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం 'తెలుగు సంపద' ఆధ్వర్యంలో '4వ అంతర్జాతీయ తెలుగు భాషా దినోత్సవాలు-2026'ను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 9, 10 తేదీల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ రూం నం. 121లో జరగనున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా తొలిరోజు 9న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమ ప్రారంభ సభ నిర్వహించనున్నారు. ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం అధ్యక్షతన జరుగనున్న ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా కమిషనర్, కాలేజీయేట్ ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ దేవసేన, విశిష్ట అతిథులుగా వైస్‌చాన్సలర్ ప్రొ. కుమార్ మొలగరం, గౌరవ అతిథులుగా ప్రొ.నిత్యానందరావు పాల్గొననున్నారు. ఈ సభకు ప్రముఖ తెలుగు సాహితీవేత్తలు, విశ్వవిద్యాలయ ఆచార్యులు, భాషా నిపుణులు హాజరై తెలుగుభాష ప్రాధాన్యత, భవిష్యత్ దిశపై ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కీలకోపన్యాసాలు జరగనున్నాయి. ఇందులో దేశ, విదేశాల నుంచి వచ్చిన పండితులు తెలుగు భాషా వికాసం, ప్రపంచ స్థాయిలో తెలుగుభాష స్థానం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు. అనంతరం సాయంత్రం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు తెలుగుభాషా పరిరక్షణ ఉద్యమం - సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రముఖ ఆచార్యులు, పరిశోధకులు, రచయితలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారని నిర్వాహకులు తెలిపారు. తెలుగు భాషను భావితరాలకు మరింత దగ్గర చేయడమే ఈ వేడుకల ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు.

తెలుగు భాష మాధ్యం, పరిరక్షణ మార్గాలు, దేశవిదేశాల్లో తెలుగు భాషా వ్యాప్తికి జరుగుతున్న కృషి, తెలుగు భాషా పరిశోధనల్లో శాస్త్ర, సాంకేతిక సాధనాల వినియోగం, పత్రికలలో ఉద్యోగావకాశాలు, నేటి తరానికి తెలుగు భాషా పరిరక్షణ వంటి వివిధ అంశాలలో సదస్సులు రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు కార్యక్రమాల కో కన్వీనర్ డా. మూర్తి రేమెళ్ల తెలిపారు.

# ఆన్‌లైన్ గేమింగ్ వ్యవహారంలో జిఎస్టీ ఇంటెలిజెన్స్ దాడులు

## హైదరాబాద్, ముంబయి, ఢిల్లీలో సోదాలు

### ఐదువేల కోట్ల అక్రమ లావాదేవీల గుట్టురట్టు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** దేశంలో అక్రమంగా కొనసాగుతున్న ఆన్‌లైన్ గేమింగ్ వ్యవహారంపై హైదరాబాద్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు ఆదివారం హైదరాబాద్ సహా ముంబయి. ఢిల్లీ నగరాలలో ఏక కాలంలో దాడులు చేశారు. ఈ సందర్భంగా ఐదు వేల కోట్ల రూపాయల ఆన్‌లైన్ గేమింగ్‌కు సంబంధించిన సిండికేట్‌ను రట్టు చేశారు. ఈ సిండికేట్‌కు ముంబయికి చెందిన ప్రభుకుమార్, హైదరాబాద్ వాసి రాజశేఖర్‌రెడ్డి ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు. ఐదేళ్లుగా వీరు ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహిస్తూ వేల కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహించి నట్లు హైదరాబాద్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు గుర్తించారు. జీఎస్టీ ఎగవేత, అక్రమ లావాదేవీలపై అధికారులు సోదాలు చేబట్టారు. ఈ సందర్భంగా భారీగా అక్రమ లావాదేవీలకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించి వాటిని జప్తు చేశారు. దాడుల సందర్భంగా మూడు నగరాలలో కొంద రు అనుమానితులను అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సోమవారం వీరిని అరెస్టు చూపించే వీలుంది.



ప్రభుకుమార్



రాజశేఖర్‌రెడ్డి

# సైబర్ నేరగాళ్లపై పోలీసుల ఉక్కుపాదం

## జనవరిలో దేశవ్యాప్తంగా 37 మంది అరెస్టు

## రూ.67 కోట్ల అక్రమ లావాదేవీల గుర్తింపు

## రూ.71.91 కోట్ల నగదు బాధితులకు అందచేత

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** జంట నగరాలలో సైబర్ నేరగాళ్లపై సైబర్ క్రైం పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత జనవరి నెల లో దేశ వ్యాప్తంగా ఏడు రాష్ట్రాలలో దాడులు చేసి నగరంలో జరిగిన నేరాలతో సంబంధం వున్న 37 మంది నేరగాళ్లను అరెస్టు చేశారు. ఈ సంద ర్భంగా ఈ నేరగాళ్ల పలు రకాల మోసాల వల్ల 65 కోట్ల రూపాయలను కాజేసినట్లు పోలీసులు గుర్తించారు. అరెస్టయిన 37 మంది నేరగాళ్ల వల్ల నగరంలో వెలుగు చూసిన 26 కేసులకు సంబంధించిన మిస్టరీ వీడింది. జనవరి నెలలో మొత్తం సైబర్ నేరాలకు సంబంధించిన కేసులు 117 కాగా ఇందులో ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు రెండు వుండగా సోషల్ మీడియా కేసులు నాలుగు వున్నాయి. బిజినెస్, గేమింగ్, జాబ్ ఫ్రాడ్స్ కేసులు ఐదు వు న్నాయి. ఈ సందర్భంగా నేరగాళ్ల నుంచి ఆయా కేసులకు సంబంధించి 71 కోట్ల 91 లక్షల 371 రూపాయలను జప్తు చేసి దీనిని బాధితులకు అందజేశారు. కాగా అరెస్టయిన 37 మంది నేరగాళ్లు దేశ వ్యాప్తంగా జరిగిన 86 కేసుల్లో నిందితులు కావడం గమనార్హం. వీరి బ్యాంకు ఖాతాలలో 65 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 26 సెల్‌ఫోన్లు, 79 సిం కార్డులు, 62 డెబిట్ కార్డులు, 57 చెక్కు బుక్కులు ఇంకొన్ని వస్తువులను జ ప్తు చేశారు. కాగా సైబర్ నేరాల పట్ల అన్ని వర్గాల వారు నిరంతరం అప్రమత్తంగా వుండాలని నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) శ్రీనివాసులు కోరారు.

# పార్కు చేసిన కారులో మూడు మృతదేహాలు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** రాజధాని ఢిల్లీలో పీరాగఢి ఫ్లైఓవర్‌పై పార్క్ చేసి ఉన్న కారులో ఒక మహిళతో సహా ముగ్గురు వ్యక్తులు మృతిచెంది కనిపించారు. ప్రాథమికంగా వీరు విషం సేవించి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతులను రన్‌హోలా ప్రాంతానికి చెందిన రణధీర్ సింగ్ (62), శివ్ నరేశ్ (42), జహంగీర్‌పురికి చెందిన లక్ష్మి సింగ్ (40)గా గుర్తించారు. వీరు ప్రయాణిస్తున్న కారు రణధీర్ సింగ్‌కు చెందినదిగా తేలింది. అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫ్లైఓవర్‌పై నిలిపి ఉన్న కారును గమనించారు. లోపల ముగ్గురూ మరణించినట్లు నిర్ధారించారు.



మృతదేహాలపై ఎలాంటి గాయాలు లేదా ప్రతిఘటనకు సంబంధించిన ఆనవాళ్లు లేకపోవడంతో ఇది ఆత్మహత్యేనని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. దోపిడీ లేదా దొంగతనం జరిగినట్లు కూడా ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరణానికి కచ్చితమైన కారణం తెలుస్తుందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీనియర్ పోలీస్ అధికారులు వెల్లడించారు. ఈ సంఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

# అడవిపంది దాడిలో రైతుకు తీవ్రగాయాలు

**పెంచికల్‌పేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** కుమ్రంభీం జిల్లా పెంచికల్‌పేట మండలం కొండపల్లి గ్రామానికి చెందిన రైతు డబ్బుల పోచయ్య ఆదివారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పత్తి చేనుకు వెళ్లగా. ఈ క్రమంలో చెట్ల పొదల్లో దాగి ఉన్న అడవి పంది ఒక్కసారిగా దాడి చేయడంతో పోచయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఆకస్మిక దాడిని గమనించిన చుట్టపక్కల చేన్లలో పనిచేస్తున్న రైతులు పరుగున అక్కడికి చేరుకొని అడవి పందిని తరిమేశారు. అనంతరం గాయపడిన పోచయ్యను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ యనకు చికిత్స కొన సాగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.



అడవిపంది దాడిలో గాయపడిన రైతు రాములు

అడవిజంతువుల సం చారం పెరగడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# విడుదలైన లాసెట్, పిజి లాసెట్-2026 నోటిఫికేషన్

## రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

### మే 18న పరీక్ష.. జూన్ 5న ఫలితాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల్లో 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల లా కోర్సులో చేరడానికి నిర్వహించే లాసెట్-2026కి సంబంధించిన నోటిఫికేషన్ ఆదివారం వెలువడింది. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను రేపటి (మంగళవారం) నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఎల్ఎల్ఎంలో చేరడానికి నిర్వహించే పీజీ లాసెట్-2026 దరఖాస్తులను కూడా ఈ నెల 10 (మంగళవారం) నుంచే ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఆదివారం నోటిఫికేషన్‌ను జారీ చేయగా.. మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. మే 13 దరఖాస్తుల స్వీకరణకు తుది గడువుగా ప్రకటించారు. మే 3 నుంచి 8 వరకు దరఖాస్తుల్లో ఉన్న తప్పులను సరిచేసుకోవడానికి ఎడిట్ సౌకర్యం కల్పించారు. మే 12 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మే 18న ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు, తిరిగి 12.30 గంటల నుంచి 2 గంటల వరకు 3 సంవత్సరాల లా కోర్సులో చేరడానికి పరీక్షను నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు 5 సంవత్సరాల లా కోర్సుతోపాటు, ఎల్ఎల్ఎంలో చేరడానికి పరీక్షను నిర్వహిస్తారు. మే 23న ప్రాథమిక కీని విడుదల చేస్తారు. మే 25 వరకు ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరించి.. జూన్ 5న ఫలితాలను విడుదల చేయనున్నారు. లా సెట్‌కి దరఖాస్తు ఫీజును జనరల్ అభ్య ర్థులకు రూ. 900గా నిర్ణయించగా, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 600గా నిర్ణయించారు. ఇక పీజీ లాసెట్ ఫీజును జనరల్ వారికి రూ 1100గా నిర్ణయించగా.. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ. 900గా నిర్ణయించారు.

# శత్రు డ్రోన్లను కూల్చి వేసే డేగలు!

## మీరట్ మిలటరీ శిక్షణ కేంద్రంలో డేగలకు తర్ఫీదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** దేశ సరిహద్దుల్లో బిఎస్ఎఫ్‌తో పాటు మిలటరీ జవాన్లకు తోడుగా శత్రు దేశాల డ్రోన్లపై దండయాత్ర చేసేందుకు సరికొత్త అస్త్రాలను రక్షణ శాఖ తయారు చేసింది. ఇప్పటి వరకు డ్రోన్లను తుపాకులు లేదా చిన్నపాటి తోపుతో కూల్చి వేస్తుండగా దీనికి బదు లుగా ప్రత్యేకంగా శిక్షణ పొందిన డేగలను రంగంలో దించారు. ఇటీవల కాలంలో పాకిస్తాన్‌కు సరిహద్దులో గల రాజస్తాన్, పంజాబ్, జమ్మూ కాశ్మీ ర్ రాష్ట్రాలలో పాకిస్తాన్ నుంచి పెద్ద సంఖ్యలో డ్రోన్లు తరచూ వస్తున్నాయి. ఇందులో కొన్ని డ్రోన్లు మరీ చిన్నవిగా వుండడంతో ఇవి రాడర్లకు చిక్కడం లేదు. దీనివల్ల సరిహద్దుల్లో భద్రతా బలగాలకు, మిలటరీ జవాన్లకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో మీరట్ మిలటరీ కేంద్రంలో పదుల సంఖ్యలో డేగలకు ప్రత్యేకంగా తర్ఫీదునిచ్చి బుల్లి డ్రోన్లను కూల్చివేసే బాధ్యతను అప్పగించారు. ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవంలో మిలటరీ జవాన్ల పరేడ్‌లో ఈ డ్రోన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాక్ నుంచి వచ్చే డ్రోన్లలో కొన్ని ఆయుధాలను జారవిడుస్తుండగా మరికొన్ని డ్రగ్స్ స్మగ్లి ంగ్ చేయసాగాయి. వీటిని భారత్‌లోని పాక్ ఏజెంట్లు తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. రెండేళ్ల క్రితం కాశ్మీర్‌లోని పాక్ సరిహద్దు పోస్టుపై డ్రోన్ల ద్వారా ఉగ్రవాదులు దాడిచేసి భారీగా నష్టం కలిగించడం తెలిసిందే. దీని తరువాతే డ్రోన్ల భరతం పట్టేందుకు రక్షణ శాఖ ప్రత్యేకంగా డ్రోన్ల త యారీ విభాగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు శత్రు దేశం నుంచి వచ్చే బుల్లి డ్రోన్లను కూల్చి వేసేందుకు డేగలను రంగంలో దించింది. డ్రోన్ల త యారీలో ప్రస్తుతం తుర్కియే (పూర్వపు టర్కీ) ప్రపంచంలోనే అగ్రగామిగా వుంది. తుర్కియే పాక్‌కు మిత్ర దేశం కాగా భారత్‌ను శత్రు దేశంగా చూ స్తుండడం విదితమే. పహల్గాం దాడి తరువాత భారత్ చేబట్టిన ఆపరేషన్ సింధూర్‌లో తుర్కియే తాను తయారు చేసిన అధునాతన డ్రోన్లను వేల సంఖ్యలో పాక్‌కు ఇవ్వగా వాటి ద్వారా పాక్ భారత్ సరిహద్దులోని గ్రామాలపై దాడులకు దిగింది. దీని తరువాత డ్రోన్ల తయారీపై భారత్ దృష్టి సా రించి ఈ విషయంలో కొంతమేర ఫలితాలను అందుకుంది. డ్రోన్లతో పాటు డేగలకు శిక్షణను ఇచ్చే విషయంలో మిలటరీ విభాగం మరింత దూకు డుగా ముందుకు వెళుతుంది. కాశ్మీర్, పంజాబ్ సరిహద్దుల్లో ఏడాదిగా చిన్నపాటి డ్రోన్లను శిక్షణ పొందిన డేగలు సమర్థవంతంగా కూల్చి వేయడం గమనార్హం. ఇందులో శారీరకంగా దృడంగా వుండే నల్ల డేగలు బుల్లి డ్రోన్లు కనిపిస్తే చాలు నిమిషాలలోనే గాల్లో ఎగిరి అమాంతం వాటిపై దాడిచేసి కూల్చి వేస్తున్నాయి. ఇందులో అర్జున్ అనే డేగ ఈ విషయంలో మరిన్ని విజయాలను అందుకోవడం విశేషం. డేగల తలలపై బుల్లి కెమెరాలు వు ండడం విశేషం. ఈ కెమెరాల వల్ల సరిహద్దుల్లో ఏం జరుగుతుందనే విషయా న్ని భద్రతా బలగాలు నిరంతరం గమనించేందుకు వీలు కలుగుతురది. కాగా డేగలకు బలమైన ఆహారంతో పాటు వాటి కాళ్లు మరింత బలంగా వుండేందుకు ప్రత్యే కంగా శిక్షణ ఇస్తున్నారు. రాబోయే రోజుల్లో సరి హద్దుల్లో ప్రత్యేక డేగల విభాగాలు ఏర్పాటు చేసేం దుకు రక్షణ శాఖ రెడీ అవు తోంది. ఇప్పటికే తెలంగాణ సహా పలు రాష్ట్రాలు నక్సలైట్ల అణచివేత లో డేగలను వాడుతుండడం తెలిసిందే. వీటికి ప్రత్యేకంగా శిక్షణను కూడా ఇస్తున్నాయి.



మీరట్ మిలటరీ శిక్షణ కేంద్రంలో తర్ఫీదు పొందుతున్న డేగలు. వాటి తలలపై బుల్లి కెమెరాలు.

ఓ మర్రిగింజ మహావృక్షమైనట్టే, చిత్తశుద్ధితో చేసే చిన్న సత్కార్యం మహా ఫలితాలనిస్తుంది.

-కె. స్టాన్‌స్లావిస్కి

# ఆత్మాహుతి దాడులకు అంతమెప్పుడు?

దాయాదులు తగవులాడుకుంటుంటే పరాయి వాళ్లు పక్కలో బల్లెంలా తయారౌతారన్నది పాకిస్థాన్ విషయంలో అక్షరాలా నిజమైంది. ఏనాటి నుంచో ప్రత్యేకదేశంగా విడిపోయి తమ పాలన తామే చేసుకుంటామని డిమాండ్ చేస్తున్న బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ తమకు ప్రత్యేక 'స్వతంత్ర బలూచిస్థాన్ కావాలన్న డిమాండ్‌తో నిరంతరం పాక్ సైనికులపై దాడులకు తెగబడుతోంది. పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడులంటే మామూలుగా జరిగేవేననే అభిప్రాయం బలపడుతోంది. ఈదాడుల్లో పెద్దఎత్తున సైనికులు ప్రాణత్యాగం చేయాల్సివస్తోంది. రాజధాని ఇస్లామాబాద్ శివార్లలో ఉన్న షియా మసీదులో శుక్రవారం ప్రార్థనల సందర్భంగా అత్యంత శక్తివంతమైన పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 69మందికిపైగా దుర్మరణంచెందగా 169 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. షెహబాద్ టౌనన ఏరియా టేర్లాయి ఇమామ్ బారగాహ్ వద్ద ఈ పేలుడుకు దుండగులు ఓపక్కా ప్రణాళిక ప్రకారంఏర్పాటుచేశారు. షియా ప్రార్థనా మందిరం ప్రధాన ద్వారంవద్ద ఆత్మాహుతి దాడిలో మృతుల సంఖ్య భారీగానే ఉంది. ఈ దుర్ఘటన జరిగిన వెంటనే పాకిస్థాన్ ప్రభుత్వం ఇస్లామాబాద్‌లో అత్యయిక స్థితిని విధించింది. పేలుడు తీవ్రతలో చాలా మంది కాళ్లుచేతులూ తెగిపడ్డాయి. ఆ ప్రాంతమంతా క్షతగాత్రుల, బంధుమిత్రుల ఆర్తనాదాలతో నిండిపోయింది. మృతుల్లో ఇస్లామాబాద్ పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ సోదరుడు, మరోబంధువు కూడా ఉన్నారు. ఆత్మాహుతి బాంబర్‌గా ఒక విదేశీయుడని తేలింది. అతను ఫిత్నా అల్ ఖ్వారాజీ లియాస్ తెహ్రీక్ -ఇ- తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) సభ్యుడని గుర్తించారు. కాగా ఆ సంస్థ మాత్రం ఈ దాడితో తమకేమీ సంబంధం లేదని ప్రకటించింది. ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు వాటికి బాధ్యులైన వారు బహిరంగంగానే ప్రకటించుకుని తమ సంస్థ ఉనికిని కాపాడే ప్రయత్నం చేస్తుంటారు. పాక్ గత కొంతకాలంగా ఎన్నో ఆత్మాహుతి దాడులను ఎదుర్కొంటోంది. గత ఆరు నెలలలో ఇది రెండవఆత్మాహుతి దాడి. గత యేడాది నవంబరు నెలలో ఒకతను ఇస్లామాబాద్ కోర్టు కాంప్లెక్స్‌లో తనకారులో తనను తాను పేల్చేసుకోగలిగాడు. ఆ విషాద ఘటన నుంచి పాకిస్థాన్ ఇంకా తేరకోలేదు. ఈ ఘటనలో కనీసం 12 మంది దుర్మరణం పాలయ్యారు. అంతక్రితం 2008 సెప్టెంబరు నెలలో ఇస్లామాబాద్‌లోని మారియట్ హోటల్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో 63 మందిచనిపోయారు. ఇలా ఏ ఆత్మాహుతి దాడి జరిగినా ఎక్కువ మందే బలైపోతున్నారు. తాజా సంఘటనకు ఎన్నుకున్న లక్ష్యంమేరకు ఆత్మాహుతి బాంబర్ తొలుత కాల్పులకు తెగబడి తర్వాత తనను ప్రవేశ ద్వారం వద్ద సెక్యూరిటీ గార్డులు అడ్డగించడంతో వెంటనే తనను తాను పేల్చేసుకున్నాడు. పేలుడు తీవ్రతకు ప్రవేశద్వారం ధ్వంసమైంది. సమీప భవనాలు కిటికీలు విధ్వంసమయ్యాయి. చుట్టూ చిన్నాభిన్నమైనమృతదేహాలు చెల్లాచెదురయ్యాయి. ఘటన నేపథ్యంలో ఇస్లామాబాద్‌లోని అన్ని ఆస్పత్రులలో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. ఎక్కడా వైద్యసేవలకు సెలవు ప్రకటించేందుకు వీల్లేకుండా ఈఉత్తర్వుల కారణంగా వైద్య సేవలు యుద్ధప్రాతిపదికన అందుతాయి. క్షతగాత్రులందరూ పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(పిమ్స్)తోపాటు ఇతర ఆసుపత్రులలో కూడా చికిత్స పొందుతున్నారు. ఒకపక్క పాకిస్థాన్ నిన్నమొన్నటి భారత్‌తోయుద్ధానికి ముందు నుంచి బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీతో విభేధాలు కొని తెచ్చుకుంది. పైగా ఎన్నో ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. పాక్ ప్రజలు ఇతర దేశాలకు బిచ్చగాళ్లుగా మారేందుకైనా సిద్ధపడి వలసవెళ్లిపోతున్నారు. ఆర్థిక అనిశ్చితితో కొట్టుమిట్టాడుతున్న పాక్ ఇప్పటికీ భారత్ సంగతి తేల్చేస్తామంటూ బీరాలు పలుకుతోంది. వాస్తవంలో పడేందుకు పాక్ ఏ మాత్రం ప్రయత్నించడం లేదు. మరోపక్క బలూచిస్థాన్ విషయంలో కూడా పాక్స్థిరమైన నిర్ణయం తీసుకోలేకపోతోంది. ఎడాపెడా వైరాన్ని పెట్టుకుని లేనిదర్జానువెళ్లబెడుతోంది. భారత్‌లో వైరంలో తోకముడిచిన పాకిస్థాన్ సింధు నదీజలాల విషయంలో కూడాసయోధ్య సాధించలేకపోయింది. స్వతంత్ర బలూచిస్థాన్ ఉద్యమ వాదులు ఆ మధ్య భారత్, పాక్ మధ్యపోరు సమయంలో బలూచిస్థాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించుకోగా పాక్ కత్తికట్టింది అంతే తప్పవారితో సయోధ్యకు ప్రయత్నించకపోగాసవాల్ విసిరింది. పాక్ ఆర్మీజనరల్ మునీర్ తన పదవీ ప్రాపకం కోసం అమెరికాతో స్నేహహస్తం అందించారు తీసుకున్నారు తప్ప అంతర్యుద్ధం రాకుండా చూసుకోలేకపోయారు. పాక్ ఆర్థిక పరిస్థితి ఏస్థాయికి దిగజారిందంటేపాకిస్థాన్‌లో జనం మ్యాన్‌హోల్స్ మూత లు అమ్ముకుని బతికేస్తున్న వైనం. 30 కిలోల వరకు బరువుండే మ్యాన్‌హోల్స్ మూతల్ని స్క్రాప్ షాపుల్లో అమ్మేసుకుంటున్నారు. అంతటి దైన్యస్థితి వారిది. అందుకే మింగమెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె చందాన పాకిస్థానీయులు సొంతదేశంలో కాలక్షేపం చేయడం విశేషం. పాలకుల అవ్యవస్థను సరిదిద్దగలిగే దేశభక్తులు లేకపోవడంవల్లనే ఆదేశపరిపాలనకు చీడపట్టింది. దాన్నుండి బయటపడాలంటే ఆర్థిక పరిస్థితి మెరుగుపరుచుకోవడం, అంతర్గత సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడమొక్కటే మార్గం. అప్పుడే అసంతృప్తి దారుల ఆత్మాహుతిదాడుల నుంచి గట్టెక్కగలుగుతుంది. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ పాక్‌లో పర్యటిస్తున్న సందర్భంలోనే ఇలా ఆత్మాహుతి దాడులు జరగడంతో అసలు ఆత్మాహుతి దాడి లక్ష్యం ఎవరై ఉంటారనే అనుమానం వ్యక్తమౌతోంది.

అధికారంలో ఉన్న వారికి చదవడానికి తీరిక ఉండదు. అయితే చదవడానికి తీరిక లేనివారు అధికారానికి అనర్హులు.



ఆస్కార్‌వైల్డ్

అతి సామాన్యమైన జీవితం గడపడానికి ఆసక్తి, అధికమైన ఆలోచనా శక్తి గొప్పవారి జీవిత సూత్రాలు.



వి. జాన్సన్

# ప్రజావాక్కు



## కల్తీపై చర్యలు చేపట్టాలి

నగర, పట్టణ కూడళ్లలో ఇంకా రోడ్డు వెంబడి అమ్మే చిరుతిండ్లు, టిఫిన్లు, మిఠాయిలు, హలీం తదితర ఆహార పదార్థాలనాణ్యతపై సర్వత్రాచర్చ జరుగుతోంది. ఆహార పదార్థాల తయారీ కోసం వాడే నూనెలు, రంగు రుచి కోసం కలిపే ప్రమాదకర మిశ్రమాలపై ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోకపోవటంవల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. కేంద్రంతెలిపిన గణాంకాల ప్రకారం మనదేశంలో దాదాపు ఇరవైలక్షల వరకు రోడ్డు వెంబడి అమ్మే తోపుడు బండ్లు, చిన్న చిన్న కొట్లు ఉన్నట్లు అంచనా! వీరు చేసే ఆహారవ్యాపారం తక్కువేం ఉండదు. ప్రజలకు చట్టాలపై అవగాహన లేకపోటంవల్ల ఈచిరువ్యాపారులను ప్రశ్నించలేకపోతున్నారు. స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు తప్పకుండా ఆహార నాణ్యతను పాటించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## ప్రాణం తీసిన పదవీ వ్యామోహం

తెలంగాణా రాష్ట్రంలోపురఎన్నికలపోటీలో పాల్గొనే వారికి ఇద్దరు పిల్లలు మాత్రమే కలిగి ఉండాలనే రూలుందట. చాలామందికి ఈ సంగతితెలియదేమో. ఓప్రబుద్ధుడు తన మూడవ సంతానమైన ఆరేళ్ల కూతుర్ని ఓ నీటి ప్రవాహంలోకి విసిరి, పోటీకి అర్హతసంపాదించాననుకున్నాడు. కాని పాపను చంపినందుకు కటకటాల పాలయ్యాడు. పదవీ వ్యామోహం ఎంతఘాతుకానికి అయినా తెగిస్తుందనేందుకు ఈ ఘటన ఓ ప్రత్యక్ష సాక్ష్యం. ప్రపంచ చరిత్రలో ఇవి కొత్తమీ కావని ఆనాడే నిర్ధారణ అయింది. పూర్వం మహారాజులను పదవి కోసం కన్నబిడ్డలనే కడతేర్చిన కథలు చరిత్రలో కోకొల్లలుగా కనిపిస్తాయి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## హైడ్రాను ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతిమండలకేంద్రాలలో ప్రభుత్వ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసినఎస్సి, ఎస్టీ, వికలాంగులకు ఉన్న ఇండ్లస్థలాలు కబ్జాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ కాలనీలలో రెవిన్యూ రికార్డుల ప్రకారం ఇండ్లస్థలాలు ఆక్రమించి మరుగుదొడ్లు, స్నానపు గదులను నిర్మించిన వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకోగలరు. తెలంగాణ ప్రభుత్వం మండల కేంద్రాలలో కూడా హైడ్రా ఏర్పాటు చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

## తగ్గిన సుంకాలు

అమెరికా ప్రభుత్వం భారతీయ దిగుమతులపై సుంకాలను 25 శాతం నుండి 18 శాతానికి తగ్గించడం భారత ఆర్థిక వ్యవస్థకు లభించిన గొప్పఊరట. డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం వెలువడిన వెంటనే అటు భారతీయ, ఇటుఅమెరికా స్టాక్ మార్కెట్లు భారీలాభాలను ఆర్జించాయి. పెట్టుబడిదారులలో పెరిగిన విశ్వాసానికి ఇది నిదర్శనం. రష్యానుండి చమురు కొనుగోళ్లను నియంత్రించాలనే షరతులు, అమెరికా మార్కెట్లో భారతదేశం 500 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలనే ప్రతిపాదనలు ఈ ఒప్పందంలో భాగంగా ఉన్నాయి. భారతదేశం ఐరోపా సమాజంతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న కొద్ది రోజుల్లోనే వాషింగ్టన్ తన వైఖరిని మార్చుకోవడంవిశేషం. ఇది అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం సాధించిన దౌత్య విజయం. దీనిని కేవలంరాజకీయ కోణంలోలొంగుబాటుగా అభివర్ణించడం ఆర్థిక వాస్తవాలకు విరుద్ధం. ఈ సుంకాల తగ్గింపు వల్ల ఆక్వాకల్చర్ వంటి రంగాలు ఎగుమతిదారులు తమపై ఉన్న ఆర్థిక ఒత్తిడి నుండి విముక్తి పొందుతారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## సమన్యాయం అవసరం

మణిపూర్‌లో ముఖ్యమంత్రిమార్పిడి తరవాతఅయిన ఆ రాష్ట్రం కోలుకోవాలని ఆశించడంలో తప్పులేదు. అయితే ఇంతకు ముందు ముఖ్యమంత్రిగా చేసిన బీరేన్‌సింగ్ మయితీ తెగకు సంబంధించినవాడు అయ్యి కుకీలకు నాగలకు ఇతర మైనారిటీ జాతులకు విశ్వాసం కల్పించడంలో విఫలమయ్యారు. అయితే ఇప్పుడు ఉపముఖ్యమంత్రులుగా నియమించబడిన ఇద్దరితోనే ఆ జాతుల కోపం చల్లరుతధా అంటే అది ఇక్కడితో ఆగకూడదు. విద్య, ఆరోగ్యం, ఉద్యోగాలలో కూడా మయితీలతో సమానంగా హక్కులు అధికారాలు దక్కాల్సిందే. ఎక్కడ అన్యాయం జరుగుతుందో అక్కడ ఏదో ఒక రూపంలో తిరుగుబాటు వస్తుంది.

- భారత అవినాష్, జనగామ

## రోడ్డు ప్రమాదాలను నివారించాలి

తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రయాణికులరక్షణకై చొరవ తీసుకుని ప్రభుత్వ, ప్రైవేటువాహనాలను నిరంతరము పర్యవేకిస్తూ నిబంధనలకు వ్యతిరేకంగాఉన్నవాహనాలపై చర్యలు తీసుకుని ఫిట్నెస్ లేని వాహనాలు రోడ్లపైకి రాకుండా చూడాలి. ప్రభుత్వాలు రోడ్డుప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు తనిఖీలు చేపటాలి. ట్రాఫిక్ నియమనిబంధనలను అతిక్రమిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి.

- కె.రామకృష్ణ, నల్గొండజిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# క్రికెట్‌కు రాజకీయ నీడలెందుకు?

**దురదృష్టవశాత్తు ఈ రాజకీయ ప్రహసనంలో క్రికెట్ క్రీడ ఇరుక్కోవటం క్రికెట్ ఆటను అభిమానించే చాలా మందికి ప్రపంచవ్యాప్తంగా బాధను కలిగిస్తున్నది. ఇంతవరకు పాకిస్థాన్ ఇండియాల మధ్య ఎన్నిసమస్యలు, చిన్నపాటి అలజడులూ సరిహద్దుల దగ్గర యుద్ధాలు జరిగినా క్రికెట్ ఆటను రెండు దేశాలూ అమితంగా ప్రేమించటం వల్లరెండు దేశాల మధ్య ఆట ఆగిపోవటం చాలా అరుదుగా జరిగిఉండవచ్చు. కానీ క్రికెట్ ఆటనూ స్పోర్ట్స్‌మన్ షిప్‌నూ ఎన్నడూ ఈవిధంగా దెబ్బతీయలేదు. అందుకనే క్రికెట్ ఆటను సమస్యగా మార్చి రాజకీయ పణంగా దేశాలు పెట్టకూడదని క్రికెట్ అభిమానులు కోరుతున్నారు. క్రీడలను, రాజకీయాలను దేశాలు విడదీసి చూసినప్పుడే రాజకీయాల్లోకూడా స్పోర్ట్స్‌మన్ స్పిరిట్ క్రమేపీ విస్తరించే అవకాశం ఉంది.**



రావులపాటి సీతారాం రావు

క్రికెట్ ఆట దేశాలను కలిపేఆటగా కొన్నేళ్ల క్రిందట వరల్డ్ కప్ జ్వరం ఇంగ్లండు నుంచి అందర్నీఆవహించినప్పుడు కపిల్‌దేవ్‌లు, శ్రీకాంత్‌లూ సచిన టెండూల్కర్, మహేందర్ అమర్‌నాథ్‌లూ రోజర్ బిన్నీలు పుట్టుకొచ్చి చివరకు వరల్డ్ కప్‌ను గెలవటమే కాకుండా ప్రపంచమంతటాజేజేలు సాధించారు. ప్రస్తుతం సీన్ రివర్స్ కాలేదు కానీ అన్ని వ్యవస్థలలో సోకినట్లే ఈ ఆటలో కూడా రాజకీయం పురుగుగా సోకి లేనిపోని కక్షలకూ, కార్పణ్యాలకు దారి తీస్తున్నది. కొన్ని దేశాలు ఆటల్లో గానీ, రాజకీయాల్లో గానీ విలువలకు కట్టుబడి ఉంటాయి! మరికొన్ని దేశాలు విలువలను హతమార్చేందుకే కట్టుబడి ఉంటాయి. అలాంటి దేశాలు చాలా కొద్ది సంఖ్యలోనే ఉన్నాయి కానీ, చుక్క విషం చాలు కడివెడు పాలను విషంగా మార్చటానికి అన్నట్లు పాకిస్థాన్ దేశంలోని రాజకీయ నాయకులు చాలు ఏదైనా రాజకీయం చేసి విషజ్వాలలు ఎల్లెడెల్లా వ్యాపింపచేయడానికి అన్న తీరుగా ప్రస్తుత క్రికెట్ ఆట పరిస్థితులలో అల్లకల్లోలం సృష్టించే వైఖరిని తీసుకోవటం అత్యంత గర్హనీయం, దురదృష్టకరంగా మారింది. సరిహద్దు తగాదాలను క్రికెట్ తగాదాలుగా మారే విధంగా పాకిస్థాన్ ప్రవర్తిస్తుండటంవల్ల మొత్తం క్రికెట్ ఆటకే ప్రమాదం వాటిల్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఐసిసి ట్వెంటీ ట్వెంటీ వరల్డ్ కప్‌లో ఫిబ్రవరి 15నాడు కొలంబోలో ఇండియాతో జరిగే మ్యాచ్‌లో పాకిస్థాన్ ఆడననిమొండికేయడంతో క్రికెట్ అభిమానులు ఆశ్చర్యంతో ఇది నిజమా అన్నట్లుగా నమ్మలేకపోతున్నారు. ఇంతవరకూ స్పోర్ట్స్‌ను ప్రపంచవ్యాప్తంగా అభిమానించే వారేగాని, దెబ్బతీయడానికి ప్రయత్నించిన వారు దాదాపు లేరు అనే చెప్పొచ్చు. పాకిస్థాన్ వింత వైఖరికి కారణం ఒకప్పుడు తన చేత నానా అవస్థలు పడి విడిపోయిన బంగ్లాదేశ్, రాజకీయ కారణాల వల్ల ఇండియాతో ఆడటానికి 'న్యూట్రల్ వెన్యూ' కావాలని లేకపోతే ఆడనని చెప్పటంతో ఛాంపియన్ షిప్ నుంచి తొలగించటాన్ని నెపంగా చూపి, తనూ ఇండియాతో కొలంబోలో ఆడనని భీష్మించింది. పాకిస్థాన్‌కు న్యూట్రల్ వెన్యూ శ్రీలంకలో ఇచ్చినట్లయితే అదే విధంగా బంగ్లాదేశ్‌కు ఇవ్వాల్సి వచ్చేది. నిజానికి పాకిస్థాన్ ఆడాల్సిన ప్రదేశాలు చాలా రోజుల ముందే నిర్ణయించటం జరిగింది. అకస్మాత్తుగా ఆడాల్సిన ప్రదేశాన్ని మార్చాలని కోరటం అదీ ప్రిలిమినరీ గేమ్స్‌ను ఇండియా కాకుండా అవతల ప్రదేశాలు ఆటస్థలాలుగా నిర్ణయించాలనటం చాలా ఇబ్బంది కలిగించేవిషయం. మొత్తం షెడ్యూల్ కకావికలు అయ్యేది. బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిర్ రెహ్మాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్‌ను స్క్వాడ్ నుంచి తొలగించటంతో దానికి ప్రతిగా బంగ్లాదేశ్ ప్రభుత్వం ఛాంపియన్ షిప్‌కే ఎసరు పెట్టే ప్రయత్నం ఈ చర్యద్వారా చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే పాకిస్థాన్ కావాలనే తమ టీం ఇండియాతో శ్రీలంకలోఆడదని, బంగ్లా



దేశ్‌తో సంబంధాలు బాగా పునరుద్ధరించుకోవటం కోసం ఈ ఎత్తుగడ పన్నినట్లు క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. నిజానికి బంగ్లాదేశ్ సెక్యూరిటీ కారణాలు చూపించి ఇంటర్ నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి)ని ముందుఆడాల్సిన నాలుగు మ్యాచ్‌లను ఇండియా నుంచి దూరంగా షిఫ్ట్ చేయాలని కోరింది. ఐసిసి అంగీకరించలేదు. స్కాట్లండ్‌ను బంగ్లాదేశ్ స్థానంలో గ్రూప్ సిలో చేర్చింది. దీనికి పాకిస్థాన్ అంతగా స్పందించాల్సిన అవసరం లేనేలేదు. కేవలం ఇష్యూను సృష్టించి ఛాంపియన్ షిప్ గేమ్స్ పరిస్థితిని అతలాకుతలం చేయాలని ప్రయత్నించింది. బంగ్లాదేశ్ పూర్వ ప్రధాని షేక్ హసీనా ఇండియాలో తలదాచుకోవటం, మరో ప్రభుత్వం అధికారం చేపట్టటంతో క్రికెట్ సమస్యను పెద్దది చేసి బంగ్లాదేశ్‌ను మచ్చిక చేసుకొనే వ్యూహంలో ఒక భాగంగా పాకిస్థాన్ ఈ విధమైన ఎత్తుగడ వేసిందని అనుకోక తప్పదు. 'ఇస్లామిక్ బ్రదర్ హుడ్'ను సెంటిమెంట్‌గా వాడే ప్రయత్నంలో ఒక భాగమని మరికొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే బెంగాలీ గౌరవం నిలబెట్టుకోవాలి అప్పటి ఈస్ట్ బెంగాల్ పాకిస్థాన్‌తో పోరాడిన విషయంతేలిగ్గా తీసుకోటానికివీల్లేదు. పాకిస్థాన్ అనుకున్నంత మాత్రాన, బంగ్లా ప్రజలు అంత తేలికగా పాక్ చేసిన పాతగాయాలను మర్చిపోలేరు. ప్రస్తుతం ఈ ఛాంపియన్ షిప్ క్రికెట్ ఆట మూడు సరిహద్దు దేశాల మధ్య ఇండియా, బంగ్లాదేశ్ పాకిస్థాన్ పెద్ద సమస్యగా మారింది. రాజకీయ నాయకులు తమ అవసరానికి క్రీడారంగాన్ని కూడా రాజకీయాల్లోకి జొప్పించి రణరంగంగా మార్చగల సమర్థులని ఈ సంఘటన నిరూపిస్తున్నది. త్వరలోనే బంగ్లాదేశ్ ఎన్నికలు జరగబోతున్నాయి. పూర్వప్రధాన మంత్రులు, వారి పార్టీలు బలాబలాలు తేల్చుకోటానికి సిద్ధపడుతున్న ఈ తరుణంలో క్రీడా సమస్య ఎన్నికలను ఏ విధంగా ప్రభావితం చేస్తుందో చూడాలి! షేక్‌హసీనా దేశం వదిలి వచ్చినా, ఆమె మీద ఎన్నో కేసులు పెట్టి ప్రస్తుత ప్రభుత్వం వేధిస్తున్నా ఆమెపార్టీ రాజకీయ బలంతో ఎన్నికల కోసం సిద్ధపడుతున్నదని వార్తలు వస్తున్న నేపథ్యంలో కావాలనే పాకిస్థాన్ టీ20 ఛాంపియన్ షిప్‌ను ఎన్నికలలో పెద్ద సమస్యగా మార్చి ప్రభావితం చేయాలని చూస్తున్నది. బంగ్లాదేశ్ ప్రభుత్వం కూడా తెలిసో తెలియకో, పాకిస్థాన్ వలలో పడినట్లు కొందరు రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికలు దగ్గర్లో లేనట్లయితే, బంగ్లాదేశ్, పాకిస్థాన్ ఈ సమస్యను సృష్టించేవి కావని కూడా వ్యాఖ్యానిస్తున్నారు. దురదృష్టవశాత్తు ఈ రాజకీయ ప్రహసనంలో క్రికెట్ క్రీడ ఇరుక్కోవటం క్రికెట్ ఆటను అభిమానించే చాలా మందికి ప్రపంచవ్యాప్తంగా బాధను కలిగిస్తున్నది. ఇంతవరకు పాకిస్థాన్ ఇండియాల మధ్య ఎన్ని సమస్యలు, చిన్న పాటి అలజడులూ సరిహద్దుల దగ్గర యుద్ధాలు జరిగినా క్రికెట్ ఆటను రెండు దేశాలూ అమితంగా ప్రేమించటం వల్లరెండు దేశాల మధ్య ఆట ఆగిపోవటం చాలా అరుదుగా జరిగి ఉండవచ్చు. కానీ క్రికెట్ ఆటనూ స్పోర్ట్స్‌మన్ షిప్‌నూ ఎన్నడూ ఈ విధంగా దెబ్బతీయలేదు. అందుకనే క్రికెట్ ఆటను సమస్యగా మార్చి రాజకీయ పణంగా దేశాలు పెట్టకూడదని క్రికెట్ అభిమానులు కోరుతున్నారు. క్రీడలను, రాజకీయాలను దేశాలు విడదీసి చూసినప్పుడే రాజకీయాల్లో కూడా స్పోర్ట్స్‌మన్ స్పిరిట్ క్రమేపీ విస్తరించే అవకాశం ఉంది. •

# వేతన సవరణలో జాప్యం..ఉద్యోగుల్లో అసహానం

నల్ల రవికుమార్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగులకు వర్తించిన 11వ పే రివిజన్ కమిషన్ గడువు 30 జూన్ 2023తో ముగిసింది. సాధారణంగా ఐదేళ్లకోసారి చేపట్టాల్సిన వేతన సవరణ ప్రక్రియలో భాగంగా, 12వ పిఆర్‌సి నియామకం, రివైజ్డ్ పే స్కేల్స్ అమలు 1 జూలై 2023 నుంచే ప్రారంభం కావాల్సి ఉండగా, ఇప్పటికీ దీనిపై స్పష్టమైన ప్రకటనగానీ, కార్యాచరణ రోడ్మ్యాప్ గానీ లేకపోవడం ఉద్యోగ వర్గాల్లో తీవ్ర ఆందోళనకు దారి తీస్తోంది. 11వ పిఆర్‌సి గడువు ముగిసి ఇప్పటికే 18 నెలలకుపైగా గడిచినా ప్రభుత్వం మౌనం పాటించడమే విమర్శలకు కారణమవుతోంది. ఈ జాప్యానికి సంబంధించిన నేపథ్యం కూడా గమనించాల్సి ఉంది. గత ప్రభుత్వం జులై 2023లో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డా.మన్మోహన్ సింగ్‌ను పే రివిజన్ కమిషన్ చైర్మన్‌గా నియమించింది. అయితే జూన్ 2024లో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆయన తన పదవికి రాజీనామా చేయడంతో, 12వ పిఆర్‌సి ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తరువాత ఇప్పటివరకూ కొత్త చైర్మన్ నియామకం గానీ, పిఆర్‌సి ప్రక్రియ పునఃప్రారంభంపై స్పష్టత గానీ లేకపోవడం వేతన సవరణను అనిశ్చితిలోకి నెట్టింది. పాలనా మార్పుల కారణాలు ఏమైనా కావచ్చు దాని ప్రభావం ఉద్యోగులపై పడుతోంది. ఈ నేపథ్యంలో జూన్ 2024లో అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వంపై ఉద్యోగులు కొంత ఆశ పెట్టుకున్నారు. అయితే డియర్నెస్ అలవెన్స్ విషయంలో ఇప్పటివరకు తీసుకున్న చర్యలు పరిమితంగానే కనిపిస్తున్నాయి. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 1 జనవరి 2024కు సంబంధించిన ఒక్క విడత డిఎను మాత్రమే ఇటీవల మంజూరు చేసింది. అయితే ఇంకా జులై 2024, జనవరి 2025, జులై 2025కు సంబంధించిన మూడు విడతల డిఏలు మంజూరుకు నోచుకోకుండా పెండింగ్లోనే ఉన్నాయి. జీవన వ్యయాలు నిరంతరం పెరుగుతున్న ఈ సమయంలో వరుసగా మూడు డిఏ విడతలు నిలిచిపోవడం ఉద్యోగుల ఆర్థిక స్థితిపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. ఇదే సమయంలో, గత పిఆర్‌సికు సంబంధించిన అరియర్స్ను పూర్తి స్థాయిలో చెల్లించకపోవడం, కనీసం తాత్కాలిక ఉపశమనంగా భావించే ఇంటరిమ్ రిలీఫ్ అంశాన్ని కూడా ప్రస్తావించకపోవడం ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. డిఏ అనేది దయాదాక్షిణ్యం కాదు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాన్ని సమతుల్యం చేయడానికి ఇచ్చే న్యాయమైన హక్కు అన్న విషయం ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉంది. అంతేకాదు, గత ఆరు సంవత్సరాలుగా లీవ్ ఎన్క్యాష్మెంట్ నిలిపివేయడం ఉద్యోగుల వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికలను పూర్తిగా దెబ్బతీసింది. వైద్యం, విద్య, గృహ రుణాలు వంటి తప్పనిసరి ఖర్చులు వేగంగా పెరుగుతున్న పరిస్థితుల్లో వేతనాల్లో ఎలాంటి పురోగతి లేకపోవడం ఉద్యోగులను అప్పుల ఊబిలోకి నెట్టే ప్రమాదాన్ని సృష్టిస్తోంది. టోకు ధరల సూచీతోసహా అన్ని ధరల సూచీలు పెరుగుతున్నప్పటికీ, వేతనాలు స్థిరంగా ఉండటంతో నిజ వేతనం గణనీయంగా తగ్గిపోతోంది. దీని ప్రభావం ప్రభుత్వోద్యోగుల జీవన ప్రమాణాలపై మాత్రమే కాకుండా, ప్రభుత్వ సేవల పనితీరు, నాణ్యతపై కూడా దీర్ఘకాలికంగా పడే అవకాశముంది. ఈ ఆర్థిక ఒత్తిడికి తోడు, పెన్షన్ భద్రతపై ఉన్న అనిశ్చితి ఉద్యోగుల్లో మరింత ఆందోళనను కలిగిస్తోంది. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌లో ఉన్న ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ సాధ్యం కాదని ప్రభుత్వం భావిస్తే, కనీసం తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న తరహాలో అయినా ఒక గ్యారంటీడ్ పెన్షన్ విధానం రూపొందించాల్సిన అవసరం ఉంది. సేవా కాలం పూర్తైన తర్వాత గౌరవప్రదమైన జీవితం ఉంటుందనే భరోసా ఇవ్వడం సంక్షేమ పాలన మౌలిక బాధ్యత. అయితే విమర్శల మధ్యలోనూ ప్రభుత్వం తీసుకున్న కొన్ని సానుకూల చర్యలను గుర్తించాల్సిందే. ఇటీవల ప్రభుత్వోద్యోగులకు సామూహిక భీమా కల్పించేందుకు ఎస్‌బిఐతో చేసుకున్న ఒప్పందం అభినందనీయం. అనుకోని ప్రమాదాలు, ఆపత్కాలాల్లో ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థికభద్రత కల్పించే దిశగా ఇది ఒక ముందడుగు. ఇలాంటి చర్యలు ప్రభుత్వం-ఉద్యోగుల మధ్య విశ్వాసాన్ని బలోపేతం చేసే సామర్థ్యం కలిగి ఉంటాయి. ప్రభుత్వోద్యోగుల సమస్యలను వాయిదా వేయడం ద్వారా పరిష్కరించలేం. వేతన సవరణ, పెన్షన్ భద్రత, జీవన వ్యయాలకు తగిన ఆదాయం ఇవన్నీ ఉద్యోగుల హక్కులే కాకుండా సమర్థవంతమైన పాలనకు అవసరమైన పునాదులు. ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి నియామకంపై స్పష్టతఇవ్వాలి. పెండింగ్లో ఉన్న మూడు విడతలు, అరియర్స్ చెల్లింపులకు ఖచ్చితమైన కాలపరిమితిని ప్రకటించాలి. కనీసం ఇంటరిమ్ రిలీఫ్ ద్వారా తాత్కాలిక ఉపశమనమివ్వాలి. అలాగే టిపిఎస్ తరహా గ్యారంటీడ్ పెన్షన్ స్కీమ్పై గంభీరంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసేపాలన చివరికి ప్రజల విశ్వాసాన్నే కోల్పోయే ప్రమాదం ఉందన్న సత్యాన్ని ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించాలి. •

# పాఠశాలల పునరుజ్జీవనానికి హేతుబద్ధీకరణే మార్గమా?

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ అనే అంశం ఇటీవలి కాలంలో రాష్ట్ర విద్యా విధానంలో అత్యంత కీలకమైన మలుపుగామారింది. విద్యావ్యవస్థలో అసమానతలు, వనరుల వృథా, ఉపాధ్యాయుల అసమతుల పంపిణీ వంటి దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారంగా ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఈ ప్రక్రియను పూర్తిగా అమలు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈనిర్ణయానికి పూర్వాపరాలు, దానికి దారితీసిన సంఘటనలు, ప్రస్తుతం ఉన్న గణాంకాలు, భవిష్యత్‌పై దీని ప్రభావం అన్నిటినీ సమగ్రంగా పరిశీలిస్తే ఇదికేవలం పరిపాలనా సంస్కరణ మాత్రమే కాకుండా ప్రభుత్వ పాఠశాల విద్యా భవిష్యత్తును నిర్ణయించే కీలకచర్యగా కనిపిస్తుంది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ చరిత్రను పరిశీలిస్తే ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలు, పదోన్నతులు తరచూరాజకీయ, ప్రాంతీయ ఒత్తిళ్లకు లోనవుతూనే వచ్చాయి. ఒక దశలో విద్యార్థుల సంఖ్యకు మించిన ఉపాధ్యాయులు కొన్ని పాఠశాలల్లో ఉండగా, మరికొన్ని గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లో కనీస అవసరానికి సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నసందర్భాలు అనేకం. ఉదాహారణకు, గత దశాబ్దంలో నిర్వహించిన విద్యాశాఖ అంతర్గత సర్వేల్లో పట్టణ ప్రాంతాల్లోని కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:15 లేదా 1:18 ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తి ఉండగా, మారుమూల మండలాల్లో అదే నిష్పత్తి 1:60 లేదా అంతకంటే ఎక్కువగా నమోదైంది. ఈ అసమానతలు విద్యా నాణ్యతపై ప్రత్యక్ష ప్రభావం చూపడమే కాకుండా ప్రభుత్వ వ్యయాన్ని కూడా అనవసరంగా పెంచాయి. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ అనే భావన ముందుకు వచ్చింది. హేతుబద్ధీకరణ అంటే ఉద్యోగాలను తగ్గించడం కాదు, ఉన్న వనరులను సమర్థంగా, న్యాయంగా పంపిణీ చేయడం. ప్రభుత్వ వివరణ ప్రకారం విద్యార్థుల సంఖ్య, పాఠశాల స్థాయి, తరగతుల సంఖ్య, భౌగోళిక పరిస్థితులు వంటి ప్రమాణాల ఆధారంగా ప్రతి పాఠశాలకు అవసరమైన ఉపాధ్యాయుల సంఖ్యను ఖరారు చేయడం ఈ ప్రక్రియ మూల ఉద్దేశం. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలల సంఖ్య, వాటిలోపనిచేస్తున్న ఉపాధ్యాయుల మొత్తం సంఖ్య, విద్యార్థుల నమోదు గణాంకాలను పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నారు. తాజా అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో సుమారు లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వాటిలో దాదాపు నాలుగు లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కానీ విద్యార్థుల మొత్తం సంఖ్య గత పది సంవత్సరాల్లో క్రమంగా తగ్గుతూ రావడం గమనార్హం. ప్రైవేట్ పాఠశాలల విస్తరణ, వలసలు, జనాభా ధోరణుల మార్పు వంటి కారణాల వల్ల కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పడిపోయింది. ఈ గణాంకాలే హేతుబద్ధీకరణకు బలమైన ఆధారంగా మారాయి. ఉదాహారణకు, ఒక పాఠశాలలో మొత్తం విద్యార్థులు 40 మాత్రమే ఉండగా అక్కడ ముగ్గురు లేదా నలుగురు ఉపాధ్యాయులుఉండటం,



మరో పాఠశాలలో 200 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండటం వంటి పరిస్థితులుస్పష్టమైన అసమతులతను చూపుతున్నాయి. ప్రభుత్వం విడుదలచేసిన నివేదికల ప్రకారం సుమారు 20శాతం పాఠశాలల్లో అవసరానికి మించిన ఉపాధ్యాయులు ఉండగా, దాదాపు 30 శాతం పాఠశాలల్లో తీవ్ర కొరత ఉంది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల బదిలీలు, పునర్వ్యవస్థీకరణ తప్పనిసరిగా మారింది. హేతుబద్ధీకరణ నిర్ణయానికి దారితీసిన సంఘటనల్లో మరో ముఖ్యమైన అంశం జాతీయ విద్యా విధానం సూచనలు. విద్యానాణ్యత, ఉపాధ్యాయుల పాత్ర, విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రాథమిక స్థాయిలో 1:30, ప్రాథమికోన్నత స్థాయిలో 1:35 నిష్పత్తి సాధించాలన్న సూచనలను రాష్ట్రం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రమాణాలను సాధించాలంటే ఉన్న ఉపాధ్యాయులను సమర్థంగా వినియోగించడమే ప్రధాన మార్గమని విద్యాశాఖభావించింది. కొత్త నియామకాలు చేపట్టడం కంటేముందుగా ఈ అసమానతలను సరిదిద్దడం ఆర్థికంగా కూడా ప్రభుత్వానికి మేలు చేస్తుందని ఆర్థికశాఖ అంచనా వేసింది. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే ఉపాధ్యాయ సంఘాల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. కొందరు దీన్ని అవసరమైన సంస్కరణగా స్వాగతిస్తే, మరికొందరు ఉద్యోగ భద్రత, బలవంతపు బదిలీలు, కుటుంబ సమస్యలు వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాత్రం స్పష్టంగా ఒక విషయం చెబుతోంది హేతుబద్ధీకరణ వల్ల ఒక్క ఉపాధ్యాయుడి ఉద్యోగం కూడా పోదు, వేతనాలు తగ్గవు. కేవలం పాఠశాలల మధ్య సమతుల పంపిణీ మాత్రమే జరుగుతుంది. బదిలీల్లో పారదర్శకత కోసం ఆన్‌లైన్ విధానం, స్పష్టమైన పాయింట్ల వ్యవస్థను అమలు చేస్తామని ప్రకటించింది. సీనియారిటీ, మహిళా ఉపాధ్యాయుల సమస్యలు, అనారోగ్య కారణాలు వంటిఅంశాలకు ప్రత్యేకప్రాధాన్యం ఇస్తామని హామీఇచ్చింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం వరకు ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్న లక్ష్యం వెనుక ఒకవ్యూహం ఉంది. విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయుల మార్పులు జరిగితే బోధనకు అంతరాయం కలుగుతుందన్న విమర్శలు గతంలో వచ్చాయి. అందుకే ఈసారి వేసవి సెలవుల కాలాన్ని వినియోగించి హేతుబద్ధీకరణను పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి ప్రతి తరగతికి సరిపడా ఉపాధ్యాయులు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఈ క్రమంలో జిల్లాల వారీగా డేటా సేకరణ, మండలస్థాయి సమీక్షలు, రాష్ట్రస్థాయి ఆమోదం వంటి దశలను ఖరారు చేశారు. గణాంకాల పరంగా చూస్తే ఈ చర్యవల్ల సంవత్సరానికి వందల కోట్లరూపాయల ప్రభుత్వ వ్యయం సమర్థంగా వినియోగంకానుంది. అవసరానికి మించిన ఉపాధ్యాయులున్న పాఠశాలల్లో అదనపు తరగతులు లేకపోయినా వేతనాలు చెల్లించాల్సి వస్తుండేది. మరోవైపు ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యా ఫలితాలు దెబ్బతింటున్నాయి. ఈ రెండు సమస్యలకు ఒకేసారి పరిష్కారం చూపే మార్గంగా హేతుబద్ధీకరణను ప్రభుత్వం చూస్తోంది. విద్యాశాఖ అంతర్గత అంచనాల ప్రకారం ఈ ప్రక్రియ పూర్తయితే ఉపాధ్యాయ-విద్యార్థి నిష్పత్తిలో 90 శాతం వరకు సమతులత సాధ్యమవుతుంది. గ్రామీణ, పేద, వెనుకబడిన వర్గాల పిల్లలు ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలపై ఆధారపడుతున్నారు. అక్కడ ఉపాధ్యాయుల కొరత ఉండటం అంటే నేరుగా ఆ వర్గాల భవిష్యత్తుపై ప్రభావం పడటమే. హేతుబద్ధీకరణ ద్వారా అటువంటి ప్రాంతాలకు ఎక్కువ మంది ఉపాధ్యాయులు అందుబాటులోకి రావడం విద్యలో సమాన అవకాశాలను పెంచుతుంది. •




# ఇక మలేసియాలోను భారత్ యుపిఐ సేవలు


**కౌలాలంపూర్, ఫిబ్రవరి 8:** భారత్‌లో అమలవుతున్న యూపీఐ సేవలు త్వరలో మలేసియాలో కూడా అందుబాటులోకి వస్తున్నట్లు భారత ప్రధాని నరేంద్ర మోదీ మలేసియా వేదికగా వెల్లడించారు. ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ మలేసియాలో కూడా త్వరలోనే యూపీఐ సేవల్ని అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. ఎప్పటినుంచి అందుబాటులోకి వచ్చేది వెల్లడించలేదు. ఈ సేవలు అక్కడ ఉంటున్న భారతీయులకు మేలు కలిగిస్తాయని మోదీ అన్నారు. మలేసియాలో రాబోయే యూపీఐ సేవలు వీపీఏ (వర్చువల్ పేమెంట్ అడ్రస్), లేదా క్యూఆర్ కోడ్, లేదా మొబైల్ నెంబర్ ద్వారా అందుబాటులోకి వస్తాయి. బ్యాంక్ అకౌంట్లతో పని లేకుండా ఈ సేవల్ని వినియోగించుకోవచ్చు. టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ద్వారా ఈ సేవలకు భద్రత ఉంటుంది. మరోవైపు దేశంలో యూపీఐ సేవలు దూసుకెళ్తున్నాయి. గత ఏడాది 640 మిలియన్ల ట్రాన్సాక్షన్స్ జరిగినట్లు గణాంకాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది వాడుతున్న వీసా కార్డ్ సేవల కంటే మన యూపీఐ సేవలే అధికం. ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న డిజిటల్ ట్రాన్సాక్షన్స్‌లో సగానికిపైగా ఇండియాలోనే జరుగుతున్నాయి. మోదీ రెండు రోజుల మలేసియా పర్యటనలో భాగంగా ఆ దేశంతో కీలక ఒప్పందాలు చేసుకున్నారు. రక్షణ, వ్యాపారం, సహకారం, సెమీకండక్టర్ల సరఫరా వంటి అంశాల్లో ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరాయి. మరోవైపు వివాదాస్పద మత గురువు జాకీర్ నాయక్‌ను ఇండియాకు అప్పగించే అంశంపై కూడా ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. ఇండియాకు చెందిన జాకీర్ నాయక్ కొన్నేళ్లుగా మలేసియాలో ఉంటున్నాడు.

# బంగ్లాలోని హిందువులు పోరాడితే మద్దతు ఇవ్వనున్న ప్రపంచ హిందూజాతి

**ముంబయి, ఫిబ్రవరి 8:** బంగ్లాదేశ్‌లో ఉన్న హిందూ మైనార్టీల జనాభా తమ హక్కుల కోసం పోరాడితే, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల మద్దతు లభిస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్‌భగవత్ స్పష్టంచేసారు. వర్లీలోని నెహ్రూ సెంటర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన 100 ఇయర్స్ జర్నీ ఆఫ్ సంఘ్: న్యూ హారిజాన్ అనే కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ ప్రసంగించారు. 2024 ఆగస్టులో హింసాత్మక నిరసనల కారణంగా అప్పటి ప్రధాని షేక్ హాసీనా పదవికి రాజీనామా చేసి, భారత్ పారిపోయి వచ్చారు. అప్పటి నుంచి అక్కడ హిందువులపై దాడులు మొదలయ్యాయి. ఇటీవల, విద్యార్థి నేత ఉస్మాన్ హాది మరణం తర్వాత హిందువుల్ని టార్గెట్ చేస్తూ పలు హత్యలు జరిగాయి. భారతదేశ సమస్యలపై స్పందించిన మోహన్ భగవత్ భారతదేశంలో మారుతున్న జనాభా స్వరూపాన్ని పరిష్కరించడానికి గత ప్రభుత్వాలు కృషి చేయలేదని అన్నారు. ఈ మార్పులకు జననాల రేటు, అక్రమ వలసలు ప్రధాన కారణమని అన్నారు. భారతదేశాన్ని ఇప్పుడు విడగొట్టలేదని , అలా ప్రయత్నించే వారే విచ్ఛిన్నమవుతారని ఆయన అన్నారు. ఏ కులం వారైనా ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ కావచ్చని, ఎస్టీఎస్టీ కావడం అనర్హత కాదని, బ్రాహ్మణుడు కావడం అర్హత కాదని ఆయన అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభంలో బ్రాహ్మణులతో ప్రారంభమైనప్పటికీ, అన్ని కులాల కోసం పనిచేస్తోందని చెప్పారు. 75 ఏళ్లు నిండినప్పటికీ ఆరెస్సెస్ చీఫ్ పదవి నుంచి ఎందుకు ఆయన ఇంకా దిగిపోలేదు అనే విషయంపై క్లారిటీ ఇచ్చారు. అదే సమయంలో హిందువుల గురించి మాట్లాడిన మోహన్ భాగవత్ మొత్తం నాలుగు రకాల హిందువులు ఉన్నారని పేర్కొన్నారు. ఇక భారతదేశంలో నివసించే ప్రతీ ఒక్క వ్యక్తి హిందువేనని తేల్చి చెప్పారు. హిందూ అంటే కేవలం నామవాచకం కాదని మన దేశ నాగరిక స్వభావాన్ని ప్రతిబింబించే విశేషణమని వెల్లడించారు. భారత్‌లో నివసిస్తున్న ముస్లింలు, క్రిస్టియన్లు అంతా ఈ దేశానికి చెందినవారేనని మోహన్ భాగవత్ వెల్లడించారు. ఇక భారత్‌లో నాలుగు రకాల హిందువులు ఉన్నారని మొదటి రకం వారు తాము హిందువులం అని గర్వంగా చెప్పేవారని తెలిపారు. ఇక రెండో రకం వారు హిందువులైతే గర్వపడడానికి ఏం ఉందని ప్రశ్నించేవాళ్లని పేర్కొన్నారు. అదే మూడో రకం వారు చాలా సున్నితంగా ఉంటారని వాళ్లు అడిగితేనే తాము హిందువులం అని చెబుతారని వెల్లడించారు. ఇక నాలుగో రకం వాళ్లు తాము హిందువులం అనేదే మర్చిపోయిన వాళ్లు అని లేదా మర్చిపోయేలా చేయబడిన వాళ్లని మోహన్ భగవత్ తెలిపారు. ఇంకా చాలా మంది హిందువులను కూడా.. తాము హిందువులమని మర్చిపోయేలా చేసేందుకు అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఎవరైనా హిందుత్వాన్ని స్వీకరించాలని భావిస్తే తమ నమ్మకాలు, భాష, మతపరమైన ఆచారాలను వదిలేయాల్సిన అవసరం లేదని ఆరెస్సెస్

> వయసుమీరినా పదవిలో కొనసాగాలన్న ఆర్ఎస్సెస్
>
> ట్రేడ్ డీల్‌తో భారత్‌కు నష్టం లేదు: మోహాన్‌భగవత్

చీ ఎ.ˆ స్పష్టం చేశా రు. అందరి భద్రతకు హిందుత్వం హామీ ఇస్తుందని వెల్లడించారు. ఒక వ్యక్తి విశ్వాసాలు, ఆహారపు అలవాట్లు, భాష వేర్వేరుగా ఉండొచ్చు కానీ మనం అందరం ఒకే సమాజం, ఒకే దేశం, ఒకే సంస్కృతి అని స్పష్టం చేశారు. దాన్నే హిందుత్వం అని పిలుస్తామని.. దీన్నే భారతీయత అని కూడా పిలవచ్చని తేల్చి చెప్పారు. అదే సమయంలో ఆరెస్సెస్ అధినేతగా తన రిటైర్మెంట్‌పై



స్పందించిన మోహన్ భగవత్ వయసు నిండినా పదవిలోనే ఉండాల సంఘ్ తనను కోరినట్లు చెప్పారు. ఒకవేళ చీఫ్ పదవి నుంచి దిగిపోవాలని ఆదేశాలు జారీ చేస్తే ఎప్పుడైనా తప్పుకునేందుకు రెడీగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆరెస్సెస్ చరిత్రలో ఇప్పటివరకు ఎవరికీ రిటైర్మెంట్ ఇవ్వాల్సిన పరిస్థితి రాలేదని గుర్తు చేశారు. ఇక ఆరెస్సెస్ అధిపతి పదవికి ఎన్నికలుండవని రీజినల్, డివిజనల్ చీఫ్‌లు సర్‌సంఘ్‌చాలక్‌ను నియమిస్తారని వెల్లడించారు. పదవి నుంచి విరమణ ఉంటుంది కానీ పని నుంచి మాత్రం ఎప్పటికీ ఉండదని మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరి చివరి రక్తపు బొట్టు వరకు స్వయంసేవకులను సంఘ్ పని చేయించుకుంటుందని వ్యాఖ్యలు చేశారు. దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారత ˇరత్నను వీర్ సావర్కర్‌కు ప్రకటిస్తే దాని ప్రతిష్ఠ ఇంకా పెరుగుతుందన్నారు.


# గల్వాన్ ఘర్షణల తర్వాతే చైనా అణుపరీక్ష

## యుఎస్ సంచలన ఆరోపణ



**వాషింగ్టన్, ఫిబ్రవరి 8:** చైనా 2020లో రహస్యంగా అణుపరీక్ష నిర్వహించిందని అమెరికా సంచలన ఆరోపణలు చేసింది. భారత్‌తో గల్వాన్ లోయలో ఘర్షణలు జరిగిన వారం రోజుల తర్వాత, జూన్ 22న ఈ పరీక్ష జరిగిందని తొలిసారి బహిరంగంగా వెల్లడించింది. అయితే, ఈ ఆరోపణలను చైనా తీవ్రంగా ఖండించగా, అంతర్జాతీయ అణు పరీక్షల పర్యవేక్షణ సంస్థ (సిటిబిటిఒ) కూడా అమెరికా వాదనకు విరుద్ధమైన ప్రకటన చేసింది. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరిగిన నిరాయుధీకరణ సదస్సులో అమెరికా అండర్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ థామస్ డినాన్నో శుక్రవారం ఈ ఆరోపణలు చేశారు. 'చైనా అణు విస్ఫోటన పరీక్షలు నిర్వహించినట్లు అమెరికా ప్రభుత్వానికి తెలుసు. ప్రపంచం నుంచి తన కార్యకలాపాలను దాచిపెట్టడానికి 'డీకప్లింగ్' అనే సాంకేతికతను చైనా ఉపయోగించింది. 2020 జూన్ 20న అలాంటి ఒక పరీక్ష జరిపింది' అని ఆయన తెలిపారు. భూగర్భంలో పెద్ద ఖాళీ ప్రదేశంలో అణుపరీక్ష జరపడం ద్వారా భూకంప తరంగాలను తగ్గించి, పసిగట్టకుండా చేయడాన్నే డీకప్లింగ్ అంటారు. అమెరికా, రష్యా మధ్య కీలకమైన 'న్యూ స్టార్ట్' అణు ఒప్పందం ఇటీవల ముగిసిన నేపథ్యంలో ఈ ఆరోపణలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భవిష్యత్తులో అణ్వస్త్ర నియంత్రణ ఒప్పందాల్లో చైనాను కూ భాగం చేయాలని అమెరికా భావిస్తోంది. ఈ క్రమంలోనే ఒత్తిడి పెంచేందుకు ఈ ఆరోపణలు చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా ఆరోపణలపై చైనా తీవ్రంగా స్పందించింది. ఇవన్నీ నిరాధారమైన కథనాలని, ఆయుధ పోటీని పెంచుతున్నది అమెరికానే అని చైనా రాయబారి షెన్ జియాన్ విమర్శించారు.

మరోవైపు, అణు పరీక్షలను పర్యవేక్షించే అంతర్జాతీయ సంస్థ సిటిబిటిఒ కూడా ఒక ప్రకటనల విడుదల చేసింది.



# ఎఫ్ఆర్ శాటిలైట్‌తో అంతరిక్షంలో నిఘా!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** అంతరిక్ష రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. కక్ష్యలో తిరుగుతున్న ఒక ఉపగ్రహం నుంచి మరో ఉపగ్రహం లేదా వస్తువుపై నిఘా పెట్టగల సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది. అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అజిస్టా స్పేస్ అనే ప్రైవేట్ సంస్థ ఈ రికార్డు సాధించింది. తమ ఏఎఫ్ఆర్ శాటిలైట్‌ను ఉపయోగించి, కక్ష్యలో తిరుగుతున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని (ఐఎస్ఎస్) విజయవంతంగా ట్రాక్ చేసి ఫొటోలు తీసింది. ఈ ప్రదర్శనతో అంతరిక్షంలో శత్రు దేశాల ఉపగ్రహాలపై గూఢచర్యం చేసే కీలక సాంకేతికత భారత్‌కు అందుబాటులోకి వచ్చినట్లయింది. 2023లో ప్రయోగించిన 80 కిలోల ఏఎఫ్ఆర్ శాటిలైట్ సుమారు 250 నుంచి 300 కిలోమీటర్ల దూరం నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం కదలికలను పసిగట్టి, స్పష్టమైన చిత్రాలను బంధించింది. దీనిని "నాన్‌ఎర్త్ ఇమేజింగ్" (ఎన్ఈఐ) టెక్నాలజీగా పిలుస్తారు. ఇది దేశ అంతరిక్ష భద్రతకు, వ్యూహాత్మక ప్రయోజనాలకు అత్యంతముఖ్యమైనదని నిపుణుల అంచనా. అజిస్టా స్పేస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ భరత్ సింహా రెడ్డి మాట్లాడుతూ "స్పేస్ సిచ్యుయేషనల్ అవేర్‌నెస్‌కు ఈ సామర్థ్యం చాలా అవసరం. ముఖ్యంగా సాయుధ దళాలు శత్రు దేశాల ఉపగ్రహాల కదలికలను గుర్తించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది" అని వివరించారు. 2019లో భారత్ మిషన్ శక్తి ద్వారా యాంటీ శాటిలైట్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించి, అంతరిక్షంలో ఉపగ్రహాలను కూల్చివేసే సామర్థ్యాన్ని ప్రదర్శించింది. ఇప్పుడు ఒక ఉప గ్రహంతో మరో ఉపగ్రహంపై నిఘా పెట్టగల ఈ కొత్త టెక్నాలజీతో అంతరిక్ష రక్షణ రంగంలో భారత్ మరింత పటిష్టంగా మారింది. భారత అంతరిక్ష విధానం2023 ప్రకారం ప్రైవేట్ సంస్థలకు ఇస్తున్న ప్రోత్సాహం వల్లే ఈ విజయం సాధ్యమైందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# థాయిలాండ్‌లో హాంగ్?

## - ఏ పార్టీకి మెజారిటీ వచ్చే అవకాశం లేదు: సర్వేలో వెల్లడి



**బ్యాంకాక్, ఫిబ్రవరి 8:** థాయిలాండ్‌లో ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజారిటీ లభించకపోవచ్చని సర్వేలో వెల్లడైంది. ఆదివారం స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమై, సాయంత్రం 5 గం.లకు ముగిసింది. ప్రగతిశీల పీపుల్స్ పార్టీ, భుమ్‌జైతే, ఫ్యూథాయ్ పార్టీలతోపాటు దాదాపు 50 పార్టీలు తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. సర్వేలు మాత్రం ఏ పార్టీ కూడా పూర్తి మెజారిటీని సాధించే అవకాశం లేదని స్పష్టం చేస్తున్నాయి. ఈసారి సంకీర్ణ ప్రభుత్వానికి అవకాశాలున్నాయని ఎగ్జిట్ పోల్స్ కూడా చెబుతున్నాయి. నత్తఫాంగ్ రుయెంగ్‌పన్యావుట్ నేతృత్వంలోని ప్రగతిశీల పీపుల్స్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది. ప్రధాన మంత్రి అనుతిన్ చార్న్‌విరాకుల్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని బెదిరింపుల నేపథ్యంలో పార్లమెంటును రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 1న ప్రారంభమైన ముందస్తు ఓటింగ్ కాలంలో ఇప్పటికే 2.2 మిలియన్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, తాజాగా అందిన సమాచారం ప్రకారం 53 మిలియన్‌ల ఓటర్లలో 37 మిలియన్ల మంది ఓటేశారని ఎన్నికల సంఘం తెలిపింది.

# జమ్ముకాశ్మీర్ బడ్జెట్‌పై బిజెపి ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు

## స్వపక్ష విపక్షాలు సైతం బల్లలు చరిచి అభినందనలు

**శ్రీనగర్, ఫిబ్రవరి 8:** కేంద్రపాలిత ప్రాంతమైన జమ్ముకశ్మీర్ బడ్జెట్‌ను కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే దేవయాని రాణా తీవ్రంగా విమర్శించారు. అసెంబ్లీలో తొలిసారి ప్రసంగించిన ఆమె బడ్జెట్‌లోని లోటుపాట్లను ఎత్తిచూపారు. సీఎం ఒమర్ అబ్దుల్లాకు చెందిన అధికార నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) ఎమ్మెల్యేలతో సహా ఇతర పార్టీల సభ్యులు ఆమెను ప్రశంసించారు. ఆర్థిక శాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో రూ. 1.13 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గతంలో ఎన్సీ సీనియర్ నేత అయిన దేవేందర్ సింగ్ రాణా, సీఎం ఒమర్ అబ్దుల్లాకు అత్యంత సన్నిహితుడు. 2024 అక్టోబర్‌లో జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్సీకి ఆయన రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో నగ్రోటా నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా దేవేందర్ సింగ్ రాణా గెలిచారు. అయితే కొన్ని నెలలకే ఆయన మరణించారు. ఈ నేపథ్యంలో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన కుమార్తె దేవయాని రాణా బీజేపీ తరుపున పోటీ చేసింది. ఎన్సీ పెద్దగా పోటీ ఇవ్వక పోవడంతో ఆమె గెలిచింది. మరోవైపు జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ జరిగింది. దీంతో అసెంబ్లీకి తొలిసారి ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే దేవయాని రాణా తొలిసారి మాట్లాడారు. ఆమె తొలి ప్రసంగాన్ని ప్రోత్సహించాలని స్పీకర్ అబ్దుల్ రహీమ్ రథర్ సభ్యులను కోరారు. ఈ నేపథ్యంలో దేవయాని రాణా సుమారు 12 నిమిషాల ప్రసంగాన్ని సభ నిశ్శబ్దంగా ఆలకించింది. కీలక రంగాల్లో బడ్జెట్ కేటాయింపులను ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం తగ్గించడంపై దేవయాని తీవ్రంగా విమర్శించారు. విపత్తు నిర్వహణ, సహాయక చర్యల కోసం కేటాయింపులను సగానికిపైగా తగ్గించడాన్ని తప్పుపట్టారు. విద్యా బడ్జెట్‌ను తగ్గిస్తే స్కూల్స్ మూసివేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం



చేశారు. అప్పుడు ఒక పేద బిడ్డ ఎలా అభివృద్ధి చెందుతాడని ఆమె ప్రశ్నించారు. సంక్షేమ పథకాలపై ప్రభుత్వ విధానపర లోపాలను ఎత్తిచూపారు. అయితే బీజేపీ యువ ఎమ్మెల్యే దేవయాని రాణా బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు చేసినప్పటికీ, ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించినప్పటికీ అధికార ఎన్సీతో సహా ఇతర పార్టీల సభ్యులంతా ఆమెను ప్రశంసించారు. బల్లలు చరిచి దేవయాని తొలి ప్రసంగాన్ని అభినందించారు.

## టోల్‌ప్లాజాల వద్ద నగదు చెల్లింపులు రద్దు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** కేంద్ర ప్రభుత్వం టోల్ వసూళ్ల విషయంలో సులభతరం చేస్తోంది. వినియోగదారులకు మెరుగ్గా ఉండేందుకు సేవలను మరింత సులభతరం చేస్తోంది. అయితే టోల్ ప్లాజాల వద్ద రద్దీని తగ్గించేందుకు ఫాస్టాగ్‌ను తీసుకొచ్చింది. దీంతో టోల్‌ప్లాజాల వద్ద ఆటోమేటిక్‌గా ఛార్జీలు కట్ అవుతాయి. అయితే ఈ ఫాస్టాగ్ వచ్చిన తర్వాత కూడా టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు పూర్తిస్థాయిలో తీరకపోవడంతో కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. టోల్‌గేట్ల వద్ద పాస్టాగ్ ఉన్న వారికి మాత్రమే టోల్ వసూలు చేస్తున్నారు. ఇందులో నగదు చెల్లింపులు ఉండవు, అదే ఫాస్టాగ్ ఏని వారు లేదా పనిచేయనివారు యుపిఐ ద్వారా టోల్ చెల్లింపులు చేస్తుంటారు. అయితే ఈ సదుపాయం కూడా లేనివారు నగదు రూపంలో టోల్ రుసుము చెల్లిస్తుంటారు. ఈ సమయంలో ఇక్కడే సమస్య తలెత్తుతుంది. నగదు చెల్లింపుల కారణంగా టోల్ ప్లాజాల వద్ద జాప్యం ఏర్పడి మరింత రద్దీ పెరుగుతోంది.

# స్వింగ్‌రైడ్ కూలి ఇన్‌స్పెక్టర్ మృతి

## 13 మందికి తీవ్రగాయాలు



**చండీగఢ్, ఫిబ్రవరి 8:** ఒక మేళాలో స్వింగ్ రైడ్ కూలింది. దానిపై ఉన్న వారిని రక్షించేందుకు ప్రయత్నించిన పోలీస్ అధికారి మరణించగా మరో 13 మంది గాయపడ్డారు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్వింగ్ రైడ్ ప్రమాదానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. సూరజ్‌కుండ్‌లో జరుగుతున్న అంతర్జాతీయ క్రాఫ్ట్ ఫెస్టివల్ లో వినోదం కోసం పలు రైడ్స్, స్టాల్స్ ఏర్పాటు చేశారు. ముందురోజు సాయంత్రం 6.15 గంటల సమయంలో 15 మంది వ్యక్తులు సునామీ స్వింగ్ ఎక్కారు. ఆ పెద్ద ఊయల వేగంగా రౌండ్స్ తిరిగింది. ఉన్నట్టుండి ఒకవైపు స్తంభం నుంచి ఆ స్వింగ్ ఊడిపోయింది. అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ ప్రసాద్, మరి కొందరు సహాయం చేసేందుకు ప్రయత్నించారు. ఇంతలో రెండో స్తంభం నుంచి కూడా స్వింగ్ ఊడింది. సహాయం చేస్తున్న వారిపై అది పడింది. తలకు గాయం కావడంతో పోలీస్ అధికారి జగదీష్ ప్రసాద్ మరణించారు. మరో 13 మంది గాయపడ్డారు. మరోవైపు ఈ ప్రమాదం నేపథ్యంలో మేళాలో గందరగోళం చెలరేగింది. దీంతో సందర్శకులను ఆ ప్రాంగణం నుంచి ఖాళీ చేయించారు. పోలీసులు, అధికారులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు.



# చరిత్రలో తొలి ఐవిఎఫ్ గిర్‌జాతి ఆవుదూడ జననం!

**అహ్మదాబాద్, ఫిబ్రవరి 8:** గుజరాత్ పశుసంవర్ధక రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టం నమోదయింది. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) పద్ధతి ద్వారా ఒక స్వచ్ఛమైన గిర్ జాతి దూడ జన్మించింది. అమ్రేలి జిల్లాలోని వరుడిలో ఉన్న గుజరాత్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ బోర్డ్‌కు చెందిన పిండ మార్పిడి ప్రయోగశాలలో ఈ విజయం సాధ్యమైంది. మేలుజాతి పశుసంపదను పెంచి, పాల ఉత్పత్తిని అధికం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ ప్రయోగంలో భాగంగా, అత్యుత్తమ జన్యు లక్షణాలున్న గిర్ జాతి ఆవు నుంచి సేకరించిన అండాలతో ప్రయోగశాలలో పిండాన్ని సృష్టించారు. ఆ పిండాన్ని కాంక్రేజ్ జాతికి చెందిన ఒక అద్దె గర్భం (సరోగసీ) దాల్చిన ఆవులోకి ప్రవేశపెట్టారు. తాజాగా ఆ ఆవు ఒక ఆరోగ్యవంతమైన గిర్ దూడకు జన్మనిచ్చింది.

# సంక్షిప్తంగా..

## భోలారీ ఎయిర్‌బేస్‌లో హ్యాంగర్‌ను తొలగిస్తున్న పాక్!



**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 8:** ఆపరేషన్ సిందూర్ వేళ తమకు ఏమీ కాలేదని పాకిస్థాన్ చెబుతున్నా.. ఉపగ్రహ చిత్రాల్లో మాత్రం పరిస్థితిని దాచలేకపోతోంది. భారత్ దాడిలో దెబ్బతిన్న భొలారిలోని పాక్ వాయుసేన స్థావరంలోని హ్యాంగర్‌కు తాజాగా మరమ్మతులు చేస్తోంది. మే 10న భారత్ దీనిపై దాడి చేసింది. ఇక్కడ పాక్‌కు చెందిన ఎయిర్‌బార్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్ క్రాఫ్ట్ సాబ్-2000 విమానం ధ్వంసమైనట్లు భారత్ అంచనా వేసింది. ఈ యేడాది జనవరి 28న వాంటోర్ సంస్థకు చెందిన ఉపగ్రహాలు ఇక్కడ చిత్రాలను తీశాయి. ఆ సమయంలో ఎయిర్‌బేస్‌లో దెబ్బతిన్న హ్యాంగర్‌కు పాక్ దళాలు మరమ్మతులు చేస్తున్నట్లు తేలింది. అప్పటికే దెబ్బతిన్న ఆకుపచ్చటి పైకప్పును తొలగించినట్లు కనిపించింది.

## భారత్‌పై దాడిని 'ఘజ్వా - ఎ- హింద్'గా అభివర్ణించిన పాక్ ఆర్మీ చీఫ్

**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 8:** పాకిస్తాన్ ఆర్మీచీఫ్ అసిమ్ మునీర్ భారత్‌పై ఎలాంటి వ్యతిరేకతను ప్రదర్శించాడో, జైషే మహ్మద్ ఉగ్రవాది చెప్పడం సంచలనంగా మారింది. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిగా పాక్ ప్రారంభించిన దాడుల్ని 'ఘజ్వా - ఎ - హింద్'గా అభివర్ణించాడని జైష్ ఉగ్రవాది ఇలియాస్ కాశ్మీరీ అన్నాడు. భారత్‌పై మతపరమైన యుద్ధం చేసి, ఇస్లామిక్ పాలన స్థాపించాలనే సిద్ధాంతాన్ని 'ఘజ్వా ఎ హింద్' సూచిస్తుంది. ఫిబ్రవరి 5న పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని రావల్‌కోట్‌లో ఉగ్రవాదుల సమావేశంలో కాశ్మీరీ అన్నారు. వైమానిక దళానికి చెందిన 10కి పైగా ఎయిర్ బేసుల్ని భారత్ ధ్వంసం చేసింది.

## వాషింగ్టన్‌పోస్ట్ సిఇఒ రాజీనామా




**వాషింగ్టన్, ఫిబ్రవరి 8:** ప్రముఖ అమెరికన్ వార్తాపత్రిక ది వాషింగ్టన్ పోస్ట్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సంస్థ పబ్లిషర్, సీఈవోగా వ్యవహరిస్తున్న విల్ లూయిస్ తన పదవికి ఆకస్మికంగా రాజీనామా చేశారు. 300 మందికి పైగా జర్నలిస్టులు సహా సిబ్బందిలో మూడో వంతు మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించిన మూడు రోజులకే ఆయన వైదొలగడం గమనార్హం. సంస్థ ఉద్యోగులకు పంపిన ఒక ఈ మెయిల్‌లో లూయిస్ తన రాజీనామా విషయాన్ని వెల్లడించారు. వాషింగ్టన్ పోస్ట్‌లో రెండేళ్ల పరివర్తన తర్వాత, నేను తప్పుకోవడానికి ఇదే సరైన సమయం. పత్రిక సుస్థిర భవిష్యత్తు కోసం కఠినమైన నిర్ణయాలు తీసుకున్నామని తన ఈమెయిల్‌లో పేర్కొన్నారు.

## ఇమ్రాన్ దంపతులకు 17 యేళ్ల చొప్పున జైలుశిక్ష


**రావల్పిండి, ఫిబ్రవరి 8:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు న్యాయస్థానంలో మరో భారీ షాక్ తగిలింది. తీవ్ర సంచలనం సృష్టించిన తోషఖానా2 అవినీతి కేసులో ఆయనకు, ఆయన భార్య బుష్రా బీబీకి ప్రత్యేక కోర్టు 17 ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష విధించింది. అధికారంలో ఉన్నప్పుడు సౌదీ ప్రభుత్వం నుంచి అందిన ఖరీదైన బహుమతులను ప్రభుత్వ ఖజానాలో జమ చేయకుండా, తక్కువ ధరకు అక్రమంగా సొంతం చేసుకున్నారన్న ఆరోపణలు రుజువయ్యాయి. రావల్పిండిలోని అడియాలా జైలులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి షారుఖ్ అర్జుమంద్ తీర్పును వెలువరించారు. నేరపూరిత విశ్వాసఘాతుకానికి పాల్పడినందుకు 10 ఏళ్లు, అవినీతి నిరోధక చట్టం కింద మరో 7 ఏళ్ల శిక్షను ఖరారు చేశారు. దీంతో పాటు ఇద్దరికీ చెరో రూ. 1.64 కోట్ల జరిమానా కూడా విధించారు.

## బెంగళూరులో కుప్పకూలిన శిక్షణ విమానం



**బెంగళూరు,ఫిబ్రవరి 8:** ప్రైవేట్ శిక్షణ విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తి కూలిపోయింది. ఆ విమానంలోని కెప్టెన్, ట్రైనీ పైలట్ ఈ ప్రమాదంలో గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కర్ణాటకలోని విజయపుర జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం రెడ్ బర్డ్ ఏవియేషన్‌కు చెందిన ఒక ప్రైవేట్ శిక్షణా విమానం కలబురగి నుండి బెళగావికి వెళ్తున్నది. ఆకాశంలో ఎగురుతుండగా ఆ ట్రైనీ విమానం ఇంజిన్‌లో సమస్య వచ్చింది. ఈ నేపథ్యంలో మంగళూరు గ్రామంలోని పొలంలో అది కూలిపోయింది. ఆ విమానంలో ఉన్న కెప్టెన్, ట్రైనీ పైలట్ ఈ ప్రమాదంలో గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# జపాన్‌లో పాలక కూటమిదే పైచేయి - ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** జపాన్ జపాన్ ప్రధానమంత్రి తకైచి పాలక కూటమి మరోమారు విజయదుందుభి మోగిస్తుందని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. ఆదివారం జరిగిన కీలక పార్లమెంట్ ఎన్నికల్లో అధికార సంకీర్ణ కూటమి మూడింట రెండింతల మెజారిటీ సాధించే అవకాలున్నాయని ఎన్‌హెచ్‌కె పబ్లిక్ టెలివిజన్, ఇతర ప్రధాన నెట్‌వర్క్‌లు తమ ఎగ్జిట్ పోల్ ఫలితాలను విడుదల చేశాయి. ప్రధాని తకైచి తన లిబరల్ డెమోక్రటిక్ పార్టీ నేతృత్వంలోని పాలక సంకీర్ణం 465 సీట్ల దిగువ సభలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ గెలుచుకోగలదని ఎన్‌హెచ్‌కె చెబుతోంది, జపాన్ ఆర్థిక వ్యవస్థ, సైనిక సామర్థ్యాలను పెంచే లక్ష్యం సాధించడానికి వీలు కల్పిస్తుంది. వాషింగ్టన్‌తో సంబంధాలను పెంపొందించుకోవడానికి దోహదపడుతుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. జపాన్ తొలి మహిళా ప్రధానమంత్రిగా తకైచి అక్టోబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇంకా మూడు నెలలు పదవీకాలం ఉండగానే, పార్లమెంట్‌ను రద్దు చేసి ముందస్తుకెళ్లారు. ఆమె ఆశించినట్లుగా ఎగ్జిట్స్ పోల్స్ వెల్లడయ్యాయి. పూర్తి ఫలితాలలోనూ ఇదే కొనసాగుతుందని తకైచి ధీమా

# కొత్త బడ్జెట్‌పై 16 నుండి సన్నాహక చర్చలు

### ఆర్థిక శాఖకు చేరిన నిధుల ప్రతిపాదనలు

### వివిధ కారణాలతో సమీక్షల్లో జాప్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** వచ్చే 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక అంచనా బడ్జెట్ రూపకల్పనలో తెలంగాణ సర్కార్ నిమగ్నమైంది. ఇందులో భాగంగా ఈ నెల 16 నుండి సన్నాహక సమావేశాలు ప్రారంభం కానున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విభాగాల వారీగా వచ్చిన ప్రతిపాదనలపై ఆయా శాఖల మంత్రులు, అధికారులతో సమీక్షించనున్నారు. ఇప్పటికే వివిధ శాఖల నుండి తమకు కావాల్సిన నిధులకు సంబంధించిన ప్రతిపాదనలు ఆర్థిక శాఖకు అందినా, వాటిపై సమీక్షలు నిర్వహించడంలో జాప్యం జరిగింది. గతనెల 24 నుంచి శాఖల వారీగా ఆర్థిక శాఖ సన్నాహక సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించినా ముఖ్యమంత్రి రేవంతరెడ్డి విదేశీ పర్యటనలకు తోడు, సమక్క, సారలమ్మ జాతర తదితర కారణాల వల్ల సమీక్షల్లో జాప్యం జరిగింది. దీనికి తగినట్లుగా ప్రస్తుతం రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈనెల 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు, ఎన్నికల ఫలితాలు వస్తాయి. దీంతో ఈ ఫలితాల తర్వాత ఈనెల 16 నుంచి బడ్జెట్ సన్నాహక సమావేశాలను నిర్వహించాలని ఆర్థిక శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఏ శాఖకు సంబంధించి ఏ రోజు సమావేశానికి రావాలనే అంశంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సీఎం విక్రమార్క భేటీ అయ్యారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయం, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను పట్టించుకోని విషయాల గురించి చర్చించారు. రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన, ఏయే రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే అంశాలపై వారు చర్చించినట్టు తెలిసింది. ప్రధానంగా ఆరు గ్యారంటీలు, పలు డిక్లరేషన్లు, ఇతర హామీలను అమలు చేయడంతో పాటు, తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విడుదల చేసింది. ఆ లక్ష్యానికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఎలా ఉండాలనే దానిపై వీరిరువురి మధ్య చర్చకు వచ్చినట్టు సమాచారం. కాగా తెలంగాణ రాష్ట్ర 2026-27 అంచనా బడ్జెట్‌కు సంబంధించి శాఖల వారీగా అవసరాలపై ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు అందాయి. గత నెల 23 నుంచి ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో శాఖల వారీగా ఆన్‌లైన్‌లో ఆయా శాఖలు బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పించాయి. ముఖ్యంగా ఆదాయాలు, వ్యయాలు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన నిధులు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు సిబ్బంది సంఖ్య, వారి జీతాలు మరియు భత్యాలపై అయ్యే ఖర్చు వంటి అంశాలను కలుపుకొని అంచనాలను రూపొందించాయి. ఈ ప్రతిపాదనలను సంబంధిత విభాగాల ముఖ్య కార్యదర్శులు సమీక్షించి, వాస్తవ అవసరాలు తదితర అంశాలపై వ్యాఖ్యలతో ఆర్థిక శాఖకు సమర్పించారు. ఈ నేపథ్యంలో ఈ ప్రతిపాదనలపై డిప్యూటీ సీఎం సమీక్షలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.



## సేంద్రియ వ్యవసాయం పూర్వీకులు మనకందించిన గొప్పవరం

### దేశీయ విత్తనాల పండుగ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 8:** దేశీయ విత్తనాల సంరక్షణ కోసం కడ్తల్ మండలం, ఆన్మాస్‌పల్లి గ్రామంలో ఈ నెల 6,7,8 తేదీలలో దేశీయ విత్తనాల పండుగ జరిగింది. ఆదివారం దేశీయ విత్తనాల పండుగ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ 'సేంద్రియ వ్యవసాయం మన పూర్వీకులు మనం అందించిన గొప్ప వరం. సేంద్రియ వ్యవసాయం ద్వారా లాభం చేకూరుతుంది తప్ప నష్టం జరగదు. మానవుల జీవన విధానం మారటం వలన ఆహార అలవాట్లు కూడా మారాయి. వ్యవసాయాన్ని ఎప్పుడు కూడా రైతులు వ్యాపారంగా చూడరు. వారి బాధ్యత, బ్రతుకు దేరువుగా మాత్రమే చూస్తారు. తెలంగాణలో కేవలం వరి పంటను వేయడానికి మాత్రమే రైతులు ఆసక్తి చూపిస్తున్నారు అది భవిష్యత్‌లో మంచిది కాదు. ఎరువుల వాడకం అధికం అవడం వలన ఆ పదార్థాలు తిన్న వారు అనారోగ్యంతో బాధపడుతున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అడవులను నాశనం చేయడం వలన కోతులు, అటవీ జంతువులు మన పరిసరాల్లోకి, ఇండ్లల్లోకి వస్తున్నాయి. కోతుల సమస్య ప్రధానంగా రైతులను బాగా ఇబ్బందులకు గురి చేస్తోంది, దీనికి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తోంది. రైతులు బాగుంటేనే రాజ్యం బాగుంది అనేది ముమ్మాటికీ నిజం. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివాల్యూషన్ చైర్మన్ కె.లక్ష్మారెడ్డి, పద్మశ్రీ చింతల వెంకటేశ్వర రెడ్డి, దొంతి నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూరియాపై బిఆర్ఎస్ బూటకపు ప్రచారం

### రాజకీయ లబ్ధి కోసం రైతాంగాన్ని రెచ్చగొట్టే దిగజారుడు వ్యవహారాలు

### యాప్ ద్వారా 2.64 కోట్ల బస్తాల యూరియా రైతులకు విక్రయం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో నిల్చుంటున్నారని పదేపదే బిఆర్ఎస్ అసత్య ప్రచారం చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలకులు ఏ విధంగా రైతులను గోస పెట్టారో తెలంగాణ రైతాంగానికి మొత్తం తెలుసునన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో వ్యవసాయరంగానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో కూడా రైతులకు తెలుసునన్నారు. గతంలో సిద్దిపేట, గజ్వేల్‌లో ఎరువుల కోసం క్యూ లైన్లు ఉన్న సందర్భాలు, క్యూ లైన్లలో రైతులు మరణించిన సందర్భాలను బీఆర్ఎస్ నేతలు మరిచిపోవడం శోచనీమన్నారు. రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల సాంకేతిక సమస్యలతో యూరియా కోసం రైతులు వేచి చూసిన సందర్భాన్నీ రాజకీ యం గా వాడుకొనే పరిస్థితికి బీఆర్ఎస్ నేతలుదిగజారారని దుయ్యబట్టారు. రైతులు యాప్ ద్వారా కొనుగోలు చేయకుండానే 7.60 లక్షల టన్నులు యూరియా ఈ యాసంగిలో అమ్ముడుపోయాయా? అని బీఆర్ఎస్‌ను నిలదీశారు. వరి బోనస్ గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. ఈ విషయమై ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ యాసంగి మొత్తానికి 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసర ముంటే ఇప్పటికే 8.42 లక్షల మెట్రిక్ టన్నులు తెప్పించామని, 7.60 లక్షల మెట్రిక్ టన్నులు రైతులకు అందించామన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులకు ఎరువుల విక్రయాలు ఈ.పాస్ మిషన్‌ల ద్వారా జరుగుతాయన్న విషయం కూడా తెలియదా అని ఎద్దేవా చేశారు. ఈ వానాకాలం పత్తి రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్‌ను విజయవంతం కావడంతో, అదే ప్రాతిపదికన యూరియా యాప్‌ను తీసుకువచ్చి అమలు చేస్తున్నామని తెలిపారు. యాప్ ద్వారా 22 జిల్లాల రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇప్పటికే 2.64 కోట్ల బస్తాల యూరియాను కొనుగోలు చేశారని వివరించారు. బీఆర్ఎస్ నేతలు ఎన్ని లేనిపోని అపోహలు సృష్టించినా రైతులు నమ్మరని స్పష్టం చేశారు.

## నగరంలో ఉత్సాహంగా హారేకృష్ణ రన్-2026




సంజీవయ్య పార్కు వద్ద హారేకృష్ణ రన్-2026ను ప్రారంభిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు.

### వీటికి విశేషంగా ఆధ్యాత్మిక పేర్లు

### వ్యసనాలకు వీడ్కోలు పలకాలన్న ప్రముఖులు

### వ్యసన విముక్త భారత్ నినాదంతో రన్

**హైదరాబాద్ (బేగంపేట), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** ఆరోగ్యం అనే మహాభాగ్యం అం దుకోవాలంటే అలవాట్లను అదుపులో ఉంచుకోవడం వ్యసనాలను వదులు కోవ డమే మార్గమని ఆధ్యాత్మికవేత్తలు, వెల్‌నెస్ నిపుణులు స్పష్టం చేసారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక సంస్థ ఇస్కాన్ హైదరాబాద్ ఆధ్వ ర్యంలో ఆదివారం హారేకృష్ణ రన్-2026ను నిర్వహించారు. నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్య పార్కు వద్ద ఈ రన్‌ను ప్రారంభించారు. వ్యసన రహిత జీవనశైలిని ప్రోత్సహించడానికి వ్యసన విముక్తి మైండ్‌ఫుల్ నెస్, కాన్షియస్ లివింగ్‌పై అవగాహన కల్పించడానికి ఈ రన్‌ను నిర్వహిం చారు. 10కె హరినామ్ రన్, 5కె భక్తి రన్, 3కే సంకీర్తన్ వాక్ జరిగింది. ఈ రన్స్‌ను 3 పేర్లతో మూడు విభాగా ల్లో నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హాజ రయ్యా రు. తెలంగాణ ఇండస్ట్రీస్ డైరెక్టర్‌నిఖిల్ చక్రవర్తి జెండా ఊపి రన్‌ను ప్రారంభించగా సనత్ నగర్‌లోని ఇఎస్ఐసి మెడికల్ కాలేజి హాస్పి టల్ డీన్, నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఎండి డా. శిరీష్‌కుమార్ జి.చవాన్, వెంకటేష్ బట్టూ, ఇస్కాన్ అబిడ్స్ టెంపుల్ కన్వీనర్ వరద కృష్ణదాస్, శంభు వైష్ణవ్‌దాస్, హనుమాన్ విజయ్‌దాస్ తదితరులు హాజరై 5కె, 3కె రన్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ సమాజ సంక్షేమం కోసం ఆరోగ్యకరమైన జీవన శైలిని అవలంబించాల్సిన అవసరాన్ని చెప్పారు. హారే కృష్ణ రన్ వ్యసనరహిత జీవితాలను గడపడానికి చైతన్యవంతమైన జీవితాన్ని గడిపే దిశగా ప్రేరేపించే గొప్ప ఉద్యమం అని కొని యాడారు. ఈ రన్‌లో 3వేల మందికి పైగా రన్నర్లు, వాకర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాం స్కృతిక ప్రదర్శనలు, ప్రసాదం పంపిణీ కూడా నిర్వహించారు. విజేతలకు అతిథులు మెడల్స్‌తో పాటు నగదు బహుమతులను అందజేసారు.

## అవినీతిలో పూర్తిగా కూరుకుపోయిన రేవంత్ సర్కారు

### బిజెపి ప్రజాదరణను జీర్ణించుకోలేక బిఆర్ఎస్‌తో కలిసి కుట్రలు

### పార్టీ సీనియర్ నేత ఎన్‌వి సుభాష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** దేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా తీర్చి దిద్దాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, సంస్కర ణల ద్వారా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తోంటే... తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ మాత్రం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, అవినీతిలో కూరుకుపోయిందని బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర ముఖ్యఅధికార ప్రతినిధి ఎన్‌వీ. సుభాష్ మండి పడ్డారు. ఈ మేరకు నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారున్యూయార్క్, దావోస్, హార్వర్డ్ లీడర్‌షిప్ కోర్సులు పేరిట విదేశాలు తిరుగుతూ పాలనను సీఎం గాలికొదిలేశారని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించి బీజేపీ ప్రజాధరణను అడ్డుకునేందుకు బీఆర్ఎస్‌తో కలిసి రాజకీయంగా కుట్రలు చేస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే ఏం చేస్తుందో ప్రజలకు మేనిఫెస్టో ద్వారా ముందే చెప్పామన్నారు. బీజేపీపై ప్రజాదరణ రోజురోజుకు పెరుగుతుండడాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు జీర్ణించుకోలేక పోతున్నాయని మండిపడ్డారు. అత్యంత భద్రత ఉండాల్సిన ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై సీజర్ రూమ్ సీసీ ఫుటేజీ ఎక్కడ? అని నిలదీశారు. అగ్ని ప్రమాదం మొదలైన క్షణాలు రికార్డు అయ్యాయా?, ఆ ఫుటేజీని వెంటనే ఎందుకు బహిర్గతం చేయడం లేదు? అని ప్రశ్నించారు. ఈ ఘటనపై స్వతంత్ర, నిష్పక్షపాత దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అవసరమైతే కేంద్ర దర్యాప్తు సంస్థలతో కూడా విచారణ జరిపించాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై అవినీతి ఆధారాలను మాయం చేస్తున్నాయని, వీటన్నిటికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిందేనని ప్రభుత్వానికి స్పష్టం చేశారు.

## పాడి గేదెల పేరిట కామారెడ్డిలో రైతుకు 8.84 లక్షల టోకరా

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరలేపారు. ఇప్పటి వరకు అనేకరకాల మోసాలకు పాల్పడ్డ నేర గాళ్లు తాజాగా ఆన్‌లైన్‌లో పాడి గేదెలను తక్కువ ధరకు పంపుతామని నమ్మించి కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ రైతుకు 8.84 లక్షల రూపాయల ను టోకరా వేశారు. వివరాలు ఇలా వున్నాయి. జిల్లాలోని దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన చాకలి రమేష్ అనే రైతు వ్యవసా యం చేసుకుంటూ పశుపోషణ చేస్తున్నాడు. ఇదే అతని కుటుంబానికి ఆధారం. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం సెల్‌ఫోన్‌లో యూ ట్యూబ్ చూ స్తూ అందులో వచ్చే రీల్స్ గమనిస్తుండగా సరిగ్గా ఇదే సమయంలో తక్కువ ధరకు పాడి గేదెలు అమ్ముతామని, వీటిని ఇంటి వద్దకే పంపుతామని ఓ పోస్టు రమేష్ సెల్‌ఫోన్‌కు వచ్చింది. ఇందులో వున్న సెల్‌ఫోన్ నంబర్‌కు రమేష్ వెంటనే ఫోన్ చేశాడు. దీనికి స్పందించిన అవతలి వ్యక్తి నమ్మ కంగా మాట్లాడి రమేష్ ఖాతాకు ఓ లింకు పంపి 8.84 లక్షల రూపాయలను పంపాలని కోరాడు. దీనిని నమ్మిన రమేష్ పలు విడతలుగా సైబర్ నేరగాళ్లు కోరినంత నగదును పంపాడు. రెండు రోజుల్లో మీకు బిందెల కొద్ది పాలు ఇచ్చే పాడి గేదెలను పంపుతామని చెప్పిన అవతలి వ్యక్తి ఫోన్ స్విచాఫ్ చేశాడు. దీనిపై ఎన్నిసార్లు ప్రయత్నించినా రమేష్‌కు సమాధానం లభించ లేదు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన రమేష్ వెంటనే దోమ కొండ పోలీసులకు దీనిపై ఫిర్యాదు చేశాడు. కాగా ఈ తరహా మోసాలపై అందరు జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైం పోలీసులు కోరుతున్నారు.




## క్రెడాయి ప్రాపర్టీ షో-2026 ఘన విజయం

### మూడు రోజుల షోలో రూ.300 కోట్ల అమ్మకాలు

### రూ.1,000 కోట్ల వ్యాపార అవకాశాల సృష్టి

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ప్రైవేట్ రియల్ ఎస్టేట్ డెవలపర్లకు అగ్రశ్రేణి సంస్థగా ఉన్న క్రెడాయి ఆధ్వర్యంలో నిర్వహించిన హైదరాబాద్ ప్రాపర్టీ షో 2026 ఘన విజయాన్ని సాధించింది. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రదర్శనలో రూ.300 కోట్ల విలువైన అమ్మకాలు నమోదు కాగా, రూ.1,000 కోట్ల మేర వ్యాపార అవకాశాలకు మార్గం ఏర్పడింది. ఈ షో బ్రాండ్ హైదరాబాద్‌పై కొనుగోలుదారుల బలమైన విశ్వాసాన్ని, నగరాన్ని శాశ్వత నివాసంగా మార్చుకోవాలనే ఆసక్తిని స్పష్టంగా ప్రతిబింబించింది. నివాస, వాణిజ్య రియల్ ఎస్టేట్ విభాగాల్లో కొనుగోలుదారుల ఉత్సాహం ఈ ప్రదర్శనలో కనిపించింది. చివరి రోజు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కంటెంట్ క్రియేటర్లతో నిర్వహించిన ప్యానెల్ చర్చలో..రాబోయే దశాబ్దంలో రియల్ ఎస్టేట్ వృద్ధిలో హైదరాబాద్ ముందంజలో నిలవనుందని, నగరంలోని బలమైన పారిశ్రామిక, వ్యాపార వాతావరణం ఈ వృద్ధికి దోహదపడనుందని, నగరంలో స్థాపితమవుతున్న గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు భారీగా ఉపాధి అవకాశాలు, గృహావసరాలను పెంచనున్నాయని, 2025-26లో 12 నుంచి 14 మిలియన్ చదరపు అడుగుల వాణిజ్య రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరగనుందని, 1000 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్‌ల నుంచి 16,000 చదరపు అడుగుల విలాసవంతమైన నివాసాల వరకు అన్ని వర్గాల వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా గృహాలు అందుబాటులో ఉన్నాయన్న అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సందర్భంగా క్రెడాయి హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్. జైదీప్‌రెడ్డి మాట్లాడుతూ..సాంస్కృతిక వైవిధ్యం, రుచికరమైన ఆహారం, విస్తృత ర్థిక అవకాశాలతో హైదరాబాద్ దేశంలోనే అత్యంత స్థిరమైన, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎదుగుతున్న రియల్ ఎస్టేట్ మార్కెట్‌గా నిలిచిందన్నారు. నగరాన్ని శాశ్వత నివాసంగా మార్చుకోవాలనే ఆకాంక్ష కొనుగోలుదారుల్లో పెరుగుతోందని చెప్పారు. అయితే గృహ కొనుగోలుదారులు తప్పనిసరిగా రెరా అనుమతులు పొందిన ప్రాజెక్టులనే ఎంచుకోవాలని స్పష్టం చేశారు. ప్రీలాంచ్ డిస్కౌంట్లకు ఆకర్షితులు కావద్దని సూచించారు. అనంతరం క్రెడాయి హైదరాబాద్ అధ్యక్షుడు (ఎలెక్ట్) బి. జగన్నాథ్‌రావు మాట్లాడుతూ... గత పదేళ్లలో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ విలువలు 5 నుంచి 6 రెట్లు పెరిగాయన్నారు. అద్భుతమైన మౌలిక వసతులు, ఉద్యోగ అవకాశాలు, నాణ్యమైన జీవనశైలి ఈ నగరాన్ని శాశ్వత నివాసానికి అనువైన గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు. ప్రాపర్టీ షోలో వచ్చిన అనేక విచారణలు సైట్ విజిట్లు, ముందస్తు చర్చల దశకు చేరుకోవడం హైదరాబాద్‌లో స్థిరపడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని సూచిస్తోందన్నారు. సంస్థ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. పని చేసే దంపతులు ఇరువురి ఆదాయంతో కలలుగన్న సొంత ఇంటిని కొనుగోలు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఆధునిక గృహ కొనుగోలుదారుల ఆకాంక్షల కనుగుణంగా హైదరాబాద్‌లో గృహాలను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ప్రతీ వర్గానికి తగిన ఇల్లు హైదరాబాద్ నగరంలో లభిస్తుందని చెప్పారు. ఈ ప్రాపర్టీ షోకు ఉపముఖ్యమంత్రితోపాటు పలువురు సీనియర్ మంత్రులు హాజరుకావడం, పట్టణాభివృద్ధి, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చలు జరగడం..రియల్ రంగంలో బ్రాండ్ హైదరాబాద్‌కు మరింత బలం చేకూర్చిందని వెల్లడించారు.

## 16న ఇంటర్ వార్షిక పరీక్షల హాల్‌టికెట్లు జారీ

### 25 నుంచి పరీక్షలు ప్రారంభం

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల హాల్ టికెట్లను ఈ నెల 16 నుంచి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన కసరత్తు ఇంటర్ బోర్డు పూర్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జనరల్, ఒకేషనల్ విద్యార్థులతోపాటు ప్రైవేటు విద్యార్థులు కలిపి సుమారు 10.06 లక్షల మంది ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజును చెల్లించారు.
అయినప్పటికీ ఇంకా వందలాది మంది విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించడానికి అనుమతితంచాలని కోరుతూ ఇంటర్ బోర్డు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఈ నెల 2 నుంచి ఇంటర్ సైన్స్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 21 వరకు ఈ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు ముగిసిన నాలుగు రోజులకి థియరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. ఇంటర్ పరీక్షల కోసం రాష్ట్రంలో సుమారు 1400కిపైగా పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది.

## పోలీసు అధికారులకు సిడిటిఐ శిక్షణ ప్రశంసనీయం

### శిక్షణ అనంతరం సమర్థవంతంగా క్రిమినల్ కేసుల విచారణ

### బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సందీప్‌కుమార్ కనోజియా




**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** క్రిమినల్ కేసుల్లో విచారణను సమర్థ వంతంగా, వేగంగా పూర్తి చేసేలా ఇండియన్ పార్లమెంట్ భద్రతా, తెలంగాణ పోలీసుల అధికారులతోపాటు శ్రీలంక పోలీసు అధికారులకు హైదరాబాద్‌లోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్ (సీడీటీఐ) మెరుగైన శిక్షణ ఇస్తోందని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (దక్షిణాది రీజియన్) సందీప్ కుమార్ కనోజియా ప్రశంసించారు. ఈ మేరకు నగరంలోని సీడీటీఐలో ఆదివారం జరిగిన పోలీసు అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శిక్షణ తర్వాత క్రిమినల్ కేసుల విచారణలో దేశానికి చెందిన పోలీసు అధికారులతోపాటు శ్రీలంక పోలీసు అధికారుల సమర్థత పెరుగుతుందని చెప్పారు. అదేవిధంగా సీడీటీఐ డైరెక్టర్ సల్మాన్ తేజ్‌పాటిల్‌కు ఈవోఎంఎస్ (ఎడ్యుకేషనల్ ఆర్గనైజేషన్స్ మేనేజ్ మెంట్ సిస్టం)ను ప్రదా నం చేశారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నుంచి ఈఎంవోఎస్ పొందినందుకు సీడీటీఐని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి బీఐఎస్ దక్షిణాది ప్రాంత కో.ఆర్డినేటింగ్ ఆఫీసర్ జీ. వెంకటనారాయణన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉన్నతాధికారులు కేకేవీ రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించగా అప్లిన్‌చారి తదితర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఫోరెన్సిక్ ల్యాబ్‌లో వివిధ కేసులకు సంబంధించిన కీలకమైన ఆధారాలు, పత్రాలు ఉన్న కార్యాలయంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్, నయీం కేసు, భూ కుంభకోణాలు, ఓటుకు నోటు కేసుతోపాటు ఇతర రాజకీయ అవినీతి కేసులకు సంబంధించిన డిజిటల్ ఆధారాలు ఈ విభాగంలోనే ఉన్నాయని సమాచారం. కేసుల విచారణ కీలక దశలో ఉన్నప్పుడే ప్రమాదం జరగడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నా యన్నారు. ప్రమాదంలో కీలకమైన ఫైళ్లు, డిజిటల్ డేటాకు నష్టం వాటిల్లలేదని అధికారులు చెపుతున్నప్పటికీ.. వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందన్నారు. గతంలో సచివాలయంలో, ఇప్పుడు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో.. ఇలా పదేపదే ప్రభుత్వ రికార్డులే తగలబడటం వెనుక ఉన్న కారణాలేమిటని జాన్‌వెస్లీ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆఫీసుల్లో రికార్డులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిన అవసరం ఉన్నదని, ఈ ప్రమాదంలో ఏయే కేసులకు సంబంధించిన ఫైళ్లు కాలిపోయాయో పూర్తి వివరాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. భద్రతలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో.. ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల్లో అగ్నిప్రమాదాలు తరచుగా సంభవిస్తున్నాయని, ప్రభుత్వ కార్యాలయాల్లో, రికార్డు రూముల్లో అగ్నిప్రమాదాల నివారణకు తక్షణమే 'సేఫ్టీ ఆడిట్'ను నిర్వ హించాలని, అగ్ని ప్రమాదాలు జరక్కుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మాస్‌రిగ్గింగ్‌కు కాంగ్రెస్ కుట్ర

### బిజెపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి తూళ్ల వీరేందర్‌గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** బ్యాలట్ ద్వారా జరిగే ఈ మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బ్యాలెట్ బాక్సులను ఎత్తుకుపోయి మాస్ రిగ్గింగ్ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తున్నట్లుగా తెలిసిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్‌గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా కాంగ్రెస్ కుట్ర చేస్తోందని, ఆ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది బీజేపీ మాత్రమేనని, అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్, బీఆర్ఎస్ నీచరాజకీయాలకు తగిన బుద్ధిచెప్పక తప్పదని హెచ్చరించారు. ముస్లింలకు 4 ప్రత్యేక రిజర్వేషన్ ఇచ్చే విధానం శాశ్వతంగా కల్పిస్తామని సీఎం రేవంత రెడ్డి అంటున్నారని, ఇది కూడా బుజ్జగింపు రాజకీయాల్లో భాగమేనని స్పష్టం చేశారు. నిజానికి కాంగ్రెస్ ముస్లింలకు రెండు రకాలుగా లబ్ధి చేకూర్చాలని చూస్తోందని, మతపరమైన రిజర్వేషన్ల ఆధారంగా 4 శాతం, బీసీల్లో ముస్లింలను చేర్చడం ద్వారా మరో 10 రిజర్వే షన్లు కలిపి ముస్లింలకు 14 రిజర్వేషన్లను తీసుకురావడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్ని స్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే రేవంత్‌రెడ్డి తన పేరును రేవంతుద్దీన్‌గా మార్చుకోవాలని హితవు పలికారు. యాదవులకు రావాల్సిన రిజర్వేషన్లను యాకుబ్‌లకు, మల్లయ్య గౌడ్‌కు రావాల్సిన రిజర్వే షన్లను మహ్మద్ అలీకి ఇస్తారా? ఇదేనా బీసీలకు కాంగ్రెస్ చేసే న్యాయం? అని నిల దీశారు. స్థానిక సర్వేల ప్రకారం, ఈసారి 1,900 వార్డుల్లో బీజేపీ గెలుస్తుందని, అదనంగా 600 వార్డుల్లో పోరాటం కొనసాగుతుందని వివరించారు.

## 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

### ప్రజలు, కార్మికులకు తెలంగాణ వామపక్షాల పిలుపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** ఈ నెల 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణలోని వామ పక్షాలు ప్రజలకు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తుందని, నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం-2025, వీబీజి రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్‌ఐసీలో 100శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతించడం వంటి ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 12న జరుప తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్ధత్తును తెలియజేశాయి. రాష్ట్రంలోని కార్మికులు, ప్రజలు ఈ సమ్మెలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చాయి. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి, యాజమాన్యాలకు లాభం చేకూర్చేలా ప్రమాదకరమైన 4 లేబర్ కోడ్‌లను కేంద్రం తీసుకొచ్చిందని, వాటి వల్ల కార్మికులు ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి సామాజిక భద్రతకు దూరమవుతారని వామపక్షాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌ల మూలంగా ఉద్యోగ భద్రత ఉండదని, ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో కార్మికుల పనిగంటలు పెంచుతూ చట్ట సవరణ జరిగిందని గుర్తు చేశారు. అలాగే వీబీజి రామ్ జీ చట్టం తెచ్చి కేంద్రం తన బాధ్యతల నుండి తప్పుకుంటుందన్నారు.
బడ్జెట్‌లో కేటాయింపుల తగ్గింపు, పని రోజులు తగిస్తోందని మండిపడానదరు. విద్యుత్ సవరణ బిల్లు వల్ల సామాన్యులకు విద్యుత్ చార్జీలు పెరుగుతాయని, స్మార్ట్ మీటర్లు, క్రాస్ సబ్సిడీ రద్దుతో రైతులు, పేదలకిచ్చే ఉచిత విద్యుత్‌తోపాటు సబ్సిడీ విద్యుత్ ప్రమాదంలో పడుతుందన్నారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తుందని, ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. విద్యుత్ ఛార్జీలతోపాటు కీలక విషయాల నిర్ణయాల్లో రాష్ట్రాల అధికారాలు తగ్గించి తన పట్టును పెంచుకుంటుందని, విత్తన సవరణ బిల్లు వల్ల విత్తనాల ధరలను నియంత్రించే అధికారం ప్రైవేటు కంపెనీల చేతుల్లోకి వెళ్లిందని, బహుళజాతి కంపెనీల పట్టు పెరుగుతుండటంతోపాటు సాగు ఖర్చు భారీగా పెరుగుతుందన్నారు. ఎల్‌ఐసిలో 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించడం వల్ల విదేశీ కంపెనీలు కేవలం లాభాపేక్షతో పని చేస్తాయని, క్లెయిమ్‌ల విషయంలో సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. ప్రజల సొమ్మును మన దేశ అభివృద్ధికి కాకుండా విదేశీ కంపెనీల లాభాలకు మళ్ళిస్తారని విమర్శించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీల సంపూర్ణ మద్ధతు తెలియజేస్తున్నట్టు వామపక్ష పార్టీల నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## బ్రిటిష్ రచయిత్రికి భారత్ పౌరసత్వం

**త్రిచూర్, ఫిబ్రవరి 8:** బ్రిటిష్ రచయిత్రి, ఫొటోగ్రాఫర్, సాంస్కృతిక పరిశోధకురాలు, పద్మశ్రీ అవార్డు గ్రహీత అయిన పెపితా సేథ్ ఇటీవల తన 84వ ఏట భారత పౌరసత్వం అందుకున్నారు. కేరళలోని త్రిస్సూర్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అర్జున్ పాండ్యన్



ఆమెకు పౌరసత్వ పత్రాలు అందజేశారు. దాంతో పెపితా సేథ్ తన జాతీయ తను అధికారి కంగా త్యజించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూనేను ఎంత గానో ప్రేమించిన ఈ భూమి నన్ను తన కుమార్తెగా స్వీకరిం చినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇక నేను వెనక్కు వెళ్లాల్సిన పని లేదు అన్నారు. కేరళ ఆచారాలు, ఉత్సవాలు, ప్రకృతి సౌందర్యాలను డాక్యుమెంటు చేస్తూ దాదాపు నాలుగు దశాబ్దాలు ఆమె ఇక్కడే గడిపారు. 1857లో బ్రిటిష్ సైనికుడిగా ఉన్న తన తాత రాసిన డైరీ చదివి 27 ఏళ్ల వయసులో పెపితా సేథ్‌ను భారత్‌కు వచ్చారు. గాంధీ చిత్రంలో నెహ్రూ పాత్ర పోషించిన నటుడు రోషన్ సేథ్‌ను పెళ్లాడారు. 2012లో భారత ప్రభుత్వం ఆమెను పద్మశ్రీతో సత్కరించింది.

## నేటి నుంచి ఇ సెట్-2026 దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి బి.ఇ, బి.టెక్, బి.ఫార్మ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈ సెట్-2026కి సంబంధించిన దరఖాస్తులను నేటి(సోమవారం) నుంచి స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 5న జారీ చేశారు. ఈ సెట్‌లో లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా, బి.ఎస్సీ (గణితం) డిగ్రీ అభ్యర్థుల నుండి బి.ఇ, బి.టెక్, బి.ఫార్మ్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఈ సెట్-2026ను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించనుంది. ఈ సెట్-2026 కన్వీనర్‌గా ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ కొనసాగుతున్నారు. నేటి(సోమవారం- ఫిబ్రవరి 9) నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఏప్రిల్ 18 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఎస్సీ, ఎస్టీ, పిహెచ్ అభ్యర్థులకు రూ. 500 ఫీజు కాగా.. ఇతరులకు రూ. 900గా నిర్ణయించారు. మే 15న ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు.

## తెలంగాణలో 2 రోజులు వైన్స్‌లు, బార్లు బంద్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 8:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలోని అన్ని మున్సిపాలిటీలలో రెండు రోజుల పాటు వైన్సులు, బార్లు బంద్ కానున్నాయి. ఈనెల 9వ తేదీ నుంచి సాయంత్రం 5 గంటల నుంచి 11 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని ఎన్నికల, ఆబ్కారీ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా 13వ తేదీ వరకు ఫలితాల నేపథ్యంలో వైన్స్, బార్లు బంద్ చేస్తున్నామని వివరించారు.



## మంత్రి కొండా సురేఖ కుమార్తె రచించిన 'రుద్ర' గ్రంథాన్ని ఆవిష్కరించిన మెగాస్టార్ చిరంజీవి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి8:** శివ పురాణంపై యువతకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుష్మిత పటేల్ రచించిన 'రుద్ర' పుస్తకాన్ని మెగాస్టార్ చిరంజీవి ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని యువతకు చేరువ చేసేలా ఇలాంటి పుస్తకం రూపొందించడం చాలా సంతోషంగా ఉందని, నేటి తరానికి ఇలాంటి విలువైన గ్రంథాలు అవసరమని మెగాస్టార్ కొనియాడారు.. భవిష్యత్తులో మరిన్ని గొప్ప రచనలు అందించాలని ఆకాంక్షి ంచారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన చిరంజీవికి కొండా సురేఖ కృతజ్ఞతలు తెలియజేశారు.

## చదరంగంలో ఉచిత శిక్షణ

**విజయవాడ ఫిబ్రవరి 8, ప్రభాతవార్త ప్రతినిధి:** ఉచిత చదరంగం శిక్షణ. ప్రతి ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుంది. మహాత్మాగాంధీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయం నందు ప్రతి ఆదివారం నిర్వహించే చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆరోజు ఉచితముగా చదరంగంపై శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమం మందు రాజీవ్ సెక్రటరీ టిబిసిఎ వారి సౌజన్యంతో షేక్ ఖాసిం ఆర్బిటర్ విద్యార్థులకు ఉచితంగా చదరంగం నేర్పించనున్నారు. గ్రంథాలయాధికారి కే రమాదేవి మాట్లాడుతూ చదరంగం ఆట మాత్రమే కాదు మేధస్సును పెంచే విద్య అని చదరంగం నేర్చుకోవడం వలన పిల్లల్లో ఆలోచన శక్తి పెరుగుతుంది. పావులు కదలికలు, వ్యూహాలు గుర్తుంచు కోవడం వల్ల మెమరీ పెరుగుతుంది. సమస్యలను పరిష్కరించే నైపుణ్యం పెరుగుతుంది ఆటలో వచ్చే సమస్యలకు పరిష్కారం వెతకడం జీవితంలో కూడా ఉపయోగం పడుతుంది. ఓర్పు సహనం పెరుగుతుంది. క్రమశిక్షణ అలవడుతుంది.

### వాహనాల నుంచి వన్యప్రాణుల ప్రాణరక్షణకు..

# అటవీప్రాంత జాతీయ, రాష్ట్ర రహదారులకు ఇరువైపులా ఫెన్సింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** వన్యప్రాణుల సంరక్షణ కోసం రాష్ట్రంలోని అటవీ ప్రాంతం గుండా వెళుతున్న జాతీయ రహదారుల వెంట ఉన్న అటవీ భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు అటవీశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. అటవీ భూములకు సమీపంలో ఉన్న జాతీయ రహదారుల వెంట ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. చిరుతపులులతోపాటు జింకలు, కోతులు, అడవి పందులు, ఎలుగు బంట్లు ఇలా పలు రకాల వన్యప్రాణులు అటవీ ప్రాంతం గుండా వెళ్లే జాతీయ రహదారులను తరచూ దాటాల్సి వస్తోంది. ఈ క్రమంలో వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని తరచూ వన్యప్రాణులు మృత్యువాత పడుతుండడమో లేదంటే గాయపడుతుండడమో జరుగుతోంది. దీంలో అడవి మధ్యలో నుంచి వెళ్లే సమీప నేషనల్ హైవేలకు ఇరువైపులా వన్యప్రాణుల రక్షణ కోసం కంచెలు ఏర్పాటు చేయాలని అటవీశాఖ నిర్ణయించింది. ఇందుకు అనుమతి కోసం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ)కు లేఖ రాసింది. వన్యప్రాణుల సంరక్షణకు రాష్ట్రంలో జాతీయ రహదారుల వెంట ఉన్న అటవీ ప్రాంతానికి ఇరువైపులా కంచె వేసేందుకు సానుకూలంగా స్పందించింది. దీంతో తొలుత మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలగుండా వెళ్లే ఎన్‌హెచ్-43కు ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు అటవీశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ హైవేలో 5 నుంచి 10 కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం ఉంది. ఆ తర్వాత రాష్ట్రంలోని అటవీ గుండా వెళ్లే జాతీయ, రాష్ట్ర రహదారులకు ఇరువైపులా కంచె వేయనున్నారు.

అవసరమైన చోట అండర్‌పాస్‌లు నిర్మాణానికి అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లతోపాటు ఇతర అటవీ ప్రాంతాల నుంచి పలు జాతీయ, రాష్ట్ర రహదారులు నిర్మితమయ్యాయి. అటవీ ప్రాంతం గుండా జాతీయరహదారులతోపాటు రైల్వేలైన్లు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అండర్‌పాస్‌లు

### వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్న అడవి జంతువులు

### అండర్‌పాస్‌లు, ఫెన్సింగ్ నిర్మాణానికి అటవీ శాఖ కసరత్తు

నిర్మించేందుకు అటవీశాఖ సిద్ధమవుతోంది. 20 మీటర్ల వెడల్పు, 3 నుంచి 4 మీటర్ల ఎత్తులో అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని అటవీశాఖ నిర్ణయించింది. దీంతో రైల్వే, రహదారులను దాటనవసరం లేకుండానే అండర్‌పాస్‌ల ద్వారా వన్యప్రా ణు లు సురక్షితంగా రాకపోకలు కొనసాగించే అవకాశం ఉంది. ఇప్పటికే ఆసిఫాబాద్ మండలం రెబ్బెన, వాంకిడి మండలం శివారు తెలంగాణ-మహారాష్ట్ర బార్డర్‌లో మరో అండర్‌పాస్ నిర్మించారు. అటవీ ప్రాంతాల్లో జంతువుల కదలికలు పెరగడం.. మేత, తాగునీరు, ఇతర అవసరాల కోసం తరచూ రహదారులపైకి వస్తుండటంతో ప్రమాదాల బారినపడుతున్నాయని అటవీ అధికారులు గుర్తించారు.

ఈ నేపథ్యంలో అటవీ ప్రాంతానికి సమీపం లో ఉన్న హైవే రోడ్లకు రెండు వైపులా కంచె వేయను న్నారు. 8 ఫీట్ల ఎత్తులో చైన్ లింక్ ఫిన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. దీనిద్వారా జంతువులు అడవి నుంచి బయటకు రావాలన్నా సాధ్యం కాదు. ఫిన్సింగ్‌ఎనిమిది ఫీట్ల ఎత్తు ఉండటంతో దూకడం కూడా సాధ్యం కాదు. దీంతో జంతువులు దాన్ని దాటుకుని రాలేక వెనుతిరిగి అండర్‌పాస్‌ల నుండి అటవీ ప్రాంతం మరోవైపుకు వెళ్తాయని అధికారులు చెబుతున్నారు. ఫెన్సింగ్, అండర్‌పాస్‌లతో రోడ్డుపై వన్యప్రాణుల సంచారం కూడా తగ్గుతుందని తద్వారా వాహనదారులు ఎలాంటి భయం లేకుండా రహదారులపై ప్రయాణం చేయవచని అటవీశాఖ చెబుతోంది.

## కాంగ్రెస్ ఎంపి భార్యకు పాక్ జాతీయులతో సంబంధాలు!

### అసోం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వశర్మ ధ్వజం

**గువాహతి, ఫిబ్రవరి 8:** అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ మధ్య రేగిన పాకిస్థాన్ సంబంధాల వివాదం ఇప్పుడు రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. గౌరవ్ గొగొయ్ భార్యకు పాక్ జాతీయులతో సంబంధాలు ఉన్నాయని, స్వయంగా ఎంపీ పాకిస్థాన్‌కు దౌత్యపరమైన గుర్తింపును ఇచ్చేలా వ్యవహరించారని సీఎం హిమంత తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అస్సాం రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సింగపూర్ పర్యటనలో ఉన్న సమయంలో తనకు ఒక ఫోటో కనిపించిందని, అది తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని హిమంత బిశ్వ శర్మ తెలిపారు. అస్సాంకు చెందిన ఎంపీ గౌరవ్ గొగొయ్, కొందరు యువకుల బృందాన్ని తీసుకుని ఢిల్లీలోని పాకిస్థాన్ రాయబార కార్యాలయానికి వెళ్లినట్లు ఆ ఫోటోలో ఉందని ఆయన పేర్కొన్నారు. అప్పట్లో అబ్దుల్ బాసిత్ పాక్ హైకమిషనర్‌గా ఉండేవారు. ఒక భారతీయ ఎంపీ ఇలా యువకులను పాక్ ఎంబసీకి తీసుకువెళ్లడం





అంటే ఆ దేశానికి ఒకరకమైన చట్టబద్ధతను, గుర్తింపును కల్పించడమే అవుతుందని సీఎం మండిపడ్డారు. మొదట ఆ ఫోటో ఫోటోషాప్‌లో చేసినట్లుగా తాను భావించానని, కానీ కాంగ్రెస్ నేతలు దానిని సమర్థించడం చూశాక అది నిజమని నిర్ధారణ అయ్యిందని ఆయన చెప్పుకొచ్చారు. గౌరవ్ గొగోయ్ భార్య ఎలిజబెత్ కోల్‌బర్న్ గొగొయ్ గతాన్ని కూడా సీఎం హిమంత ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎలిజబెత్ 2011 మార్చి 18 నుంచి 2012 మార్చి 17 వరకు పాకిస్థాన్‌లో పని చేశారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా ఆమె కుటుంబానికి పాక్ జాతీయుడైన అలీ తౌకీర్ షేక్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ఒక బాధ్యతాయుతమైన పదవి లో ఉన్న వ్యక్తి కుటుంబానికి పొరుగు దేశంతో ఇటువంటి సంబంధాలు ఉండటం దేశ భద్రత దృష్ట్యా ఆలోచించాల్సిన విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వివాదాన్ని దేశభక్తితో ముడిపెడుతూ సీఎం హిమంత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. కార్గిల్ యుద్ధం నేపథ్యంలో ఈ ఫోటోను చూడండి. అస్సాంకు చెందిన కెప్టెన్ జింటూ గొగొయ్ మాతృభూమి కోసం తన ప్రాణాలను అర్పించారు. ఎంతోమంది వీరులు అమరులు అయ్యారు. అలాంటి త్యాగాలు జరిగిన దేశంలో ఒక ఎంపీ పాకిస్థాన్‌కు మద్దతుగా నిలవడం అసాధారణమైన విషయమని ఆయన వ్యాఖ్యానించారు. దేశమంతా ప్రధాన మంత్రి వెనుక నిలబడి పాకిస్థాన్ కుతంత్రాలను ఎండగడుతుంటే కాంగ్రెస్ నేతలు మాత్రం ఇలాంటి ప్రతినిధి బృందాలతో పాక్ రాయబార కార్యాలయాలను సందర్శించడం శోచనీయమని హిమంత బిశ్వ శర్మ విమర్శించారు.

## 4 రోజుల్లో రూ.10.71 కోట్ల మేడారం ఆదాయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి8:** సమ్మక్క-సారక్క జాతర-2026 సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల హుండీల లెక్కింపు నాల్గో రోజు కూడా హనుమకొండలోని టిటిడి కళ్యాణ మండపంలో కొనసాగింది. దేవాదాయ శాఖ అధికారులు, సేవా సమితి సభ్యుల పర్యవేక్షణలో లెక్కింపు ప్రక్రియ సాగుతోంది. జాతరకు సంబంధించి మొత్తం 828 హుండీలు ఏర్పాటు చేయగా, అందులో 780 ఇనుప హుండీలు, 45 వస్త్ర హుండీలు, 3 బియ్యం హుండీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నాల్గో రోజు భాగంగా 200 హుండీ లను తెరిచి లెక్కించగా, వాటి ద్వారా రూ.2,64,75,757/- ఆదాయం లభించినట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 5న 125 హుండీల లెక్కింపులో రూ.2,49,65,000/, ఫిబ్రవరి 6న 160 హుండీల లెక్కింపులో ..రూ. 3,54,25,200/..తో పాటు విదేశీ కరెన్సీ మార్పిడి ద్వారా రూ.63,436/-,ఫిబ్రవరి 7న 140 హుండీల లెక్కింపులో ..రూ. 2,01,21,440/..తో పాటు విదేశీ కరెన్సీ మార్పిడి ద్వారా రూ.71,283/ ఆదాయం లభించింది.నాలుగు రోజుల వ్యవధిలో మొత్తం 625 హుండీలను లెక్కించగా, కలిపి రూ.10,71,22,116/ ఆదాయం సమకూరినట్లు అధికారులు స్పష్టం చేశారు.నాల్గో రోజు లెక్కించిన నగదులో నుంచి రూ.2,64,75,757/ మొత్తాన్ని పర్యవేక్షణాధికారుల సమక్షంలో బ్యాంకు అధికారు లకు అప్పగించినట్లు తెలిపారు. బంగారం, వెండి కానుకలను వేర్వేరుగా ఇనుప హుండీలలో భద్రపరచి తాళాలు వేసి ఉంచినట్లు పేర్కొన్నారు.

# సొంతగడ్డపై శ్రీలంక బోణీ

### 20 పరుగులతో శ్రీలంకజట్టుపై ఐర్లాండ్ ఓటమి

### ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా కమిందు మెండిస్

**కొలంబో, ఫిబ్రవరి 8:** టి20 ప్రపంచకప్‌లో శ్రీలంక అదిరే బోణీ కొట్టింది. స్వదేశంలో తొలి లీగ్ మ్యాచ్‌లో ఐర్లాండ్‌ను చిత్తుగా ఓడించింది. కుశాల్ పెరీరా56 నాటౌట్ , కమిందు మెండిస్44 మెరుపులతో భారీ స్కోర్ చేసిన లంకేయులు ప్రత్యర్థిని 143కే ఆలౌట్ చేసారు. హ్యారీ టెక్టర్40పోరాడినా సహచరుల నుంచి మద్దతు రాలేదు. లంక బౌలర్లలో తీక్షణ(3-23), పతిరణ(3-25)లు మూడేసి వికెట్లతో చెలరేగగా లంక 20 పరుగుల తేడాతో గెలిచి రెండు పాయింట్లు సొంతం చేసుకుంది. లీగ్ దశల తొలి మ్యాచ్‌లో శ్రీలంక అలవకోగా గెలుపొందింది. ప్రేమదాస స్టేడియంలో కుశాల్ పెరీరా(56 నాటౌట్), కమిందు మెండిస్(44)ల పోరాటంతో భారీ స్కోర్ చేసిన లంక అనంతరం ప్రత్యర్థిని పడగొట్టింది. 163 పరుగుల ఛేదనలో ఐర్లాండ్‌కు షాకిస్తూ పవర్ ప్లే లోనే ఓపెనర్ పాల్ స్టెర్లింగ్(6)ను తీక్షణ(3-23)బౌల్డ్ చేసి ఒత్తిడిలో పడేశాడు. అనంతరం హ్యారీ టెక్టర్(40), లొర్కాన్ టక్నర్(21)లు దూకుడుగా ఆడుతూ స్కోర్ బోర్డును నడిపించారు. గాయంతో ఇబ్బంది పడుతూనే బౌలింగ్ చేసిన హసరంగ క్రీజులో కుదురుకున్న టెక్టర్‌ను బౌల్డ్ చేసి కీలక బ్రేకిచ్చాడు. అనంతరం



తీక్షణ విజృంభణతో వెంటవెంటనే వికెట్లు పడ్డాయి. చివరి ఆరు బంతుల్లో 27 రన్స్ అవసరమవ్వగా పథిరన(3-25) రెండు వికెట్లు తీయడంతో 143కే ఐర్లాండ్ ఆలౌటయ్యింది. టాపార్డర్ విఫలమైనా శ్రీలంకను మిడిలార్డర్ బ్యాటర్లు ఆదుకున్నారు. కుశాల్ పెరీరా(56 నాటౌట్), కమిందు మెండిస్(44) రాణిం చారు. ఐర్లాండ్ ఫీల్డర్లు క్యాచ్‌లు నేలపాలు చేయడం కూడా లంక ద్వయానికి కలిసొచ్చింది. డెత్ ఓవర్లలో మరింత చెలరేగాలనుకున్న మెం డిస్, దసున్ శనక(0) గోల్డెన్ డక్‌గా వెంట వెంటనే ఔటయ్యారు. ఆఖరి ఓవర్లో బౌండరీతో పెరీరా హాఫ్ సెంచరీ సాధించగా ప్రత్యర్థికి శ్రీలంకజట్టు 164 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే లక్ష్యఛేదనలో పసికూన తడబడి వెనకబడింది. 20 పరుగులతేడాతో గెలిచి శ్రీలంక రెండుపాయింట్లు సాధించింది. కాగా ఈమ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా కమిందు మెండిస్ ఎంపికయ్యాడు. 19 బంతుల్లోనే 44 పరుగులుచేసి మెప్పించాడు.

# అతిపెద్ద ఉద్యాన హబ్‌గా 'సీమ'

### రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల ఘనత టిడిపిదే

### నదుల అనుసంధానంతో సీమను సస్యశ్యామలం చేస్తాం

### భవిష్యత్‌లో విద్యుత్‌ఛార్జీలు పెరగవు

### ఎమ్మిగనూరు టెక్స్టైల్ పార్కుకు కేంద్రం ఆమోదం: ఎపి సిఎం చంద్రబాబు

**విజయవాడ ఫిబ్రవరి 8, ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసమీలో సాగునీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేసిన ఘనత టీడీపీదేనని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు.సీమలో అత్యధిక విస్తీర్ణంలో ఉద్యాన పంటలను అభివృద్ధి చేసారు.రాయలసీమ ఇప్పుడు గుర్తింపదగిన అతి పెద్ద హార్టికల్చర్ హబ్ ఉందన్నారు.'ఎక్స్' వేదిక రాయలసీమ అభివృద్ధి తీసుకున్న చర్యలు,కార్యచరణను వివరిం చారు.హంద్రినీవా, గాలేరు-నగరి -తెలుగుగంగ సహా అనేక ప్రాజె క్టులు రావడానికి తెలుగుదేశం పార్టీ చూపిన చొరవే కారణం, తెలుగుగంగతో సీమ సస్యశ్యామలం చేయడంతో పాటు చెన్నై దాహార్తి తీరుస్తోంది. నదుల అనుసంధానం చేసి సీమను సస్యశ్యామలం చేస్తాము.



అనంతపురం జిల్లాలో నీటి సంరక్షణకు మేము తీసుకున్న చర్యలతో ప్రధాని మోదీ మన్ కీ బాత్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. సీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నాం. దేశంలో ఎక్కువ పండ్లు పండేది రాయలసీమలోనే. రాష్ట్రంలో 400లక్షల మెట్రిక్ టన్నుల పండ్లు ఉత్పత్తి అయితే అం దులో 220 లక్షల మెట్రిక్ టన్నులు సీమ నుంచే వస్తున్నాయి. రాబోయే రోజుల్లో 500 లక్షల మెట్రిక్ టన్నుల పండ్లు ఉత్పత్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వంలో 8 సార్లు చార్జీలు పెంచారు. రూ.32 వేల కోట్ల మేర విద్యుత్ భారాన్ని మోపారు. రూ.1.20 లక్షల కోట్ల అప్పు చేశారు. కూటమి ప్రభుత్వం భవిష్యత్‌లో కరెంటు చార్జీలు పెంచబోదని హామీ ఇస్తున్నాఉ. నేనూ రాయలసీమలోనే పుట్టాను. ఎన్టీఆర్ కూడా సీమముద్దు బిడ్డే. మూడేళ్లలో కడప స్టీల్ ప్లాంట్ పనులు పూర్తి చేసే బాధ్యత నాది. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులు పెడుతున్నాం. సీమలో స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 2014-19 మధ్య సాగునీటి రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చు చేశాం. గత పాలకులు పోలవరం ప్రాజెక్టు పాలిట శనిలా దాపురించారు. అసమర్థత, నిర్లక్ష్యంతో రూ.440 కోట్ల విలువైన డయాఫ్రాం వాల్ దెబ్బతింది. దీని కోసం అదనంగా రూ.1000 కోట్లు ఖర్చయింది. సమయం కూడా వృథా అయ్యింది. 2027 లో పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తాం. పట్టి సీమ ద్వారా కృష్ణాడెల్టాకు గోదావరి నీరిచ్చి, శ్రీశైలం నీటిని సీమకు మళ్లించాం. పదేళ్లుగా సీమలో కరువు లేకపోవటానికి మా దురదృష్టమే కారుణం నీరుంది కాబట్టే కియాలాంటి పరిశ్ర మలు వచ్చాయి. మచ్చుమర్రి, పోతిరెడ్డి పాడు ప్రాజెక్టులు ఉం చుకుని రాయలసీమ లిఫ్ట్ పేరుతో నాటకాలు ఆడారు. కర్నూలు జిల్లాకు నీరిచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. రాజో లిబండ, గురు రాఘవేంద్ర డ్యామ్ నుంచి వచ్చే నీరు కర్నూలు జిల్లా ఉపయోగించుకుంటే నీటిసమస్య చాలా వరకూ తీరుతుంది. ఎమ్మి గనూరులో టెక్స్టైల్ పార్క్‌ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది వస్తే 2 వేల మంది చేనేతలకు ఉపాధిభిస్తుంది. గాజుల దిన్నె పూర్తి చేస్తాం. రూ.138 కోట్లతో ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం అంగీకరించింది. ఎమ్మిగనూరు, ఆదోని మీదుగా రైల్వే లైన్లపై దృష్టి పెడతాం. సీమలో 120 ప్రాజెక్టులకు అనుమతి ఇస్తే గత పాలకులు అన్నిటినీ రద్దు చేశారని ముఖ్యమంత్రి తెలిపారు.

## రూ.9 వేల కోట్ల రుణానికి ఇండెంట్

### 10న సెక్యూరిటీ బాండ్ల వేలంలో సేకరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చివరి క్వార్టర్‌లో పెద్ద ఎత్తున మరో రూ.9 వేల కోట్ల రుణాన్ని సేకరించాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. దీనికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ పెట్టింది. ఈ మొత్తాన్ని ఈ నెల 10న రిజర్వ్ బ్యాంక్ నిర్వహించే ఈవేలంలో సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా ఈ అప్పు ప్రభుత్వ ఖజానాలో జమ అవుతుంది. బహిరంగ మార్కెట్‌లో సేకరించనున్నట్లు వెల్లడించింది. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను రిజర్వ్ బ్యాంక్ నేతృత్వంలో జరిగే బహిరంగ వేలంలో సమీకరించనున్నట్లు ఇండెంట్‌లో పేర్కొంది. ఆర్థిక శాఖ పెట్టిన ఈ ఇండెంట్‌లో రూ.9వేల కోట్ల రుణంలో 13 ఏళ్ల కాల పరిమితితో చెల్లించేలా రూ.2వేల కోట్లు, 16 ఏళ్ల కాల పరిమితితో రూ.2వేల కోట్లు, 21 ఏళ్ల కాల పరిమితితో రూ.2,500 కోట్లు, 27 ఏళ్ల కాల పరిమితితో చెల్లించే ప్రాతిపదికన రూ.2,500 కోట్ల రుణాన్ని తీసుకుంటామని వెల్లడించింది. కాగా గత నెలాఖరున రాష్ట్ర ప్రభుత్వం రూ.1,500 కోట్ల రూపాయల మేర రుణాన్ని సేకరించింది. రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన బహిరంగ మార్కెట్లో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను వేలం వేయడం ద్వారా ఈ మొత్తాన్ని సమీకరించింది. ఇందులో భాగంగా 18 ఏళ్ల కాలపరిమితితో 7.64 శాతం వార్షిక వడ్డీ రేటుతో రూ.1,000 కోట్లు, 22 ఏళ్ల కాలపరిమితితో 7.58 శాతం వార్షిక వడ్డీతో రూ.500 కోట్ల రూపాయలు చొప్పున ఈ అప్పును తీసుకుంది. మరల తాజాగా రూ.9 వేల కోట్లను తీసుకుంటోంది.

# వేగవంతంగా పంటల డిజిటలైజేషన్!

### 45 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఎఇఒలకు వ్యవసాయశాఖ ఆదేశాలు

### సర్వే పూర్తయితే వివిధ పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులపై ప్రభుత్వాలకు స్పష్టత

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సాగుభూమి లెక్కను పక్కాగా తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా శాటిలైట్ పంటల ఆధారిత విజయవంతంగా సర్వేను పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో కీలక సర్వేకు పచ్చజెండా ఊపింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ రబీ సీజన్ నుంచి రాష్ట్రంలో వందశాతం పంటల డిజిటల్ సర్వే ప్రక్రియను వ్యవసాయశాఖ వేగవంతం చేసింది. శాటిలైట్ ఆధారిత పంటల సర్వే కంటే ముందుగానే ఈ సర్వేను ప్రారంభించినా నత్తనడకన సాగుతుండడంతో రానున్న 45 రోజుల్లో సర్వేను పూర్తి చేయాలని కేంద్రం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వచ్చే మార్చి చివరి నాటికి వందశాతం పంటల డిజిటల్ సర్వేను పూర్తి చేయాలని వ్యవసాయశాఖను ఆదేశించింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలోని ఏఈవోలకు మార్గదర్శకాలు కూడా జారీ అయ్యాయి. రాష్ట్రంలో 10,621 గ్రామాలు ఉండగా, వాటిలో 2,342 ఏఈవోలు ఉన్నారు. వారికి తోడుగా ప్రైవేట్ సర్వేయర్లు కూడా పొలాలకు వెళ్లి 1.50 కోట్ల ఎకరాలను సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అధికారులు తప్పనిసరిగా సంబంధిత సర్వే నంబర్‌కి వెళ్లి అక్కడ సాగులో ఉన్న పంట ఫొటోలు తీయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ కష్టమైన పని కావడంతో కేంద్ర ప్రభుత్వం సర్వేకు అవసరమైనంత మంది స్థానిక యువకులు, రైతులు, ప్రైవేటు సర్వేయర్లను నియమించుకుని పూర్తి చేయాలని నిర్దేశించింది.

దీంతో అందుబాటులో ఉన్న 2,342 మంది ఏఈవోలతో పాటు మిగతా 8,279 మంది ప్రైవేటు సర్వేయర్లను నియమించి సాగు భూముల సర్వే చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు కోసం విడుదల చేసిన రూ. 15.21 కోట్ల నిధుల్లో వర్షాకాలం సీజన్‌కు రూ. 2.93 కోట్లు ఖర్చు చేయగా మిగిలిన రూ. 12.28 కోట్లను తాజాగా వినియోగించ నుంది. రాష్ట్రంలో 10,621 గ్రామాలు ఉండగా ప్రభుత్వం జియో సర్వే కోసం 9,795 గ్రామాలకు సిపారసు చేసింది. తెలంగాణ వ్యాప్తంగా 70 లక్షల మంది పట్టాదారు పాసు బుక్ కలిగిన రైతులు ఉండగా సర్వే నెంబర్లు 194.69 లక్షలు ఉన్నాయి. వాటిలో 174.36 లక్షల నెంబర్ల మాత్రమే పంట సర్వే చేసేందుకు అనువుగా ఉన్నాయి. మిగతా 20 లక్షల సర్వే నంబర్ల భూములకు సంబంధించిన మ్యాపులు ఇప్పటివరకు లేకపోవడం గమనార్హం. అయితే వందశాతం పంటల డిజిటల్ సర్వేకు రైతు భరోసా పంపిణీకి ఎలాంటి సంబంధం లేదని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ సర్వే పూర్తయితే ఆహార భద్రత, ఎగుమతులు, దిగుమతులు, వాణిజ్యం, పంటల ఇన్సూరెన్స్, కొనుగోలు తదితర ప్రణాళికలకు రైతులు సాగు చేస్తున్న సాగు విస్తీర్ణం, పంటల దిగుబడుల ఖచ్చితమైన అంచనా వివరాలు ప్రభుత్వాలకు కీలకంగా ఉపయోగపడనున్నాయి. అదే సమయంలో పంటల సాగు సర్వేను పకడ్బందీగా చేసి రైతులకు పంట రుణాలు, ఫసల్ బీమా, పంటల కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశంగా తెలుస్తోంది.



విలేకరులతో మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకురాలు ఆరణికవిత, తదితరులు

## కల్తీ నెయ్యి కుంభకోణంపై కూటమి సర్కార్ సీరియస్

**- హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వైఎస్సార్సీ**

**- జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆరణి కవిత**

**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** వైకాపా హయాంలో తిరుమల శ్రీవారి లడ్డుప్రసాదం తయారీలో జరిగిన నెయ్యి కుంభకోణం కేవలం అవినీతి మాత్రమే కాదని, కోట్లాదిమంది హిందువుల నమ్మకంపై జరిగిన దాడి అని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆరణి కవిత పేర్కొన్నారు. ఆదివారం చిత్తూరులో తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం విషయంలో జరిగిన మహా అపచారంపై జనసేన పార్టీ నాయకులతో కలసి ఘాటుగా స్పందించారు. వైసిపి పాలనలో లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేస్తూ జరిగిన 60లక్షల కిలోల కల్తీ నెయ్యి కుంభకోణం చరిత్రలో ఒక చీకటి అధ్యాయమని, కనీసం డైరీ వ్యాపారం లేని, పాలు సేకరించని కంపెనీలకు కాంట్రాక్టులు కట్టబెట్టి కెమికల్స్‌తో కూడిన ద్రవ్యాన్ని నెయ్యిగా సరఫరా చేయడం దైవద్రోహమన్నారు. ఈ మహా పాపాన్ని వెలుగులోకి తెచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై ఎదురుదాడి చేయడం వైసిపి నేతల దిగజారుడుతనానికి నిదర్శమని, గత పాలకులు చేసిన అపచారానికి ప్రాయశ్చితంగా ఆయన దీక్ష చేస్తే దానిని కూడా అవహేళన చేయడం వారి అహంకారానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. మోనోగ్లిజరైడ్, పామాయిల్ కొనుగోలు చేసిన వివరాలు సిట్, ల్యాబ్ రిపోర్టుల ద్వారా స్పష్టంగా బయటపడ్డాయని, ఆధారాలతో సహా బయటపడినా వైసిపి నేతలు ఇంకా బుకాయించడం సిగ్గుచేటని, కూటమి ప్రభుత్వంలో నిజాలు నిగ్గుతేలుతున్నాయన్నారు.

## జగన్ పర్యటనలో ఉల్లంఘనలపై కేసు నమోదు

**విజయవాడ ఫిబ్రవరి 08 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాపా అధినేత జగన్ పర్యటన సందర్భంగా అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించినందుకు ఎస్సై రవివర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ మంత్రి జోగిరమేష్ తదితరులపై ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులు పలు సెక్షన్లనను చేర్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో బయలుదేరి జోగి రమేష్ ఇంటికి వెళ్లి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. జగన్ పర్యటన కారణంగా గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పలు చోట్ల వైకాపా కార్యకర్తలు రెచ్చగొట్టే చేష్టలు చేశారు. జనసమీకరణ చేయొద్దని జోగి రమేష్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చినా బేఖాతరు చేశారు. దీంతో బీఎన్ఎస్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. జగన్ పర్యటన సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన అఖిల్ అనే యువకుడిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. అతను చేతిని కోసుకుని జగన్ ఫ్లెక్సీకి రక్త తిలకం దిద్దాడు. అందరినీ భయభ్రాంతులకు గురి చేసినందుకు, చట్టవిరుద్ధంగా గుమిగూడినందుకు, న్యూసెన్స్ తదితర కారణాలతో కేసు నమోదు చేశారు. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లుకు చెందిన వైకాపా నాయకుడు రాంబాబు, ఇబ్రహీంపట్నం ర్యాలీకి వచ్చి మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంకా పోస్టు మార్టం నివేదిక రాకపోవడంతో అనుమానాస్పద మృతి కింద కేసు పెట్టారు. నివేదిక వచ్చిన తర్వాత సెక్షన్లు మార్చే అవకాశం ఉంది.

## విజయవాడ బైపాస్‌లో హాయ్‌ల్యాండ్ వరకు వాహనాలకు అనుమతి

**విజయవాడ ఫిబ్రవరి 08 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈ నెల పదో తేదీ సాయంత్రం నుంచి విజయవాడ బైపాస్‌లో గొల్లపూడి వైపు నుంచి వచ్చే కార్లు, బైక్‌లను హాయ్‌ల్యాండ్ రోడ్డు వరకు అనుమతిస్తారు. ప్రస్తుతం కృష్ణా నది, సీడ్ యాక్సెస్ రోడ్ దాటిన తర్వాత బైపాస్ నుంచి పక్కకు దిగి మందడం వెళ్లే రోడ్‌లోకి చేరుకొని సచివాలయం, హైకోర్టువైపు వెళ్లేందుకు వాహనాలను అనుమతిస్తున్నారు. ఇప్పుడు గొల్లపూడి వైపు నుంచి గుంటూరు వైపు వెళ్లాలనుకునే వాహనాలను కూడా హాయ్‌ల్యాండ్ రోడ్ వరకు అనుమతించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బైపాస్‌లో టోల్‌ప్లాజా దాటాక ముందుకు వెళ్లేందుకు అవకాశం లేదు. పదో తేదీ సాయంత్రం నుంచి అందుకు అనుమతించి హాయ్‌ల్యాండ్ రోడ్ వరకు వెళ్లేందుకు అవకాశం కల్పిస్తారు. హాయ్‌ల్యాండ్ రోడ్డులోకి దిగి 200 మీటర్లు ప్రయాణించి చెన్నై కోల్‌కతా సర్వీసు రోడ్డు నుంచి వెళ్లొచ్చు. తొలుత కార్లు, బైకులను మాత్రమే ఇలా అనుమతిస్తారు. ఈ నెల 20 నుంచి గొల్లపూడి నుంచి వచ్చే లారీలను సైతం గుంటూరువైపు అనుమతించనున్నారు.


హాయ్‌ల్యాండ్ రోడ్డు వద్ద కాకుండా నేరుగా చెన్నై-కోల్‌కతా హైవేలోకి దిగి, విజయవాడ వైపు కొంత దూరం వెళ్లి, సర్వీసు రోడ్డులోకి చేరుకుని , ఎన్ఆర్ఐ ఆస్పత్రి కూడలి వద్ద అండర్‌పాస్ నుంచి యూటర్న్ తీసుకొని గుంటూరు వైపు సర్వీసు రోడ్డులో కొంత దూరం వెళ్లి, అక్కడి నుంచి ప్రధాన హైవేలోకి చేరుకోవచ్చు.

# తిరుమల పవిత్రతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- కమలదళం అడ్డుకోవడంతోనే గత వైసిపి జిఒ వెనక్కి**

**- తిరుపతి సభలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్**

**తిరుపతి,ఫిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** కోట్లాదిమంది భక్తుల ఆరాధ్యదైవం...ఏడుకొండల వేంకటేశ్వరస్వామి నిలయమైన తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఆ దిశగా పవిత్రతకే ప్రాధాన్యతనిస్తూ కట్టుబడి ఉందని బిజెపి రాష్ట్ర అద్యక్షుడు పివిఎన్ మాధవ్ తెలిపారు. తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యిఘటనలో వైసిపి నేతలు వ్యవహరిస్తున్న తీరు పై ఆయన మండిపడ్డారు. తిరుమల పవిత్రతకు గత వైసిపి హయాంలో ఓ జిఒ తీసుకువచ్చారని, దాన్ని కమలదళం అడ్డుకోవడంతో వెనక్కుతీసుకున్నారని మాధవ్ గుర్తుచేశారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి అపవిత్రం జరిగితే బిజెపి ,కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. తిరుపతిజిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన ఆయన బాధ్యతలు చేపట్టి ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఆదివారం ఉదయం తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో "బిజెపి కమలవికాసం "సదస్సు నిర్వహించారు. ప్రత్యేక అతిధులుగా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, విశిష్టఅతిధులుగా బిజెపి రాష్ట్రకమిటీ నాయకులు దయాకర్ రెడ్డి, నాగోతు రమేశ్‌నాయుడు, కోలా ఆనంద్, అశోక్‌రాజు, పనతుల సురేశ్, నిషిధరాజు, భానుప్రకాశ్‌రెడ్డి, జల్లిమధుసూదన్, వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. కూటమిలో బిజెపి లేకపోతే రాష్ట్రంలో టిడిపి ,జనసేనలేదు:ఆదినారాయణ కూటమిలో బిజెపి కలవకుంటే రాష్ట్రంలో టిడిపి, జనసేన లేదని బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కూటమిలో బిజెపినే ప్రధానమని, ఆ తరువాతే టిడిపి, జనసేన పార్టీ వాళ్ళుంటారని ఘాటుగా స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి నాయకులకు అవకాశం ఇవ్వాలని ఆయన సూచించారు. ఆదివారం తిరుపతిలో జరిగిన "బిజెపి కమలవికాసం "సదస్సు ఆయన పాల్గొని రాష్ట్ర చీఫ్ మాధవ్ ముందే మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఇంకా కమ్మగానే ఉందని, కూటమిలో అన్ని పార్టీలకు తగిన గుర్తింపు నివ్వాలని ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో పదవులు పందేరంపై



ఆయన చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్రరాజకీయాల్లో దుమారం రేపుతూన్నాయి. 1983లో అప్పట్లో ఎన్టీఆర్ సిఎంగా ఉన్నపుడు గజ్జల మల్లారెడ్డి ప్రభుత్వ పాలన కమ్మగా ఉందని చెప్పాడని గుర్తుచేశారు. ఇప్పుడు రాష్ట్రంలో పరిస్థితి అలానే ఉందని ,అందరికీ అర్ధమై ఉంటుందని ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో చర్చకు దారితీశాయి. పార్టీకోసం ,ప్రభుత్వం కోసం గట్టిగా పనిచేసిన వారిని గుర్తించి కష్టపడిన వారికి పదవులు ఇవ్వాలని, అన్నికులాల వారికి న్యాయం చేయాలని ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఆయన వ్యాఖ్యలపై ఎలా స్పందిస్తుందో చూడాల్సిందే.

# కులం పుట్టుకకు గాని అవకాశం కోసం కాదు: జనసేన ఎమ్మెల్సీ కె.నాగబాబు

**విజయవాడ.ఫిబ్రవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** కులం అనేది పుట్టక పరంగా చెప్పుకుంటాం తప్పించి. అవకాశాల కోసం కాదని జనసేన పార్టీ ఎమ్మెల్సీ కె.నాగబాబు స్పష్టం చేశారు. ఎలా బతకాలో మనం నిర్ణయించుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో ప్రాక్టికల్‌గా ఉంటూ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మాట్లాడాలని అభిప్రాయపడ్డారు. ఆదివారం తన ఎక్స్ ఖాతా వేదికగా వీడియో విడుదల చేసిన ఎమ్మెల్సీ నాగబాబు.. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు ఆ పార్టీ నేతలకు పలు ప్రశ్నలు సంధించారు. పెద్ద సంఖ్యలో ఉన్న కులాలు.. చిన్న సంఖ్యలో ఉన్న కులాల వారిని ప్రోత్సహించాలని, అప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని పవన్ కళ్యాణ్ చెప్పారు. రాష్ట్రంలో అధిక శాతం ఉన్న కాపులు పెద్దన్న పాత్ర పోషించాలని పవన్ ప్రకటించారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో నలభై శాతం కాపులు ఉన్నప్పటికీ.. బీసీ సోదరుడు కొణతాల రామకృష్ణకు టికెట్ ఇచ్చారు. కాపులు, బీసీలు కలిసి పని చేసి రామకృష్ణను గెలిపించుకున్నారు. విశాఖపట్నం సౌత్‌లో కూడా కుల సమీకరణలు పక్కన పెట్టి బీసీ యాదవ సోదరుడు వంశీ కృష్ణకి సీటు ఇచ్చారు. కులాలను పక్కన పెట్టి.. అందరూ సమానమనే భావనతో పవన్ ముందుకు సాగుతున్నారు. వైసీపీ నాయకులకు ముని శాపం ఉంది.. వారు నిజాలు చెబితే.. తల వెయ్యి ముక్కలయ్యి చస్తారు. నోరు విప్పితే చాలు.. అబద్దాలు.. బూతులు.. ఇవే వారికి తెలుసు. చిన్న అవకాశం వచ్చినా కులాలను రెచ్చగొట్టి.. కుల రాజకీయాలు చేయడం వారికి వెన్నతో పెట్టిన విద్య. ముఖ్యమంత్రిని బండ బూతులు తిడితే జైల్లో పెట్టక ముద్దు పెట్టుకుంటారా?. ఇలాంటి వారికి కులాన్ని ఆపాదించి కుల చిచ్చు పెట్టేవారిని కూడా అరెస్టు చేస్తే దరిద్రం వదలిపోతుంది. కాపులు



తాగుబోతులు, తిరుగుబోతులు అని పిచ్చిపిచ్చిగా మాట్లాడే అంబటి రాంబాబు లాంటి వాడిని రంగా బొమ్మ పక్కన రాంబాబు బొమ్మ పెట్టిన వైసీపీ నేతలను నేను కొన్ని ప్రశ్నలు అడుగుతున్నా..? 2024 ఎన్నికలలో గ్రేటర్ రాయలసీమ ప్రాంతాలలో కాపు, బలిజలు 20 శాతం వరకు ఉన్నా ఒక్క ఎంపీ సీటు ఇవ్వలేదు. 74 అసెంబ్లీ సీట్లలో ఒకే ఒక్క సీటు మాత్రమే కాపులకు ఇచ్చారు.

# అంతర్జాతీయ నాటకోత్సవాలతో గుంటూరుకు ప్రపంచ ఖ్యాతి

తెలుగు నాటక రంగాన్ని విదేశాలకు విస్తరిస్తాం: అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

ఉత్సాహంగా సాగుతున్న 25వ భారత్ రంగ్ మహోత్సవ్

**చిలకలూరిపేట, గుంటూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** గుంటూరు నగరంలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం అంతర్జాతీయ నాటక సౌరభాలతో పులకించిపోతోంది. 25వ అంతర్జాతీయ భారత్ రంగ్ నాటకోత్సవాల్లో భాగంగా శనివారం రెండో రోజు నిర్వహించిన కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా ఏపీ తెలుగు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీనియర్ కళాకారులు కారుమూరి సీతారామయ్య, విద్యారంగం ప్రముఖులు పెరుమాళ్ల హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు ప్రసంగించారు. కళాకారులను ప్రోత్సహిస్తేనే సమాజ వికాసంఈ సందర్భంగా గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. వైద్యానికి నిధులు తగ్గించినా పర్వాలేదు కానీ, మానసిక వికాసాన్ని ఇచ్చే వినోదానికి, కళలకు నిధులు పెంచాలని ప్రభుత్వాన్ని కోరిన వ్యక్తిని తానే అన్నారు. తెలుగు నాటక రంగానికి సురేష్‌బాబు అంతర్జాతీయ గుర్తింపు తీసుకు రావడం గర్వ కారణ మన్నారు. మనదేశంలో విదేశీ యులు నాట కలను ప్రద ర్శన రావడంతో పాటు అదే విధం గా తెలుగు నాట కం కూడా విదేశాలలో ప్రదర్శించే స్థాయి రావాలని ఆకాంక్షించారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ద్వారా రాష్ట్రానికి ఓ చాప్టర్ తీసుకురావాలన్న





సురేష్‌బాబు సంకల్పాన్ని అందరూ అభినందించ విషయం అన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి దృష్టికి

నాటకరంగ సమస్యలను తీసుకెళ్లి, అకాడమీ బలోపేతానికి రూ.3 కోట్ల నిధుల అనుమతి సాధించామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు కళలపై మక్కువ పెంచుకుంటే ఒత్తిడి లేని మేధస్సు వికసిస్తుందని ఆయన హితవు పలికారు.

## శ్రీగిరిలో వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

**శ్రీశైలం ప్రాజెక్టు, ఫిబ్రవరి08, ప్రభాతవార్త** శ్రీశైలం మహపుణ్య క్షేత్రంలో నవాహ్నిక దీక్షతో పద కొండు రోజుల పాటు జరగబోయే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుండి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణములోని ఉత్సవ ప్రారంభ కార్యక్రమాలు ఆగమశాస్త్రాను సారం జరిపించబడ్డాయి.



చండీశ్వరునికి పూజలు చేస్తున్న ఇఒ

ఈప్రారం భ పూజలో ధర్మకర్తల మండలి ఆధ్యక్షులు పి.రమేష్‌నాయుడు,శ్రీశైలం దేవస్థానం ఈఓ యం.శ్రీనివాసరావు దంపతులు,ధర్మకర్తల మండలి సభ్యులు,తదితరులు పాల్గొన్నారు. ఉత్సవ నిర్వహణలో భాగంగా ముందుగా కార్యనిర్వహణాదికారి, స్థానాచార్యులు,అర్చకస్వాములు, వేదపండింతులు,అదికారులు సంప్రదాయబద్దంగా ఆలయప్రాంగణములోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేసారు.ఆలయ ప్రవేశం చేసిన వెంటనే వేదపండింతులు చతుర్వేదపారాయణలు చేసి వేదస్వస్తి నిర్వహించారు.వేదపఠనం అయిన వెంటనే స్థానాచార్యులు(ఆధ్యాపకులు)వారు లోకక్షేమాన్నికాంక్షిస్తూ బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠించారు.దినికే శివసంకల్పం అనిపేరు.ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యలతో విలసిల్లాలని,ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని,జనులందరికి ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని దేశ ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు, వేదపండింతులు సంకల్పం చేసారు.సంకల్పపఠనం తరువాత చండీశ్వరపూజ జరిపించబడింది. ఈబ్రహ్మోత్ సవాలు సృష్టికర్తఅయిన బ్రహ్మదేవుని ఆధ్వర్యంలో క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి పర్యవేక్షణలో,శివపరివార దేవతలతో ఒకరైన చండీశ్వరుని నాయకత్వంలో నిర్వహించబడుతాయని చెప్పబడుతోంది.చండీశ్వరపూజ తరువాత కంకణాలకు (రక్షబంధనాలకు)శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపించబడ్డాయి.తరువాత ధర్మకర్తల మండలి ఆద్యక్షులు,కార్యనిర్వహణాదికారి వారు కంకణాన్ని ధరించారు.తరువాత ఋత్విగ్వరణం నిర్వహించబడింది.

బ్రహ్మోత్సవాలలో ఆయా వైదిక కార్యక్రమాలు నిర్వహించమని ఋత్వికులను ఆహ్వానిస్తూ వారికి దీక్షావస్త్రాలను అందజేసే కార్యక్రమానికే ఋత్విగ్వరణం అని పేరు.బ్రహ్మోత్సవాలలో మొదటిరోజు సాయంకాలం జరిగే ఈ ధ్వజారోహణకు ఎంతో ప్రాముఖ్యత వుంది.

## నేడు ఎపి మెడికల్ కౌన్సిల్ ఎన్నికలు

**- 10న ఓట్ల లెక్కింపు.. ఫలితాల ప్రకటన**

**విజయవాడ, ఫిబ్రవరి 8:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 56,374 మంది నమోదిత వైద్యులు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ (తశలీది)-2026 ఎన్నికల్లో పాల్గొననున్నారు.

ఈ ఎన్నికల ద్వారా మొత్తం 13 మంది సభ్యులను ఎన్నుకోనున్నారు. 84 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు

ఈ ఎన్నికల కోసం ప్రభుత్వ వెబ్‌సైట్ ఏపీఎంసీ ద్వారా ఫిబ్రవరి 9, 2026 న ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో ఓటింగ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఓట్ల లెక్కింపు మరియు ఫలితాల ప్రకటన ఫిబ్రవరి 10, 2026 న ఉదయం 11.00 గంటల నుండి నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి అన్ని పోటీ అభ్యర్థులు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను హాజరుకావాలని ఆహ్వానించారు.

అర్హత గల నమోదిత వైద్యులు అందరూ నిర్ణీత సమయంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# తిరుమల సమాచారం

## ధ్వజారోహణంతో శాస్త్రోక్తంగా ఆరంభమైన కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలు

**తిరుమల,పిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభ మయ్యాయి. అర్చకుల వేదమంత్రోచ్చరణలు, శంఖనాదాలు, శివనామస్మరణ మధ్య ధ్వజారోహణ ఘట్టం శాస్త్రోక్తంగా జరిగింది. పంచమూర్తులైన సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారు, వినాయక స్వామి, చండీకేశ్వరస్వామి, వల్లిదేవసేనసమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తుల సమక్షంలో మకర లగ్నంలో నందిచిత్రంతో కూడిన ధ్వజపటం ఉదయస్వామిగురుకుల్ అధిరోహింపజేశారు. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ మురళీకృష్ణ, ఆలయ ప్రత్యేక అధికారి ఫణికుమార్‌నాయుడు, ఆలయ సూపరిండెంటెంట్ కెవి చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 15న ఆదివారం మహాశివరాత్రి పర్వదినం విశేషంగా జరుగుతుంది. 16న సాయంత్రం కల్యాణోత్సవం, చివరగా 17న మంగళవారం ఉదయం త్రిశూలస్నానంతో ,రాత్రి ధ్వజావరోహణంతో ముగుస్తాయి. ఆలయంలో భక్తులకు సౌకర్యాలు, ఏర్పాట్లపై ఇఒ రవిచంద్ర ఆరా తీశారు.



## స్వామివారి ఆశీస్సులతో మంచి జరగాలి: న్యాయమూర్తులు

**తిరుమల,ఫిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని స్వామివారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ ప్రార్థించారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లోకుటుంబంతో కలసి ఆలయం లోనికి చేరుకున్నారు. వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## శ్రీవారికి అపవిత్రత జరిగితే పోరాటం చేస్తాం

**- టిటిడి నిధులు ధర్మంకోసం వినియోగించాలి - బిజెపి చీఫ్ మాధవ్**

**తిరుమల,ఫిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** హిందువుల ఆరాధ్యదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి అపవిత్రత కలిగించాలని చూస్తే ఊరుకునేది లేదని, దానిపై పోరాటం సాగిస్తామని బిజెపి ఏపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. దేవుని కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు ఆగమోక్తంగానే జరగాలని, అదే కూటమి ప్రభుత్వం పరిపాలన అని అన్నారు. టిటిడి నిధులు ధర్మం కోసం వినియోగించాలని, వేరే ఇతర కార్యక్రమాలకు వ్యయం చేయొద్దని ఆయన హితవు పలికారు. శ్రీవారికి అపచారం జరిగితే చూస్తూ ఊరుకోబోమని తేల్చిచెప్పారు. ఆదివారం ఉదయం తిరుమలకు వచ్చిన పివిఎన్ మాధవ్ ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి

**తిరుమల,ఫిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని విశ్రాంత డిజిపి ఆర్‌పి ఠాకూర్ కాంక్షించారు. విఐపి బ్రేక్‌లో ఆదివారం ఉదయం ఆలయం లోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించారు. స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## పటిష్టంగా తెప్పల నిర్మాణం

**- పనులను పరిశీలించిన అదనపు ఇఒ చౌదరి**

**తిరుమల,ఫిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల దేవుని సాలకట్ల తెప్పోత్సవాలకు సిద్ధమవుతున్న తెప్పను ఆదివారం ఉదయం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం పరిశీలించారు. తెప్పను పటిష్టంగా ఏర్పాటు చేయాలని, ఇందుకు ఇంజనీరింగ్ అధికారులు భక్తితో పనిచేయాలన్నారు. ఆదివారం ఉదయం పుష్కరిణిలో సిద్ధమవుతున్న తెప్పను పరిశీలించిన సూచనలు చేశారు. ఈనెల 26వతేదీ నుండి ఐదురోజులు వైభవంగా తెప్పోత్సవాలు జరగనున్నాయి. ప్రత్యేకంగా టిటిడి ఇంజనీరింగ్ అధికారులు, నీటివిభాగం అధికారులు బలమైన తండ్లతో తెప్పను తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 26వతేదీ గురువారం సాయంత్రం నుండి మార్చి 2వతేదీ సోమవాంర వరకు ఐదురోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ తెప్పోత్సవాలు ప్రతిరోజూ రాత్రి 7గంటల నుండి 8గంటల వరకు ఆలయ పుష్కరిణిలో వేడుకగా నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో తొలిరోజు సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తిగా తెప్పలపై పుష్కరిణిలో మూడుచుట్లు తిరిగి భక్తులకు అభయమిస్తారు.



## రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది :మంత్రి జనార్ధన్‌రెడ్డి

**తిరుమల,పిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ,కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీర్వాదంతో ప్రజలకు మరింత సేవచేసే శక్తిని ఇవ్వాలని వేడుకున్నట్లు రాష్ట్రమంత్రి జనార్ధనరెడ్డి తెలిపారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం స్వామివారిని ప్రార్ధించినట్లు మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రజలంతా సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. ఆదివారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి ఆలయంవద్దకు విచ్చేసిన మంత్రికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయంలోపల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి కుటుంబసభ్యులకు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## కల్యాణవేదికలో పురోహిత సంఘం ప్రత్యేక పూజలు - సేవలకు ఫీజులు నిర్ణయం

**తిరుమల,ఫిబ్రవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలకొండపై సామాన్యభక్తులకు అవసరమైన అన్ని సేవలు పాపవినాశనం మార్గంలోని కల్యాణవేదికలో టిటిడి అందూబాటులో ఉంచింది. పురోహిత సంఘం ఆధ్వర్యంలో భక్తులు ,గృహస్థులకు అవసరమైన వివిధ సాంప్రదాయ పూజ కార్యక్రమాలను నిర్దేశిత రుసుంతో నిర్వహిస్తున్నారు. పురోహిత సంఘంద్వారా వివాహం, ఉపనయనం, సత్యనారాయణవ్రతం, నామకరణం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం,వాహనపూజ తదితర ధార్మిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపిస్తారు. భక్తుల సౌకర్యార్థం ఈ సేవలను తక్కువ ఖర్చుతో జరిపించుకునే విధంగా టిటిడి అందుబాటులో ఉంచింది. కల్యాణవేదికలో నూతన జంటలు వివాహం చేసుకునేందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఉపనయనం, సత్యనారాయణవ్రతానికి 300 రూపాయలు, కేశఖండన,నామకరణం, అన్నప్రాసన,అక్షరాభ్యాసం, వాహనపూజలకు 200 రూపాయలు, దస్త్ర పూజ, ఇతరకార్యక్రమాలకు 200 రూపాయలుగా, చెవిపోగులు కుట్టడం 50 రూపాయలు, కాటేజీ వద్ద అయితే 100 రూపాయలు, మేళం ఒకసెట్టు 100రూపాయలు, రెండు సెట్లు.



కొత్త ఏడాది.. వ్యాయామం చేయాలన్న నిర్ణయం తీసుకుని జిమ్‌కి వెళ్లడం మొదలుపెట్టారా? అయితే ఈ జాగ్రత్తలు తీసుకోండి. బూట్లూ, దుస్తులూ : అసలెన్ని రోజులు వ్యాయామం చేస్తామో తెలియదు. కాస్త అలవాటు పడేదాకా ఏవో ఒకటి కొనేద్దాం అనుకునేవారు చాలామంది. కానీ, బూట్లూ, దుస్తుల విషయంలో ఇలా ఆలోచించడం తప్పు నాసిరకం బూట్ల వల్ల

# జిమ్ చేస్తున్నారా?

వారంలోనే కాలి మడమలూ, మోకాళ్ల నొప్పి పుడతాయి. కొన్నిసార్లు అంతర్గత గాయాలు కావొచ్చు. అంతేకాదు, ఒంటికి గాలి తగలనివ్వని, శరీరానికి ఆహ్లాదకరంగా లేని దుస్తులు వేసుకుంటే తొందరగానే చెమటపట్టి వేడెక్కుతుంది. డీహైడ్రేషన్ ఆవరించి.. నిస్సత్తువగానూ అనిపిస్తుంది. కాబట్టి సాధారణ దుస్తుల విషయంలో రాజీ వద్దు. మంచి నీళ్లు: వ్యాయామానికి అలవాటు పడేదాకా రోజూ మీ వెంట ఓ మంచినీళ్ల సీసా తీసుకెళ్లండి. అవసరమైనప్పుడు ఒక్కో గుటక వేసినా చాలు. గుండె వేగం పెంచే వ్యాయామాలు చేసేటప్పుడు కళ్లు తిరగడం, నీరసించడం వంటివి సమస్యలుండవు. 2. వార్మ్‌అప్ : కాస్త కష్టమైన వ్యాయామాలకే కాదు.. సులభంగా చేసేవాటికైనా సరే 'వార్మ్‌అప్' తప్పనిసరి. వేగంగా నడవడమే మీ వ్యాయామం అనుకున్నా.. దానికి ముందు కాస్త మెల్లగా నడక మొదలు పెట్టడమే వార్మ్ అప్! వ్యాయామం సమయంలో 25 శాతం కేటాయించాలి. ఇక స్ట్రెచ్‌ల విషయానికొస్తే వీటిని వ్యాయామం చివర్లో చేస్తేనే మంచిది. ◻

# లక్ష్మిలా మెరిసిపోయేలా.. !



ప్రకాశవంతమైన చర్మానికి.. ఈ పండగ వేళ అందాన్ని ద్విగుణీకృతం చేసుకోవాలంటే ఈ సింపుల్ చిట్కా మేలు చేస్తుందంటున్నారు నిపుణులు. చెంచా నారింజ తొక్కల పొడిలో.. రెండు చెంచాల కాచి చల్లార్చిన పాలు పోసి బాగా కలపాలి. ఒకవేళ మొటిమల సమస్య బాధిస్తుంటే ఈ ప్యాక్లో పాలకు బదులుగా రోజ్వాటర్ ఉపయోగించవచ్చు. ఈ రెండింటినీ మిక్స్ చేసి మెడ, ముఖంపై ప్యాక్ వేసుకోవాలి. తర్వాత 15 నుంచి 20 నిమిషాలు ఆరనిచ్చి చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఈ ప్యాక్ వల్ల ముఖం ప్రకాశవంతంగా కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. **మేకప్‌తో కళగా!** .. కళగా మెరిసిపోవాలంటే మేకప్‌దే ప్రధాన పాత్రే! ఈ



ముందుగా ముఖం, మెడ, వీపు.. ఇలా మేకప్ వేసుకునే చోట కొద్దిగా మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి. ✦ అది చర్మంలోకి ఇంకిన తర్వాత చర్మరంగుకు సరిపడే ఫౌండేషన్ ను అప్లై చేసుకోవాలి. 3. ఆపై చర్మరంగుకు మ్యాచయ్యే కాంపాక్ట్ పౌడర్ రాసుకోవాలి. డ్రెస్‌కు మ్యాచయ్యే విధంగా ఐషాడో వేసుకోవాలి. బేబీ పింక్, మెజెంటా, ఆరెంజ్, పీచ్ వంటివి దాదాపు అన్ని రంగుల దుస్తుల మీదకు నప్పుతాయంటున్నారు నిపుణులు. ✦ తర్వాత ఐలైనర్, కాటుక, కనురెప్పలకు మస్కారా అప్లై చేసుకొని కళ్లను తీర్చిదిద్దుకోవాలి. 5.. ఇక ఆఖరుగా చర్మ ఛాయకు సూటయ్యే రంగు లిప్స్టిక్ వేసుకుంటే మేకప్ పూర్తవుతుంది. ఈ మేకప్ లుక్ సింపుల్ గా కనిపిస్తూనే మెరిపించేలా చేస్తుందంటున్నారు నిపుణులు. **ఆభరణాలు ఇలా!** డ్రెస్సింగ్‌కు తగినట్లుగా యాక్సెసరీస్ ఎంపిక చేసుకోవడమూ ముఖ్యమే! దుస్తులు హెవీగా ఉంటే ఆభరణాలు సింపుల్‌గా ఉంటే చాలు, అదే దుస్తులు సింపుల్‌గా ఎంచుకోవాలి. ◻

# మానసిక రోగుల కోసం కొత్త పరికరం



**అంతరిక్ష లోతుల్ని సైతం జల్లెడ పట్టేస్తే మనిషి... కొన్నిసార్లు అంత రంగాన్ని సరిగ్గా చేసుకోలేక చతికిలపడతాడు. ఇదే విషయం రమ్య ఎల్లాప్రగడని ఆలోచనల్లో పడేసింది. మెదడు పైన పరిశోధించేలా ప్రేరేపించింది. ఆమె ఆవిష్కరించిన పరికరం మానసిక చికిత్సలో కీలకంగా మారింది. ఫోర్బ్స్ ఇండియా సైతం ఈమెకు 30 అండర్ 30లో చోటు కల్పించింది. తన ప్రయాణం తెలుసుకుందాం..**

పంచుకున్నారిలా... ఇంజినీరింగ్ రెండో సంవత్సరం తర్వాత ఢిల్లీలోని అడోబీ ఇంటర్న్‌షిప్ చేశా. వాళ్లు చేస్తోన్న పని, ఆ వాతావరణం అద్భుతంగా అనిపించాయి. ఉద్యోగం కోసం ఇంటర్న్‌షిప్ ఫైనలియర్ చేయాలి. రెండోసారి వెళ్లినప్పుడు మాత్రం అదే పని బోరింగ్ అనిపించింది. మూడోవంతు సమయం వృత్తికే కేటాయిస్తాం. తొమ్మిది నుంచి ఇంటర్మీడి యట్ వరకూ వైజాగ్లో చదువుకున్నా ఐఐటీ ఢిల్లీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చేశా. నాకు అంత రిక్షం కంటే కూడా మనల్ని మనం తెలుసు కోవడమే ముఖ్యమని పిస్తుంది. ఇంజనీరింగ్‌లో కంప్యుటేషనల్ బయాలజీని ఎంచుకుని న్యూరో సైన్స్, బ్రెయిన్ పనితీరుమీద పరిశోధించా. మా కుటుంబంలోనూ ఒకరు మానసిక సమస్యతో ఇబ్బంది పడటం చూశాక దానిపైనే పనిచేయాలని ఆంత్రప్రెన్యూర్‌షిప్ దారిని ఎంచుకున్నా. **మందులకంటే మిన్నగా..** 2019లో ఇంజినీరింగ్ పూర్తయింది. ఢిల్లీలోని ప్లక్ష యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కాలి ఫోర్నియా బర్కెలీతో కలిసి నిర్వ హించే 'టెక్ లీడర్స్ ఫెలోషిప్'కి 2020లో ఎంపికయ్యా.. అక్కడ మంచిది మెంటార్షిప్ దొరికింది ఏం చేయాలనే దాని పైన స్పష్టత వచ్చింది. లక్ష య్ సహానీ పరిచయమైందీ అప్పుడే ఇద్దరం ఈ ప్రాజెక్టు మీద పనిచేయాలనుకున్నాం. మెదడు ఒక ఎలక్ట్రో కెమికల్ అవ యవం. మానసిక సమస్య వస్తే రసాయన, విద్యుత్తోపాటు బిహేవియర్ అంశాల్లో చికిత్స ఇవ్వాలి. వైద్యులు సాధారణంగా మందుల తో రసాయన విభాగానికి చికిత్స చేసి, ప్రాథమిక సౌకర్యాలు లేక విద్యుత్ విభాగాన్ని నిరక్ష ్యం చేస్తారు. దాంతో మెదడులో కొంత అసమతు ల్యత అలానే ఉంటుంది. అలా కాకుండా మందులతో పాటే ఒక సురక్షి తమైన విద్యుదుత్తేజాన్నీ మెదడుకు అందిస్తే తొందరగా కోలుకుంటారు. దీన్నే న్యూరో మాడ్యులేషన్ అంటారు. ఈ తరహా చికిత్సను టీడీపీ (ట్రాన్స్ క్రేనియల్ డైరెక్ట్ కరెంట్ స్టిమ్యులేషన్) అంటారు. పరికరం ఖరీదు రూ.కోటి పైనే ఉంటుంది. దాంతో పెద్ద హాస్పిటల్స్‌లో మాత్రమే ఉంటున్నారు. దీనికి చాలా ఎక్కువ మొత్తం చెల్లించాలి ప్రత్యామ్నా యంగా తక్కువ ధరలో అందరికీ అందుబాటులో ఉండే పరికరాన్ని చేయాలనుకుంటున్నాము. **పదోవంతుకే చికిత్స...** 2021 కొవిడ్ తీవ్రంగా ఉంది. అయినా, ఢిల్లీలోని ఓ ప్రఖ్యాత హాస్పిటల్‌లో మా పరిశోధనను కొనసాగుతుంది. మాస్కులు, గ్లవుజులు వేసుకుని నాలుగు నెలలు హాస్పిటల్ కు వెళ్లాం. మా ప్రోటోటైప్ పరికరాన్ని అక్కడ ప్రయోగించాం. 25 మందిమీద పది రోజులపాటు రోజుకు రెండుసారునంల పరికరాన్ని అక్కడ ప్రయోగించాం. ఈ పరికరానికి భారత్‌లో వైద్య మండళ్ల అనుమతులూ సంపాదించాం. గత నెలలో అమెరికా ఎఫ్‌డిఎ అనుమతీ వచ్చింది. పక్షవాతం వంటి న్యూరాలజీ సమస్యల్ని దృష్టిలో పెట్టుకొని రెండో ఉత్పత్తి కూడా తేబోతున్నాం స్పష్టమైన లక్ష్యం పెట్టుకుని శ్రమిస్తే వయసుతో అన్నట్లుగా ఉండే ప్రశ్నలు

# నిజమైన భక్తి

పుణ్య మంతా తమకే దక్కాలనే ఉద్దేశంతో కొం దరు 'భక్తి' అనే ముసుగులో అంగరంగ వైభోగా లకు ,ఆడంబరాలకు వెళుతూ ఉంటారు . దీనికి కారణం మన చుట్టూ ఉన్న వాతావరణం , అవగాహనా రాహిత్యం . ఇలాంటి భక్తి ఎప్పటికీ నిజమైన భక్తి అనిపించుకోదు . హృదయంలో నిత్యం భగవంతుడిని నిలుపుకొని పత్రమో , ఫలమో, పుష్పం లేదా నీటినిగాని భక్తితో భగవం తుడికి సమర్పించిన వారికి భగవంతుడి సమర్పించిన వారికి భగవంతుడి అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది. అంతేకాదు ఎదుటివారినిగౌరవిస్తూ , వారిలో దేవుడ్ని చూ డటమే నిజమైన భక్తి. నన్ను మించిన వారు లేరు అనే అహం భావం ,మంచి చెడ్డల్ని విస్మరిం పచేసే అహం కారంతో ఎన్ని పూజలు చేసినా ప్రయోప్ర జనం శూన్యం . మనసులో 'నేనే గొప్ప' అనే అహం కారాన్ని పెట్టుకుని ఆడంభరాలతో ఎన్ని పూజలు చేసినా ఫలితం మాత్రంఉండదు . అహం భావాన్ని వదలి, అహం కారాన్ని వీడి పెద, గొప్ప అని చూడకుండా అందరినిసమభావంతో ప్రేమిస్తే, భగవంతుని కరుణా కటాక్షం తప్పక లభిస్తుంది.-



**- కాయల నాగేంద్ర,**

# చిల్లీ చైనీస్ చికెన్



**కావలసినవి** : చికెన్: అరకేజీ, మొక్కజొన్నపిండి: రెండు టేబుల్‌స్పూన్లు, సోయాసాస్ : నాలుగు టేబుల్‌స్పూన్లు, గుడ్డు : ఒకటి, ఉల్లిపాయలు, రెండు, నూనె : కప్పు, ఎండుమిర్చి:ఆరు, వెల్లుల్లి తరుగు: రెండు టేబుల్‌స్పూన్లు, అల్లం తరుగు: చెంచా, టామాటో కెచప్: రెండు టేబుల్‌స్పూన్లు, క్యాప్సికం : రెండు, ఉప్పు: తగినంత.

**తయారీవిధానం :** చికెన్‌ని చిననన ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఓ గిన్నెలో చికెన్ ముక్కలు, మొక్కజొన్నపిండి, సోయాసాస్, గుడ్డు సొన వేసి అనిననంటినీకలిపి పెట్టుకోవాలి. స్టౌమీద బాణలి పెట్టి రెండు టేబుల్‌స్పూన్ల నూనె వేసి ఎండుమిర్చి ఉల్లిపాయ ముక్కలు అల్లం-వెల్లుల్లి తరుగు వేసి వేయించాలి. అవి వేగాక టొమాటో కెచప్. తగినత ఉప్పు వేసి ఓసారి కలిపి దింపేయాలి. మరోబాణలిని పొయ్యిమీద పెట్టి మిగిలిన నూనె వేసి చికెన్ ముక్కల్ని వేయించి టొమాటోసాస్‌లో వేయాఇ. తరువాత అన్నింటినీ కలిపి స్టౌమీద పెట్టి క్యాప్సికం ముక్కలు, కప్పు వేసి నీళ్లుపోసి స్టౌని సిమ్‌లో పెట్టాలి. మిశ్రమం కాస్త చిక్కబడ్డాక దింపేయాలి. ◻

# బంధం దృఢమవ్వాలంటే !

ఒకే ఇంట్లో ఉన్నారన్న మాటేగానీ ఈరోజుల్లో పిల్లలతో తల్లిదండ్రులు ఎంత సమయం గడుపుతున్నారు? ఒకవేళ గడిపినా, అది మీ మధ్య బంధాన్ని పెంచేలా ఉంటుందా? అన్నింటినీ గమనించుకోవాలి. మీ సమాధానం 'లేదు' అయితే... ఇలా చేయండి.

✦ వీలైతే రోజూ స్కూల్, కాలేజీ విశేషాలేంటో పిల్లల్ని అడిగి తెలుసుకోండి. వాళ్ళు చెప్పింది. జాగ్రత్తగా వినండి, మధ్యలో టాపిక్ని డ్రైవర్ చేయొద్దు. మీదైన భాష్యం చెప్పేందుకూ ప్రయత్నించకండి. అమ్మానాన్న చెప్పేది వింటారని వాళ్లకి నమ్మకం కుదిరితే, కష్ట సమయాల్లో మీరున్నారనే ధైర్యం కలుగుతుంది. ✦ రోజులో మీకు ఎదురైన అనుభవాలనూ వాళ్లతో పంచుకోండి. మీరు కలిసిన ముఖ్యమైన వ్యక్తులు, ఆఫీసులో ఎదురైన సవాళ్లు, వాటిని పరిష్కరించిన తీరూ అన్నీ పంచుకోండి. ✦ కొన్నిసార్లు మీరూ సరదాగా కబుర్లు చెప్పండి. అలాంటప్పుడు కచ్చితంగా ఇదే



కాకుండా, ఓపెన్ ఎండెడ్ ప్రశ్నలు వేయండి. దానివల్ల భిన్న కోణాల్లో ఆలోచిస్తారు. కాలక్షేపంలా కాకుండా, ఒకరికొకరు బాగా అర్థమవు తారు. ✦. ఇంటికి సంబంధించిన చిన్న చిన్న విషయాల్లో పిల్లల అభిప్రాయానికి చోటివ్వండి. సెలవు రోజు ఎక్కడికి వెళ్లాలనుకుంటున్నారు, బ్రేక్‌ఫాస్ట్‌లాండ్‌లో ఏం తినాలనుకుంటున్నారు. ఇలాంటివి అడగండి.. ✦ .రోజులో అందరూ ఒక పూటైనా కలిసి తినడానికి ప్రయత్నించండి. ఆ సమయంలో టీవీలూ, ఫోన్లూ కట్టిపెట్టండి.

# వచ్చే సంక్రాంతికి సోగ్గాళ్లు



అక్కినేని అభిమానుల కోసం అన్నపూర్ణ స్టూడియోస్ సంక్రాంతి సర్ప్రైజ్ ఇచ్చింది. 2027 పొంగల్ రేసులో తమ సినిమా ఉంటుందని అధికారికంగా ప్రకటించింది. హీరో ఎవరు? డైరెక్టర్ ఎవరు? ఎప్పుడు షూటింగ్ స్టార్ట్ చేస్తారు? వంటి ప్రాజెక్ట్ వివరాలేమీ వెల్లడించకుండా, ఏకంగా విడుదల తేదీని అనౌన్స్ చేసింది. వాసివాడి తస్సాదియ్యా. వచ్చే 15 జనవరి 2027 సంక్రాంతికి సోగ్గాళ్లు వస్తే పండగ ఇంకా కలర్ ఫుల్‌గా ఉంటాది కదా. డేట్ మార్క్ చేసుకోండి అని అన్నపూర్ణ బ్యానర్ ఎక్స్ లో పోస్ట్ పెట్టింది.

టాలీవుడ్‌లో సంక్రాంతి సీజన్‌కు ఎంత డిమాండ్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతిని సినిమా పండగలా భావిస్తుంటారు కాబట్టి, స్టార్ హీరోల దగ్గర యంగ్ హీరోల వరకూ.. అందరూ తమ సినిమాలను అదే సీజన్‌లో రిలీజ్ చెయ్యాలని కోరుకుంటారు.. పండగను టార్గెట్‌గా పెట్టుకొని సినిమాలను పూర్తి చేస్తుంటారు. 2026 పండక్కి వచ్చిన సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపించడంతో, వచ్చే సంక్రాంతి కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో అక్కినేని హీరోల నుంచి వచ్చే ఏడాది పండక్కి ఓ సినిమా రాబోతున్నట్లు ప్రకటన వచ్చింది.

## వారణాసికి విరామం..

టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కలిసి నటిస్తున్న చిత్రం వారణాసి. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన హైదరాబాద్ షెడ్యూల్‌ను ప్రియాంక పూర్తి చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడిస్తూ, హైదరాబాద్ నుంచి ఓ ప్రత్యే కమైన జ్ఞాపకాన్ని తనతో పాటు తీసుకెళుతున్నట్లు తెలిపారు. షెడ్యూల్ ముగియడంతో లాస్ ఏంజిల్స్‌కు బయల్దే రిన ప్రియాంక, ఫ్లైట్‌లో ప్రయాణిస్తూ ఇక్కడి ఫేమస్ బన్ మస్కాఖ చిత్రాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకున్నారు. హైదరాబాద్ నుంచి ఓ భాగాన్ని నాతో తీసుకెళుతున్నా. త్వరలో కలుద్దాం.. అని దానికి క్యాప్షన్ జోడించారు. తాను నటించిన హాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ ది బ్లఫ్ ప్రమోషన్స్ కోసం లాస్ ఏంజిల్స్ వెళుతున్నట్లు మరో పోస్టులో ఆమె స్పష్టం చేశారు.



# బాలీవుడ్ ఎంట్రీ?



పుష్పతో నేషనల్ వైడ్ సెన్సేషన్ క్రియేట్ చేసిన బన్నీ, ఇప్పుడు తన నెక్స్ట్ అడుగు ఎక్కడ వేయబోతున్నాడనేది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా సౌత్ హీరోలకు బాలీవుడ్ అంటే ఒక మైలు రాయి. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. బాలీవుడ్ హీరోలే మన వైపు చూస్తున్నారు. ఇలాంటి టైమ్‌లో బాలీవుడ్ డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ అల్లు అర్జున్‌తో సినిమా చేయబోతున్నారనే వార్త నెట్టింట వైరల్ అవుతోంది. సంజయ్ లీలా భన్సాలీ అనగానే మనకు గుర్తొచ్చేవి భారీ సెట్లు, అద్భుతమైన కాస్ట్యూమ్స్, ఎమో షనల్ కథలు. దేవాదాసు, బాజీరావ్ మస్తానీ, పద్మావత్ వంటి చిత్రాలతో బాలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఆయన, ఇపుడు అల్లు అర్జున్ కోసం ఒక పవర్ ఫుల్ సబ్జెక్ట్‌ను రెడీ చేసినట్లు సమాచారం. నిజానికి, గతంలో మన టాలీవుడ్ స్టార్ హీరోలు కొందరు హిందీలో నేరుగా సినిమాలు చేసినా.. అవి ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. కానీ, పుష్పతో హిందీ ఆడియన్స్‌కు బన్నీ ఆల్రెడీ దగ్గరయ్యారు. అక్కడి మాస్ పల్స్ బన్నీకి బాగా తెలుసు. అందుకే, భన్సాలీ విజన్ కూడా ఈసారి బన్నీ ఇమేజ్‌కు తగ్గట్టుగా ఉండబోతోందని టాక్. ప్రస్తుతం అల్లు అర్జున్ డైరీ ఫుల్ అయిపోయింది. పుష్ప2 తర్వాత ఆయన లైనప్ చూస్తే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. అట్లీ దర్శకత్వంలో ఒక మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లైన్‌లో ఉంది. ఆ తర్వాత సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ ప్రాజెక్ట్ కూడా పట్టాలెక్కనుంది. ఈ రెండు భారీ చిత్రాల తర్వాతే భన్సాలీ సినిమా ఉండొచ్చని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. భన్సాలీ చెప్పిన కథకు బన్నీ ఇన్‌స్టంట్‌గా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట.

## శాండల్ వుడ్‌లో ఛాన్స్


టాలీవుడ్ యంగ్ హీరోయిన్ మీనాక్షి చౌదరి వరుస విజయాల నేపథ్యంలో ఆమెతో సినిమాలు చేయడానికి దర్శక, నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. తాజాగా ఆమె శాండల్ వుడ్‌లోకి అడుగు పెట్టబోతున్నారని తెలుస్తోంది. కన్నడ స్టార్ రక్షిత్ శెట్టి నటించిన సూపర్ హిట్ 777 చార్లీ సీక్వెల్‌లో నటించబోతున్నారన్న ప్రచారం జరుగుతోంది. టాలీవుడ్‌లో తక్కువ కాలంలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యంగ్ హీరోయిన్స్‌లో మీనాక్షి చౌదరి ఒకరు. హర్యానాకు చెందిన ఈ అందాల భామ అందం, అభినయం, గ్లామర్‌ను సమపాళ్లలో మేళవిస్తూ తనకంటూ ఓ ప్రత్యేక ఇమేజ్‌ను క్రియేట్ చేసుకుంది. ముఖ్యంగా గుంటూరు కారం, లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం వంటి చిత్రాలు ఆమె ఖాతాలో భారీ విజయాలుగా నిలిచాయి. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో మీనాక్షి క్రేజ్ నెక్స్ట్ లెవల్‌కు వెళ్లిందని చెప్పొచ్చు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ నంబర్స్ నమోదు చేయడంతో పాటు, ఆమెను స్టార్ హీరోయిన్ల జాబితాలో నిలబెట్టింది. ఇక మొన్న సంక్రాంతికి విడుదలైన అనగనగా ఒక రాజు కూడా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకోవడంతో పాటు రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. చిన్న కథతో తెరకెక్కిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతో పాటు మీనాక్షి నటనకు మరోసారి మంచి పేరు తెచ్చిపెట్టింది.



## సమాజానికి మంచి చెప్పే సీతాపయనం

తెలుగువారికీ సుపరిచితుడైన తమిళ సీనియర్ నటుడు అర్జున్.. దర్శకుడిగానూ కొన్ని సినిమాలు తీశాడు. ఇప్పుడాయన స్వీయ దర్శకత్వంలో సీతా పయనం అనే చిత్రాన్ని రూపొందించారు. దర్శకుడిగా తన అభిరుచి సీతాపయనం లాంటి క్లాస్ సినిమాలే అని అర్జున్ తెలిపాడు. సమాజానికి మంచి విషయాలు చెప్పాలనే తపన తనలో ఉందని.. ఈ క్రమంలోనే సీతాపయనం చేశానని.. ఇది హృద్యంగా సాగే చిత్రమని అతనన్నాడు.

ఇందులో అర్జున్ తనయురాలు ఐశ్వర్య లీడ్ రోల్ చేసింది. ఆమెకు జోడీగా నిరంజన్ అనే కొత్త కుర్రాడు నటించాడు. ఇందులో రౌడీగా ఒక కీలక పాత్ర ఉంది. ఆ పాత్రలో అర్జునే నటించాడు. కానీ ఆ పాత్రకు విజయ్ సేతుపతిని తీసుకోమని మెగాస్టార్ చిరంజీవి చెప్పారట. సీతాపయనం కథ చిరుకు బాగా తెలుసని.. ఆయనకు ఇది ఎంతో నచ్చిందని.. ఇందులో కీలక పాత్రకు సేతుపతి బాగుంటాడని చిరు అభిప్రాయపడ్డాడని.. కానీ డేట్ల సమస్య వల్ల అతనీ చిత్రంలో నటించకపోవడంతో చివరికి తానే ఆ పాత్ర చేశానని అర్జున్ వెల్లడించాడు.



# తెర

## మరో ప్రేమకథతో..



గత 25 ఏళ్లలో దక్షిణాదిన వచ్చిన ఉత్తమ ప్రేమ కథల జాబితా తీస్తే.. అందులో ముందు వరుసలో గౌతమ్ మేనన్ సినిమాలే ఉంటాయి. అయితే ఈ విలక్షణ దర్శకుడు నిఖార్సయిన ప్రేమకథ తీసి చాలా రోజులైపోయింది. అసలాయన సినిమాలు తీయడమే తగ్గించేశారు. ఇప్పుడు మళ్లీ తన మార్కు లవ్ స్టోరీ తీయాలని అనుకుంటున్నాడట గౌతమ్. దీనికి సరైన ఆర్టిస్టుల కోసం ఎదురు చూస్తున్నట్లు ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు గౌతమ్. మళ్లీ మనసు పెట్టి ఒక ప్రేమకథను రాసినట్లు గౌతమ్ వెల్లడించాడు. ఒకప్పట్లా స్టార్ హీరోలు ఇప్పుడు ప్రేమకథలు చేయట్లేదని.. కాబట్టి తన ప్రేమకథకు ఆర్టిస్టులను ఎంచుకోవడం కష్టంగా ఉందని గౌతమ్ అన్నాడు. ఈ కథ ఎవరిని ఎంచుకుంటుందో చూడాలని చెప్పాడు. తన సినిమాలు కొన్ని ఫ్లాప్ కావడం గురించి గౌతమ్ మాట్లాడుతూ.. తాను వేరే నిర్మాతలకు చేసిన సినిమాల్లో ఏదీ దాదాపుగా నష్టాలు తెచ్చిపెట్టలేదని గౌతమ్ స్పష్టం చేశాడు. తాను సొంతంగా ప్రొడ్యూస్ చేసిన సినిమాలే సరిగా ఆడలేదన్నాడు. ధనుష్‌తో తీసిన ఎన్నై నోకి పాయుం తోటా ఎక్కువ నష్టం మిగిల్చిందన్నాడు గౌతమ్.

సరదా కోసమే నటుడిగా సినిమాలు చేస్తూ వచ్చానని.. ఇప్పుడు బ్రేక్ తీసుకుని వరుసగా సినిమాలు డైరెక్ట్ చేయాలనుకుంటున్నానని చెప్పాడు గౌతమ్. సంగీత దర్శకుడు హారిస్ జైరాజ్‌తో తనకు గొప్ప అనుబంధం ఉందని.. తన పాటల్లో సగానికి పైగా అతనే కంపోజ్ చేశాడని చెప్పిన గౌతమ్.. ఒక్క నడునిసి నాయిగల్ (ఎర్ర గులాబీలు) చిత్రంలో మాత్రమే పాటలు లేకుండా ప్రయోగం చేశానని.. అది ఫలితాన్నివ్వలేదని అన్నాడు.

## ఈసారి సింగిల్‌గా?



చాలా ఏళ్ల నుంచి బాలయ్య ఎక్కువగా డ్యూయల్ రోల్స్.. లేదా ఒక పాత్రలో రెండు షేడ్స్‌లో కనిపిస్తున్నారు. డ్యూయల్ రోల్ చేసినా, షేడ్స్ చూపించినా.. బాలయ్య అవతారం మారిపోతుంటుంది. రెండు పాత్రలకూ ఇద్దరు హీరోయిన్లను పెడ తారు. ఇక ఆయన సినిమాల్లో ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ అన్నది చాలా కామన్. బాలయ్య చివరి సినిమా అఖండ2.. అంతకు ముందు వచ్చిన డాకు మహారాజ్, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి, అఖండ, రూలర్.. ఇలా ప్రతి సినిమా దాదాపుగా ఈ కోవలోనే ఉంటాయి. బాలయ్య అనగానే ఈ ఫార్మాట్లోనే కథలు రాసుకుంటూ ఉంటారు రచయితలు, దర్శకులు. బాలయ్యను అలా ఎన్నిసార్లు చూపించినా సరే.. ఆయన అభిమానులు, మాస్ ప్రేక్షకులు మెచ్చుతారు. అయితే బాలయ్యతో కొత్త సినిమా చేయబోతున్న గోపీచంద్ మలినేని మాత్రం కొంచెం రూటు మారుస్తున్నారట. ముందు బాలయ్య కోసం చేసిన చారిత్రక నేపథ్యం కథలో హీరోది డ్యూయల్ రోలే. కానీ దాన్ని పక్కన పెట్టి చేసుకున్న మాస్ కథలో మాత్రం బాలయ్యది ఒకే పాత్ర ఉంటుందని విశ్వసనీయ సమాచారం.

# ఉత్కంఠ పోరులో ఇంగ్లండ్ హ్యాట్రిక్

## పసికూన నేపాల్ విశ్వరూపం



**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టుకు నేపాల్ చుక్కలు చూపించింది. పసికూన నేపాల్ అద్భుత పోరాట పటిమను కనబరిచినప్పటికీ, చివరి బంతి వరకు సాగిన ఈ ఉత్కంఠ పోరులో ఇంగ్లాండ్ కేవలం 4 పరుగుల తేడాతో గట్టెక్కింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్ 185 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ 20 ఓవర్లలో 180/6 పరుగులు చేసింది. సామ్ కరన్ ఆఖరి ఓవర్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి ఇంగ్లాండ్‌ను పరాభవం నుంచి కాపాడాడు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్‌కు ఆరంభంలోనే నేపాల్ బౌలర్లు షాకిచ్చారు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (1) త్వరగానే ఔట్ కాగా, కెప్టెన్ జోస్ బట్లర్ (26) కాసేపు మెరిసి వెనుదిరిగాడు. 57 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న ఇంగ్లాండ్‌ను జాకబ్ బెథెల్(55), హ్యారీ బ్రూక్(53) అర్థ సెంచరీలతో ఆదుకున్నారు. చివర్లో విల్ జాక్స్ 39 పరుగులు చేయడంతో ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. అనంతరం 185 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ ఏమాత్రం బెదరలేదు. ఓపెనర్ కుశాల్ భుర్తెల్ (29) జోఫ్రా ఆర్చర్ ఓవర్‌లో వరుసగా 3 ఫోర్లు బాది ఇంగ్లాండ్‌కు హెచ్చరికలు పంపాడు. ఆ తర్వాత కెప్టెన్ రోహిత్ పౌడెల్ (39), దిపేంద్ర సింగ్ ఐరీ (44) ఇంగ్లాండ్ స్పిన్నర్లను ఉతికి ఆరేశారు. అదిల్ రషీద్ వేసిన ఒకే ఓవర్‌లో 19 పరుగులతో అద్భుత ప్రదర్శన చేశాడు. చివరి 3 ఓవర్లలో



నేపాల్ విజయానికి 38 పరుగులు అవసరమైన దశలో లోకేష్ బామ్ సిక్స ర్లతో విరుచుకుపడ్డాడు. దీంతో సమీ కరణం చివరి ఓవర్‌లో 10 పరుగులకు చేరుకుంది. సామ్ కరన్ వేసిన ఆఖరి ఓవర్‌లో మొదటి 5 బంతులు కట్టుది ట్టంగా పడ్డాయి. చివరి బంతికి 6 పరు గులు అవసరం కాగా, లోకేష్ కేవలం ఒక్క పరుగు మాత్రమే తీయగలిగాడు. ఫలితంగా నేపాల్ 180 పరుగుల వద్ద నిలిచిపోవడంతో ఇంగ్లాండ్ అతికష్టం మీద విజయాన్ని అందుకుంది.




# డేవిస్ కప్‌లో దక్షిణేశ్వర్ విజయం

**న్యూఢిల్లీ:** డేవిస్ కప్ 2026లో భారత్‌కు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ ప్రపంచ ర్యాంకర్‌ను ఓడించాడు. 2026 డేవిస్ కప్ క్వాలిఫైయర్స్ టైను భారత్ సమం చేయడంలో సహాయపడటానికి దక్షిణేశ్వర్ ప్రపంచ 88వ ర్యాంకర్ జెస్పర్ డి జోంగ్‌పై 6-4, 7-5 తేడాతో చిరస్మరణీయ విజయం సాధించాడు. ప్రపంచ ర్యాంక్‌లో 465వ స్థానంలో ఉన్న సురేష్‌కు ఉన్నత ర్యాంక్‌లో ఉన్న ప్రత్యర్థిని ఓడించడానికి కేవలం ఒక గంటా 28 నిమిషాలు మాత్రమే పట్టింది. అలాగే తొలి సింగిల్స్ మ్యాచ్‌లో ప్రపంచ 162వ ర్యాంకర్ గై డెన్ ఔడెన్ చేతిలో అనుభవజ్ఞుడైన సుమిత్ నాగల్ 0-6, 6-4, 3-6 తేడాతో ఓడిపోయిన తర్వాత, దక్షిణేశ్వర్ విజయాన్ని తన భుజంపై వేసుకున్నాడు. రెండవ సెట్ మరోసారి ఇద్దరు ఆటగాళ్ల మధ్య గట్టిపోటీ ఎదురైంది. తర్వాత దక్షిణ 12వ మరియు చివరి గేమ్‌లో విజయం సాధించి మ్యాచ్‌ను ముగించాడు. అతని విజయం భారతదేశం 11తో టైను సమం చేయడంలో సహాయపడింది.





# న్యూజిలాండ్ అద్భుత విజయం

## టీ20 ప్రపంచ కప్‌లో 5 వికెట్ల తేడాతో అఫ్ఘానిస్థాన్ ఓటమి

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని సాధించింది. ఆఫ్ఘన్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని కివీస్ వేటగాళ్లు రికార్డు స్థాయిలో ఛేదించారు. చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠ భరిత పోరులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్‌కు కివీస్ బౌలర్లు ఆరంభంలోనే షాకిచ్చారు. ఇన్నింగ్స్ నిలకడగా సాగుతున్న సమయంలో ఓపెనర్లు రహ్మానుల్లా గుర్బాజ్ (27), ఇబ్రహీం జద్రాన్ (10) స్వల్ప వ్యవధిలో పెవిలియన్ చేరారు. పవర్‌ప్లే ముగిసే సమయానికి ఆఫ్ఘన్ 44 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే మూడో స్థానంలో వచ్చిన గుల్బదిన్ నైబ్ కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 35 బంతుల్లో 3 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 63 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతనికి తోడుగా సెదికుల్లా అటల్ (29) బాధ్యతాయుతంగా ఆడటంతో ఆఫ్ఘన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇక 183 పరుగుల కఠినమైన లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌కు రెండో ఓవర్లోనే ఆఫ్ఘన్ స్పిన్నర్ ముజీబ్ ఉర్ రహ్మాన్ చుక్కలు చూపించాడు. వరుస బంతుల్లో ఫిన్ అలెన్ (1), రచిన్ రవీంద్ర (0)లను అవుట్ చేసి కివీస్‌ను 14 పరుగులకే 2 వికెట్ల నష్టంతో ఆత్మరక్షణలో నెట్టాడు. ఈ క్లిష్ట సమయంలో టిమ్ సిఫెర్ట్, గ్లెన్ ఫిలిప్స్ జోడి ఇన్నింగ్స్‌ను అద్భుతంగా నిర్మించింది. సీఫెర్ట్ 42 బంతుల్లో 65 పరుగులు చేసి జట్టును విజయం వైపు నడిపించాడు. ఫిలిప్స్ కూడా (42) మెరుపులు మెరిపించడంతో కివీస్ ఇన్నింగ్స్ ఊపందుకుంది. వీరిద్దరూ మూడో వికెట్‌కు 74 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మిడిల్ ఓవర్లలో రషీద్ ఖాన్, ముజీబ్‌లు వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచినప్పటికీ, కివీస్ బ్యాటర్లు ఏమాత్రం తగ్గలేదు. మార్క్ చాప్‌మన్ (28) విలువైన పరుగులు జోడించగా, చివర్లో డారిల్ మిచెల్ (25 నాటౌట్), కెప్టెన్ మిచెల్ సాంట్నర్ (17 నాటౌట్) జట్టును ముందుకు నడిపించారు. కివీస్ మరో 13 బంతులు మిగిలి ఉండగానే 17.5 ఓవర్లలో లక్ష్యాన్ని చేరుకుంది.



## అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో

# పూజ జాతీయ రికార్డ్

**న్యూఢిల్లీ:** ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్-2026లో భారత్ అద్భుతమైన వరుస ప్రదర్శనలు ఇచ్చింది. రికార్డు స్థాయిలో జంప్ చేయడంతో పాటు, వివిధ విభాగాలలో బహుళ వ్యక్తి గత ఉత్తమ ప్రదర్శనల ద్వారా ఆదివారం భారత్ అథ్లెట్లు రాణించారు. ప్రధానంగా హైజంపర్ పూజా సింగ్ 1.87 మీటర్లు దూకి 22 ఏళ్ల ఇండోర్ జాతీయ రికార్డును బద్దలు కొట్టింది. దీంతో పూజ హైజంప్ ఈవెంట్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. అంతకుముందు, మహిళల లాంగ్ జంప్ ఫైనల్‌లో ఆంసీ సోజన్ కూడా కాంస్యం గెలుచుకుంది. సోజన్ 6.21 మీటర్లు దూకి మూడవ స్థానంలో నిలిచి, ఈ ఛాంపియన్‌షిప్‌లో తన మొదటి పతకాన్ని సాధించింది. పోటీ సమయంలో కంబైన్డ్ ఈవెంట్స్ అథ్లెట్ తేజస్విన్ శంకర్ మరో వ్యక్తిగత మైలురాయిని సృష్టించాడు. పోల్ వాల్ట్‌లో జీవితకాలపు అత్యుత్తమ 4.20 మీటర్లను నమోదు చేశాడు. ఈ ఈవెంట్ అతని బలహీనమైన విభాగాలలో ఒకటి అయినప్పటికీ, శంకర్ 673 పాయింట్లు సాధించి సంయుక్తంగా నాల్గవ స్థానంలో నిలిచాడు. దీంతో అతని మొత్తం స్కోరు 5163 పాయింట్లకు పెరిగింది, ఫలితంగా ఒక ఈవెంట్ మిగిలి ఉండగానే అతన్ని మొత్తం స్టాండింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిపింది. భారతదేశం తరపున కొత్త జాతీయ రికార్డును లక్ష్యంగా చేసుకుని, పురుషుల ఇండోర్ హెప్టాథ్లాన్ యొక్క చివరి ఈవెంట్‌గా అతను ఆ రోజు తర్వాత 1000 మీటర్లలో పోటీ పడనున్నాడు. ట్రాక్‌లో, మోమిత మోండల్ మహిళల 60 మీటర్ల హర్డిల్స్ ఫైనల్‌కు అర్హత సాధించింది, హీట్స్‌లో ఆమె వ్యక్తిగత ఉత్తమ సమయం 8.34 సెకన్లు. అలాగే ప్రజ్ఞాన్ సాహు తన హీట్స్‌లో 8.46 సెకన్ల సమయంతో ఐదవ స్థానంలో నిలిచి అర్హత సాధించలేకపోయింది.

## షూటింగ్ ఛాంపియన్‌షిప్..

# అర్జున్, ఎలావెనిల్ జోడీకి స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్-2026లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో స్వర్ణం గెలుచుకున్న భారత జోడీ అర్జున్ బాబుటా-ఎలావెనిల్ వలరివన్ ప్రపంచ రికార్డుతో పాటు, ఆసియా ఛాంపియన్‌షిప్ రికార్డును కూడా నెలకొల్పారు. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన ఈ టోర్నీలో అర్జున్-ఎలావెనిల్ కలిసి ఫైనల్‌లో 505 పాయింట్లు సాధించి ఆసియా టైటిల్‌ను విజయవంతంగా నిలబెట్టుకున్నారు. వారు కొరియా రిపబ్లిక్‌కు చెందిన కిమ్ వూరిమ్-క్వాన్ యుంజి (501 పాయింట్లు) మరియు జపాన్‌కు చెందిన నవోయా ఒకాడా-మిసాకి నోబాటా (437.9 పాయింట్లు) కంటే ముందున్నారు. ప్రారంభం నుంచే భారత జంట ఆధిక్యంలో కొనసాగుతూ, రెండో సిరీస్ ముగిసే సమయానికి 211 పాయింట్లతో జపాన్ జంట కంటే 2.4 పాయింట్ల ఆధిక్యంలో నిలిచింది. వరుసగా మూడో స్థానంలో నిలిచిన భారత జంట 315.8 పాయింట్లు (రౌండ్ 3 తర్వాత), 358.4 పాయింట్లు (రౌండ్ 4 తర్వాత) మరియు 400.2 పాయింట్లు (రౌండ్ 5 తర్వాత) సాధించి అగ్రస్థానంలో నిలిచింది. జూనియర్ ఈవెంట్‌లో, శాంభవి శ్రవణ్ క్షీర్‌సాగర్, హిమాన్షు 502.4 ఆసియా జూనియర్ రికార్డుతో బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. ఇక కజకిస్తాన్, మాల్దీవులు వరుసగా రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నాయి.

# ఛాంపియన్‌గా భారత్ మహిళలు

## 4-0తో బంగ్లాదేశ్ ఓటమి

**న్యూఢిల్లీ:** శాఫ్ మహిళల ఛాంపియన్-2026గా భారత్ నిలిచింది. నేపాల్‌లో జరిగిన శాఫ్ అండర్ 19 మహిళల టైటిల్‌ను 4-0 తేడాతో గెలుచుకున్న భారత్ బంగ్లాదేశ్‌పై ఆధిపత్య ప్రదర్శనను ప్రదర్శించింది. భారత్ జట్టులోని జులాన్ నోంగ్‌మైతెమ్ 42 వ నిముషం, ఎలిజబెత్ లక్రా (63), పెర్ల్ ఫెర్నాండెజ్ (68), అన్విత రఘురామన్ (83) గోల్ చేసి విజతీరాలను చేర్చారు. భారత కెప్టెన్ జులాన్ నోంగ్మైథెన్, ప్రీతికా బర్మాన్ నుండి పాస్ అందుకొని నెట్‌లోకి గోల్ చేయడం ద్వారా స్కోరింగ్‌ను ప్రారంభించింది. బిల్డ్‌అప్‌లో బార్మాన్ తరపున క్రాస్ అందించిన అల్వా దేవి సెంజామ్, చివరి మూడవ బంతిలో పెనాల్టీ లభించింది. ఎలిజబెద్ లక్రా 2-0తో ఆధిక్యాన్ని సాధించింది. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్ బంగ్లాదేశ్ భారత్‌పై ఒత్తిడి తెచ్చినా దాన్ని అధిగమించి 3వ గోల్‌ను కనుగొంది. టోర్నమెంట్‌లో రెండవ అత్యధిక గోల్ స్కోరర్ అయిన పెర్ల్ ఫెర్నాండెజ్, నాలుగు స్ట్రైక్‌లతో, గోల్ కీపర్ ఎంస్ట ఇయర్జాన్ బేగం నుండి బంతిని నెట్‌లోకి టక్ చేసింది. దీంతో బంగ్లాదేశ్ గోల్ కోసం ప్రయత్నించినా కానీ భారత్ దాన్ని నిలువరించి ఆలస్యంగా మరో గోల్ వైపు దృష్టిసారించింది. తద్వారా సమయం ముగిసే ఏడు నిమిషాలకు స్కోరు 4-0కి చేరుకుని విజయం సాధించింది.



## ఫండ్స్ ఇన్వెస్టర్ల కోసం ఈవారం

# ఎనిమిది కొత్త ఎంఎఫ్‌లు




**ముంబయి, ఫిబ్రవరి 8:** మ్యూచువల్‌ఫండ్స్ ఇన్వెస్టర్లకోసం ఈ వారం ఏకంగా 8 కొత్త ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ప్రారంభమ తున్నాయి. నాలుగు ప్రముఖ అసెంట్ మేనేజ్మెంట్ కంపెనీలు ఈ 8 న్యూ ఫండ్ ఆఫర్స్‌తో వస్తున్నాయి. ఈ వారమే సబ్‌స్క్రిప్షన్ మొదలవుతోంది. కొత్తగా వస్తున్న 8 ఫండ్స్‌లో మూడు ఫండ్ ఆఫ్ ఫండ్స్ (డొమెస్టిక్), రెండు థెమాటిక్ ఫండ్స్, ఒక ఈటీఎఫ్, ఒక లో డురేషన్ ఫండ్ ఉన్నాయి. ఫండ్ ఆఫ్ ఫండ్ కేటగిరీలో మీరే అసెట్ నిఫ్టీ మెటల్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 10వ తేదీన మొదలవుతోంది. ఈనెల 23వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. గ్రో బీఎస్ఈ హాస్పిటల్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సైతం ఫిబ్రవరి 10న మొదలై ఫిబ్రవరి 25వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇక ఏంజెల్ వన్ సిల్వర్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 9వ తేదీన మొదలై 23వ తేదీ వరకు కొనసాగుతుంది. థెమాటిక్ ఫండ్ కేటగిరీలో బరోడా బీఎన్‌పీ పరిబాస్ ఈఎస్‌జీ బెస్ట్ ఇన్ క్లాస్ స్ట్రాటజీ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 12వ తేదీనుంచి 26వ తేదీ వరకు కొనుగోలు చేసుకోవచ్చు. ఐటీఐ బిజినెస్ సైకిల్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 13న ప్రారంభమై ఈనెల 27వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇండెక్స్ ఫండ్ కేటగిరీలో గ్రో బీఎస్ఈ హాస్పిటలఖ ఈటీఎఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 11న మొదలై 25వ తేదీ వరకు కొనసాగనుంది. ఏంజెల్ వన్ సిల్వర్ ఈటీఎఫ్ సబ్‌స్క్రిప్షన్ 9వ తేదీన మొదలై 19వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇక బజాజ్ ఫిన్‌సర్వ్ లో డ్యూరేషన్ ఫండ్ కొనుగోళ్లు సైతం సోమవారమే మొదలయి 16వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.



# వారంలో విదేశీ పెట్టుబడులు రూ.8100 కోట్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** వరుసగా మూడునెలలపాటు విత్‌డ్రాలకే మొగ్గుచూపించిన ఎఫ్‌పిఐలు ఫిబ్రవరి మొదటి వారంలో రూ.8100 కోట్లు భారత్ ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడులుపెట్టారు. రిస్క్ సెంటిమెంట్ మెరుగుపడటం, ఇండో యుఎస్ ట్రేడ్‌డీల్ వంటివి కీలకంగా మారాయి. జనవరిలో కూడా విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు రూ. 35,962కోట్లు విత్‌డ్రాచేసారు. డిసెంబరులో రూ.22,611 కోట్లు, నవంబరులో రూ.3765 కోట్లు విత్‌డ్రాచేసినట్లు నేషనల్ డిపాజిటరీస్ గణాంకాలు చెపుతున్నాయి.

2025లో ఎఫ్‌పిఐలు సుమారు రూ.1.66లక్షలకోట్లు విత్‌డ్రా చేసేసారు. విదేశీ పెట్టుబడుల విత్‌డ్రాలో అత్యం త అధ్వాన్న కాలంగా 2025 నమోదయింది. గ్లోబల్ ట్రేడ్ ఉద్రిక్తతలు, అమెరికా సుంకాలు వంటివి విత్‌డ్రాకు దోహదంచేసాయి. ఎఫ్‌పిఐలు ఈనెలలో ఇప్పటివరకూ రూ.8129 కోట్లు పెట్టుబడులు పెట్టినట్లు మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చి ఇండియా ప్రిన్సిపల్‌మేనేజర్ హిమాంశు శ్రీవాస్తవ చెప్పారు. భారత్ ఆర్థికవృద్ధి ముఖచిత్రం క్రమేపీ వృద్ధిబాటలోకి వెళుతుండటమే కీలకమని చెపుతున్నారు. భారత్ అమెరికా వాణిజ్యచర్చలు ఒప్పందం ఖరారు వంటివికూడా కొంత కీలకంగా మారాయి. బడ్జెట్‌లో ఆర్థికరంగ వృద్ధికి దోహదకారి అయిన అంశాలు కూడా చోటుచేసుకోవడం కీలకంగా మారుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువలు రూ.90.30 రికార్డు కనిష్టానికి చేరాయి. క్రమేపీ రూపాయి బలపడి 90కి దిగువకు రావచ్చున్న అంచనాలున్నాయి. మొత్తంగాచూస్తే ఆర్థికవృద్ధి తీరు శరవేగంగా వృద్ధిబాటలోకి వెళుతున్నందున ఈయూట్రేడ్‌డీల్, ఇండోయుఎస్‌ట్రేడ్‌డీల్‌లు వంటివి ఎఫ్‌పిఐలు మరింత పెట్టుబడులు పెట్టేవిధంగా మొగ్గుచూపేందుకు దోహదం చేస్తాయని అంచనా.

# కొత్త ఆదాయపన్ను చట్టం ఫారాలు విడుదల

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** కొత్త ఐటీ చట్టం కింద ముసాయిదా నిబంధనలు, ఫారాలను ఆదాయపు పన్ను విభాగం విడుదల చేసింది. ఆరు దశాబ్దాల కాలం నాటి పాత ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ 1961 స్థానంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొస్తున్నవిషయం తెలిసిందే. నిబంధనల భారాన్ని తగ్గించడం, ట్యాక్స్ పేయర్లకు సులువుగా అర్థం చేసుకునేలా నియమాలను సరళించడమే ఈ కొత్త చట్టం తీసుకురావడం వెనక ఉన్న ప్రభుత్వ ఉద్దేశం. కొత్త ఆదాయపు పన్ను చట్టం ముసాయిదా నిబంధనలు, ఫారాలపై ఫిబ్రవరి 22, 2026 వరకు సంబంధిత వాటాదారులు, ట్యాక్స్ పేయర్లు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చు. ఆ తర్వాత నిబంధనలను, ఫారాలను ప్రభుత్వం నోటిఫై చేయనుంది. పాత ఆదాయపు పన్ను చట్టం 1961లో 511 నిబంధనలు, 399 ఫారాలు ఉన్నాయి. వీటిని కొత్త పన్ను చట్టంలో భారీగా తగ్గించారు. కొత్త ఆదాయపు పన్ను చట్టం ముసాయిదా నిబంధనల్లో 333 రూల్స్, 190 ఫారాలు మాత్రమే ఉన్నాయి. ఆటోమేటెడ్ రీకాన్సిలేషన్, ప్రీఫిల్ వెసులుబాటుతో కొత్త ఫారాలను మరింత సులభతరం చేసినట్లు ఐటీ విభాగం తెలిపింది. ట్యాక్స్ పేయర్లు సులభంగా అర్థమయ్యే భాషనే ఈ ఫారాలలో వాడినట్లు




తెలిపింది. ఏప్రిల్ 1, నుంచి అమలులోకి వచ్చే కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025కి సంబంధించి ఫిబ్రవరి నెలాఖరులోగా తరచుగా అడిగే ప్రశ్నలు, సమాధానాలతో పాటు ట్యాక్స్ ఫారాలు, నిబంధనలు వెల్లడిస్తామని ఇటీవలే కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఛైర్మన్ రవి అగర్వాల్ పేర్కొన్నారు.కొన్ని రోజుల వ్యవధిలోనే ఐటీ శాఖ ముసాయిదా నిబంధనలు, ఫారాలను విడుదల చేయడం గమనార్హం. ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ట్యాక్సులకు సంబంధించి చేసిన ప్రతిపాదనలు, ఐటీ చట్టాన్ని సరళీకరించడం, ట్యాక్స్ పేయర్లకు సులభమైన భాషను అందించడంలోని భాగమేనని రవి అగర్వాల్ తెలిపారు. ఎఫ్ఏక్యూలతో పాటు కొత్త చట్టంపై ఒక ప్రజెంటేషన్‌ను సిద్ధం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఏప్రిల్ జూన్ 2026 మధ్య ఎదురయ్యే ప్రశ్నలు, సమస్యల భారీ రద్దీని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. అందుకు తగినట్లుగా సిద్ధమవుతున్నామని పేర్కొన్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.